




ESTD: 1999

www.voodayam.com

# వుదయం








ఆదిలాబాద్ 12-10-2026 సోమవారం | సంపుటి : 14 | సంచిక :31 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on


# ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కలేరు



## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

### సీజేఐకి వినతిపత్రం సమర్పించనున్నట్లు రాహుల్ ప్రకటన

### 12న సుప్రీంకోర్టుకు పాదయాత్ర

### యువతపై దాడులను ఖండించిన రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ఎఎంఎస్) :** శాంతియుత మార్గంలో నిరసన తెలియజేసేందుకు దిల్లీకి చేరుకున్న యువతపై దాడులు జరగడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విచారం, ఆగ్రహం వ్యక్తం చేశారు. మనం ఆకాంక్షించే భవిష్యత్తు భారత్ ఇది కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు అతీతంగా దేశప్రజలందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే సోమవారం (ఈ నెల 12న) సుప్రీంకోర్టు వరకు బృహత్ పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన సామాజిక మాధ్యమ వేదికగా ప్రకటించారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్‌లు కలిసి దేశ ప్రజల గొంతుకను అణచివేయలేరని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యవాదులను ఎవరూ భయపెట్టలేరని, బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు తమ తప్పులను తెలుసుకుని తప్పుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. ఓట్ల చోరీకి పూర్తిగా ముగింపు పలకాలని, ప్రత్యేక సంస్కృతికి అడ్డుకట్ట వేయాలని, అలాగే ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)కి వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్య సూత్రాలపై విశ్వాసం, రాజ్యాంగం పట్ల నిబద్ధత కలిగిన ప్రతి పౌరుడు ఈ మహాయాత్రలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

# జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకే ఆంక్షలు

## విమానంలోకి చొరబడి కిడ్నాప్ చేశారు

## 20 కేసులు నమోదు, 15 మంది పోలీసులకు గాయాలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ఎఎంఎస్) :** తమను విమానం లోపలికి వచ్చి బలవంతంగా అదుపులోకి తీసుకుని కిడ్నాప్ చేశారని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధి సౌరవ్ దాస్ ఆరోపించారు. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదని, తమ వద్ద ఉన్న చరవాణులను గుంజుకోవడమే కాకుండా న్యాయవాదితో మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జైలు నుంచి విడుదలైన అనంతరం దిల్లీ వేదికగా సీజేపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. దేశంలో తీవ్ర భయాందోళన వాతావరణాన్ని సృష్టించారని, కేవలం ఒక్క వ్యక్తి ప్రయోజనాల కోసమే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రభుత్వం ఎందుకు అంతగా తాపత్రయపడుతోందని ప్రశ్నించారు. ఈ విషయంలో తమ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. మరోవైపు శనివారం నాటి పరిస్థితులు ఎమర్జెన్సీని తలపించాయని సీజేపీ నేత అశుతోష్ రాంకా తీవ్రంగా విమర్శించారు. రైళ్ల రాకపోకలను అడ్డుకోవడంతో పాటు అంతర్జాల సేవలను నిలిపివేసి సాధారణ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కలిసి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటానికి దేశ ప్రజలపైనే యుద్ధం ప్రకటిస్తున్నారని ఆరోపించారు.

### పోలీసుల ఎదురుదాడి 20 కేసులు నమోదు

శనివారం నాటి నిరసనలు, ఘర్షణలకు సంబంధించి మొత్తం 20 కేసులు నమోదు చేసినట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. విధులు నిర్వర్తిస్తున్న భద్రతా సిబ్బందిపై దాడులు చేయడం, ప్రభుత్వ ఉద్యోగుల పనులకు అడ్డంకులు సృష్టించడం వంటి తీవ్ర ఆరోపణలపై ఈ కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా విద్యార్థులపై భౌతిక దాడులు, మహిళల పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించిన అభియోగాలపై అదుపులోకి తీసుకున్న నలుగురు వ్యక్తులపై ప్రత్యేక కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. శనివారం చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో 15 మందికి పైగా పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# గోవాను డ్రగ్స్ అడ్డాగా మార్చేశారు

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**పనాజీ అక్టోబర్ 11 (ఎఎంఎస్)** గోవాలో భూములు అన్యాక్రాంతమైపోతున్నాయని, ఇక్కడి ప్రజలు భారతీయ జనతా పార్టీ పాలనతో తీవ్రంగా విసిగిపోయారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. గోవా ముఖ్యమంత్రిని ప్రమోద్ సావంత్ అనడం కంటే 'ప్రాపర్టీ సావంత్' అనడం సముచితమని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. గోవా రాష్ట్రంలో పర్యటించిన ఆయన.. అక్కడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'గోయ్ రాఖోన్న్' యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దిల్లీలో తలెత్తిన నిరసన కార్యక్రమాల కారణంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గోవా పర్యటనకు రాలేకపోయారని, ఆయనకు ప్రతినిధిగా తాను ఇక్కడికి వచ్చానని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్లను ప్రస్తావిస్తూ.. కుట్రపూరితంగా పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా పేదలు, దళితులు, మైనారిటీలు మరియు ఆదివాసీల ఓట్లను జాబితా నుంచి తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. ''గోవా యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చేశారు. ఈ సుందర రాష్ట్రాన్ని డ్రగ్స్ పెడ్లర్ల అడ్డాగా మార్చేశారు. ఇప్పటికే రెండుసార్లు గోవా ప్రజలను మోసం చేశారు. రాబోయే ఎన్నికల్లో మూడోసారి కూడా భాజపాను నమ్మి ప్రజలు మోసపోవద్దు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది'' అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# 'అంబానీ దళారీ సైన్యం'



**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ఎఎంఎస్) :** శాటిలైట్ ఇంటర్నెట్ సంస్థ 'స్టార్‌లింక్' అధినేత ఎలాన్ మస్క్, ప్రముఖ భారతీయ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించడాన్ని కొనసాగిస్తున్నారు. తాజాగా తన సామాజిక మాధ్యమ వేదిక ద్వారా స్పందిస్తూ.. తనకు సమాధానం ఇచ్చే వారిని 'అంబానీ దళారీ ఇంటర్నెట్ సైన్యం'గా అభివర్ణించారు. భారతీయ విపణిలోకి స్టార్‌లింక్ ప్రవేశించడం ద్వారా స్థానిక ప్రజలకు ఇంటర్నెట్ సేవల్లో మరిన్ని మెరుగైన ప్రత్యామ్నాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంబానీ మద్దతుదారుల వాదనల్లో ఏమాత్రం తర్కం లేదని ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు. ఒకవైపు అంబానీ ఏకఛత్రాధిపత్యంలో అందిస్తున్న తక్కువ ధరలతో స్టార్‌లింక్ పోటీపడలేదని చెబుతూనే, మరోవైపు స్టార్‌లింక్ తీవ్రమైన పోటీదారుగా మారుతుందని అనడం విరుద్ధంగా మరియు హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. భారతదేశంలో స్టార్‌లింక్ సేవలు ప్రారంభమైతే సాధారణ పౌరులకు ఎంపిక చేసుకునే అవకాశం పెరిగి ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.

# శాశ్వత క్యాంపస్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



**హైదరాబాద్, అక్టోబర్ 11 (ఎఎంఎస్) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత భవనాల నిర్మాణంలో జరుగుతున్న తీవ్రమైన జాప్యాన్ని నివారించి, విద్యార్థుల చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గతంలో 2021వ సంవత్సరంలో రూ. 402 కోట్ల పరిపాలనాపరమైన అనుమతులతో మంజూరైన జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం పనులు ఇప్పటికీ నిలిచిపోయాయని కేటీఆర్ గుర్తుచేశారు. మండేపల్లి గ్రామంలో సుమారు 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో తాత్కాలికంగా కొనసాగుతోందని వివరించారు. అయితే, ఈ కళాశాలను ప్రస్తుత ప్రాంగణం నుంచి వేరే ప్రైవేటు భవనానికి తరలించాలనే ప్రతిపాదనలు ఉన్నాయని, ఇది విద్యార్థులకు, అధ్యాపకులకు మరియు సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు మరియు ఇతర మౌలిక వసతులు వృథా కాకుండా చూడాలని కేటీఆర్ సూచించారు. ఈ నేపథ్యంలో, మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి తగిన నిధులు విడుదల చేసి పనులను వేగవంతం చేయాలని కోరారు.

కొత్త భవనాల నిర్మాణం పూర్తయ్యేంత వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ ఎలాంటి నోటీసులు జారీ చేయవద్దని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# యుద్ధంలో కీలక మలుపు



**వాషింగ్టన్:** రష్యా మరియు ఉక్రెయిన్ దేశాల మధ్య ఇంధన మౌలిక వసతులపై పరస్పర దాడులను నిలిపివేసేందుకు ఒప్పందం కుదిరిందని, ఇది తక్షణమే అమల్లోకి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. విద్యుత్ కేంద్రాలు, చమురు క్షేత్రాలు, మరియు వాయు సరఫరా వ్యవస్థల వంటి కీలకమైన ఇంధన వనరులపై దాడులను ఆపివేసేందుకు ఇరుదేశాల ప్రతినిధులు అంగీకరించినట్లు స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక ఒప్పందాన్ని రెండు దేశాలూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకూడదని ఆయన హితవు పలికారు. ఈ మేరకు ఆయన తమ సామాజిక మాధ్యమ వేదిక ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. అంతకు ముందు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ మాట్లాడుతూ.. తమ దేశంలో ఉన్న ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను అడ్డుకోవడం సాధ్యమే అయినప్పటికీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అందుకు ఏమాత్రం సిద్ధంగా లేరని ఆరోపించారు. తమ దేశ ఇంధన వనరులపై రష్యా దాడులను తక్షణమే నిలిపివేస్తే, ప్రతిగా రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలపై తాము జరుపుతున్న దాడులను ఆపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు.

# రాష్ట్ర ప్రగతికి కేంద్రం కట్టుబడి ఉంది

## రూ. 13,000 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం

## ఐఐటీ మద్రాస్‌లో మేధస్సు పరిశోధనా కేంద్రం ప్రారంభం

## సీఎం సి. జోసెఫ్ విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించిన ప్రధాని



**చెన్నై, అక్టోబర్ 11 (ఎఎంఎస్) :** తమిళనాడు రాష్ట్రంలో రూ. 13,000 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించి, కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. చెన్నైలోని ప్రతిష్ఠాత్మక భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ (ఐఐటీ మద్రాస్)లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌తో కలిసి ప్రధాని పాల్గొంటారు. ఈ ప్రాజెక్టులు రహదారి, రైల్వే రవాణా, రేవుల మౌలిక సదుపాయాలు, పెట్రోలియం మరియు శాస్త్రీయ పరిశోధన రంగాలకు సంబంధించినవి. ఇందులో రూ. 3,700 కోట్ల వ్యయంతో చేపట్టే జాతీయ రహదారుల పనులు, చెన్నై రేవు, కామరాజర్ రేవు, వి. ఒ. చిదంబరనార్ రేవుల ఆధునికీకరణ కార్యక్రమాలు, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు ఉన్నాయి. ఈ సభను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. తమిళనాడులో ఒకేసారి రూ. 13,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. ఈ ప్రాజెక్టులు రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే కాకుండా, పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసి రాష్ట్ర యువతకు పెద్దపీట వేసేలా ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.






## ఇంతే కదా...!




# జిబూటి సముద్ర తీరంలో విషాద ఛాయలు

## 15 మంది చిన్నారులతో సహా 109 మంది మృతి

**జిబూటి సిటీ:** తూర్పు ఆఫ్రికా దేశమైన జిబూటి తీరంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వలసదారులతో వెళ్తున్న పడవ నీటమునిగిన ఘటనలో 109 మంది దుర్మరణం చెందారు. మృతుల్లో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు మరియు 15 మంది చిన్న పిల్లలు ఉన్నట్లు అధికారిక వర్గాలు ధృవీకరించాయి. ఈ ప్రమాదంలో మరొక 116 మందికి పైగా గల్లంతయ్యారని అంతర్జాతీయ వలసల సంస్థ ప్రకటన విడుదల చేసింది. సమాచారం ప్రకారం, ప్రమాద సమయంలో సదరు పడవలో దాదాపు 350 మంది ప్రయాణికులు ఉన్నారు. జిబూటి నుంచి యెమెన్ దేశానికి ప్రయాణిస్తున్న క్రమంలో గుహెరే ప్రాంత సమీపంలో ఈ విషాదకర సంఘటన జరిగింది. ఈ ప్రమాదం నుంచి ఇథియోపియా దేశానికి చెందిన 80 మందికి పైగా పౌరులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడగా, ఘటనా స్థలంలో సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు మరియు రక్షణ చర్యలు చేపడుతున్నాయి. మంచి ఉపాధి అవకాశాలు, మెరుగైన జీవన భద్రత కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం వేలాది మంది వలసదారులు జిబూటి మీదుగా ప్రయాణిస్తుంటారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో బాబ్ ఎల్ మండెబ్ జలసంధిని దాటుకుని యెమెన్‌కు చేరుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అంతర్జాతీయ వలసల సంస్థ అందించిన గణాంకాల ప్రకారం.. గడిచిన ఏడాది (2025)లో ఇదే సముద్ర మార్గంలో ప్రయాణిస్తూ 900 మందికి పైగా వలసదారులు ప్రాణాలు కోల్పోవడం లేదా గల్లంతు కావడం జరిగింది.



# ఇంత నిర్లక్ష్యం ఎందుకు?

- ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం.. ముందే ఫిర్యాదు చేసినా స్పందన కరువు!
- ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని తెలిసినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు? హామీలకే పరిమితమవుతారా.. ప్రమాదం జరిగాన తర్వాత మేల్కొంటారా ?

**దౌల్తాబాద్ అక్టోబర్ 11(వుదయం):**

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం కొనాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చెరువు కట్టపై విద్యుత్ స్తంభం కిందకు ఒరిగిన సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడంపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశంలోనే సమస్యను విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లినా, బతుకమ్మ పండుగలోపు మరమ్మతులు చేపడతామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని పేర్కొంటున్నారు.మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వార్డు సభ్యుడు కురుమ స్వామి, వాటర్‌మన్ శ్రీకాంత్ సహకారంతో స్థానికులే సమస్య పరిష్కారానికి ముందుకొచ్చారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశంలోనూ అధికారుల స్పందన ఇంత ఆలస్యమైతే ఎలా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. జరగక ముందే నివారించడం అధికారుల బాధ్యత. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో ప్రమాదకరం గా ఉన్న స్తంభాలు, విద్యుత్ తీగలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అక్రమ నీటి దందాకు దిగ్వాల్ అడ్డా

## అనుమతులు లేకుండానే నీటి సరఫరా సాగుతోందా?

- పత్రికల్లో వార్తలు వచ్చినా స్పందించని అధికారులు.. నాయకుల అండదండలు ఉన్నాయనే అనుమానాలు.. సమగ్ర విచారణకు గ్రామస్థుల డిమాండ్

***కోహీర్, అక్టోబర్ 11 (వుదయం ప్రతినిధి):**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో నీటి వ్యాపారం వివాదాస్పదంగా మారుతోంది. అనుమతులు లేకుండానే వాటర్ ప్లాంట్లు, నీటి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

***పత్రికల్లో వార్తలు వచ్చినా పట్టింపులేదా?***

దిగ్వాల్‌లో సాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నీటి వ్యాపారంపై గత వారం పత్రికల్లో వార్తలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వార్తలు వెలువడిన తర్వాతైనా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాల్సిన అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

***అనుమతులు ఉన్నాయా.. నిబంధనలు పాటిస్తున్నారా?***



దిగ్వాల్‌లో నీటి వ్యాపారం నిర్వహిస్తున్న ప్లాంట్లు, ట్యాంకర్లకు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నీటి వనరుల నుంచి నీటిని సేకరించేందుకు నిబంధనలు పాటిస్తున్నారా? సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను పరీక్షిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. నీటి సేకరణ, నిల్వ, శుద్ధి, రవాణా ప్రక్రియల్లో నిబంధనలు పాటిస్తున్నారో లేదో అధికారులు పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముఖ్యంగా ప్రజలు తాగునీటిగా వినియోగించే నీటి నాణ్యత విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని పేర్కొంటున్నారు.

***రాజకీయ అండదండలు ఉన్నాయనే అనుమానాలు!***

ఈ నీటి వ్యాపారం వెనుక కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే అనుమానాలను గ్రామస్థుల్లో కొందరు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. వ్యాపార నిర్వహణ, అనుమతులు, నీటి సేకరణకు సంబంధించిన అంశాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా అధికారులు చట్టప్రకారం వ్యవహరించాలని కోరుతున్నారు.

***ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా?***

దిగ్వాల్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో నీటి సరఫరాపై వస్తున్న ఆరోపణలను అధికారులు తేలికగా తీసుకోకూడదని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, నీటి వ్యాపారానికి సంబంధించిన అనుమతులను పరిశీలించి, ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు. పత్రికల్లో వార్తలు వచ్చిన తర్వాత కూడా చర్యలు తీసుకోకపోవడంపై ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారా? లేక మౌనం కొనసాగిస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.





# తెలంగాణలో రైతన్నల కరెంట్ కష్టాలు

**ఊర్కొండ ,అక్టోబర్ 11(వుదయం):**

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం కరెంటు సరఫరా సరిగా లేదని రైతుల ఆవేదన.పొలాలకు నీరు పెట్టాల్సిన సమయంలో విద్యుత్ సరఫరాలోఅంతరాయాలతో ఇబ్బందులు పడుతున్న రైతులురెక్కలు ముక్కలు చేసుకుని పంట పండించే రైతన్నకు కనీసం సక్రమంగా విద్యుత్ సరఫరా కూడా అందడంలేదాఅంటూవినిపిస్తుఆవేదనవిద్యుత్ సరఫరాలోఅంతరాయాల వల్ల వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలను నివారించి, నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో.ఊర్కొండపేట, జాకినాలపల్లి, రైతులు రామాంజనేయులు, సూక్కపురం అంజయ్య, శ్రీధర్ రెడ్డి, కటమోని జంగయ్య, ఆలకుంట మల్లేష్,కప్పర చంద్రయ్య, సురేందర్,సాయి రెడ్డి,మోటపురం యాదయ్య, బాల్రాజ్ ,సిరిగిరి జంగయ్య, జల్లయ్య, పోలే కృష్ణయ్య మరియు రైతులుపెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

# అసమానతల నిర్మూలనే బాబాసాహెబ్‌కు నిజమైన నివాళి

- ఆలూరులో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ
- హాజరైన తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య

**గట్టు, అక్టోబరు 11:**



సమాజంలో వేళ్లూనుకున్న అసమానతలు తొలగిపోయి, అణగారిన వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు దక్కిననాడే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు నిజమైన సార్థకత చేకూరుతుందని గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య ఉద్ఘాటించారు. అంబేద్కర్ కలలుగన్న సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం ఆలూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆలూరు అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు.

**హక్కుల పరిరక్షణకు ఐక్యతే శ్రీరామరక్ష**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సరిత తిరుపతయ్య మాట్లాడుతూ... భారత రాజ్యాంగం దేశ ప్రజలకు ప్రసాదించిన హక్కులు, సమాన అవకాశాలే మన ప్రజాస్వామ్య వ్యవస్థకు అసలైన పునాదులని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ వర్గాలు ఐక్యతను చాటుకుంటూ తమ హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయ సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ చూపిన బాట సమానత్వానికి, ఆత్మగౌరవానికి, సామాజిక పరివర్తనకు దిక్సూచిగా నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. అంబేద్కర్ జీవిత పోరాటం, ఆయన అందించిన రాజ్యాంగ విలువలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా నేటి తరానికి నిత్య స్ఫూర్తిగా నిలవాలన్నారు. కేవలం జయంతి, వర్ధంతి వేడుకలకు మాత్రమే పరిమితమవ్వకుండా, ఆయన ఆశయాలను ఆచరణలోకి తెచ్చినప్పుడే సమాజంలో గుణాత్మక మార్పు సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. నేటి యువత విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ, రాజ్యాంగం కల్పించిన హక్కులపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సేవా దృక్పథంతో ముందుకు.. విగ్రహావిష్కరణతో పాటు సేవా కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ... గ్రామానికి చెందిన పలువురు వితంతువులకు సరిత తిరుపతయ్య స్వయంగా చీరలను పంపిణీ చేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆలూరు గ్రామ సర్పంచ్ ఉల్లిగేపల్లి నరసింహులు, అరగిద్ద సర్పంచ్ బాలకృష్ణ నాయుడు, డీసీసీ ఉపాధ్యక్షుడు గట్టు గౌస్, జమ్మిచేడు ఆనంద్, మాచర్ల వెంకటస్వామి గౌడ్, అల్వాల రాజశేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆర్. తిరుమలేశ్, తిమ్మోజీ, ఇమాన్యుల్, జోగులాంబ గద్వాల వార్డు మెంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కె. రవి, లక్ష్మన్న, అయ్యప్ప కార్యకర్తలు, అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వలసలను నివారించండి

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ చిరంజీవి

**నారాయణఖేడ్ అక్టోబర్ 11(వుదయం)**



నారాయణఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అనేక గ్రామాలు, తండాల్లో ప్రజలు ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు,

వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి లభించకపోవడంతో కుటుంబాలను వదిలి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు.నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల అభివృద్ధిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉద్యోగాలు లభించడంతో పాటు, రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులకు కూడా ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పాలకులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలు, తండాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి వంటి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే జీవనోపాధి పొందేలా ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, నియోజకవర్గ అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్ సోహెల్ రహీం తదితరులు పాల్గొన్నారు

# అధికారుల కళ్ల ముందే 'అక్రమ' పర్వం!

- గద్వాలలో కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలు.. పట్టించుకోని మున్సిపల్, పోలీసు యంత్రాంగం ఫుట్‌పాత్‌లు మాయం.. పాదచారుల అవస్థలు.. పట్టణంలో ఆగ్రహజ్వాలలు

**గద్వాల, అక్టోబర్ 11 (వుదయం బ్యూరో)**



పట్టణాల్లో ప్రజా స్థలాలు, ఫుట్‌పాత్‌లను ఆక్రమణదారుల నుంచి కాపాడాల్సిన మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గద్వాల కొత్త బస్టాండ్ ఎదురుగా ఇటీవలే తొలగించిన ఆక్రమణల స్థానంలోనే మళ్లీ పక్కా నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తుండటం అధికారుల అలసత్వానికి అద్దం పడుతోంది. ఉమ్మడి నిర్వహణ పేరిట అధికారులు చేసిన 'హంగామా' కేవలం ప్రజామోదం కోసమేనా? లేక ఆక్రమణదారులకు ఇచ్చిన తాత్కాలిక హెచ్చరిక మాత్రమేనా? అని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. అదే స్థలం.. మళ్లీ అవే నిర్మాణాలు! రద్దీగా ఉండే కొత్త బస్టాండ్ పరిసరాల్లో దుకాణాల ముందున్న ఫుట్‌పాత్‌లు, మున్సిపల్ జాగాలను ఆక్రమించి పనులు చేపట్టడంతో మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు కలిసి గతంలో కూల్చివేశారు. కానీ, అధికారులు అటు వెళ్లగానే ఆక్రమణదారులు మళ్లీ పని ప్రారంభించారు. ఓ టీ స్టాల్, టీవీ షోరూమ్ పరిసరాల్లో తిరిగి నిర్మాణాలు జోరందుకున్నాయి. ఫుట్‌పాత్‌లు కనిపించకుండా పోవడంతో ప్రయాణికులు, పాదచారులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని నడిరోడ్డుపై నడవాల్సి వస్తోంది. నిత్యం వాహనాల రద్దీతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు కంటితుడుపు చర్యలు స్వస్తి చెప్పి, మళ్లీ ఆక్రమణలకు పాల్పడుతున్న భూబకాసురులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రైతు అభ్యున్నతికి గద్వాల గళం!

- పీఎండీడీకేవై వేడుకలకు జిల్లా బృందం
- నేడు ఢిల్లీలో జాతీయ స్థాయి కార్యక్రమం.. కలెక్టర్ సహా నలుగురికి అవకాశం

**గద్వాల, అక్టోబర్ 11 (వుదయం కరస్పాండెంట్ )**



వ్యవసాయ రంగ అభివృద్ధి.. రైతుల ఉత్పాదకత పెంపు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ధన్‌ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) ఏడాది మైలురాయి వేడుకలకు జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధుల బృందం హాజరుకానుంది. అక్టోబర్ 12న న్యూఢిల్లీలోని ఎన్‌ఏఎస్సీ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి కార్యక్రమంలో జిల్లా నుంచి నలుగురు సభ్యులు పాల్గొననున్నారు. కలెక్టర్ నేతృత్వంలో బృందం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌తో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, వ్యవసాయ శాస్త్రవేత్త అర్చన, ప్రగతిశీల రైతు ప్రహ్లాద రెడ్డి ఈ బృందంలో ఉన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు.

వ్యవసాయ ప్రగతికి ప్రాధాన్యం వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సమగ్ర అభివృద్ధిని సాధించడం, రైతుల ఉత్పాదకతను పెంచడం ప్రధాన లక్ష్యాలుగా పీఎండీడీకేవై పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ఏడాది కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకలకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా నుంచి అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్త, ప్రగతిశీల రైతు పాల్గొనడం విశేషం.

# సంగారెడ్డి జిల్లాలో బీజేపీలో భారీ చేరికలు

- శివంపేట గ్రామంలో వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీజేపీలో చేరిన యువకులు

**సంగారెడ్డి జిల్లా అక్టోబర్ 11(వుదయం)**

సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం: చౌట్కూర్ మండలం శివంపేట గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ చేరికల కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చంటి ప్రభు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు భారతీయ జనతా పార్టీలో చేరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ మాజీ ఎంపీ, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ బీబీ పాటిల్ గారు, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి గారు హాజరయ్యారు. పార్టీలో చేరిన యువకులకు కాషాయ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**బీబీ పాటిల్ గారి వ్యాఖ్యలు**

ఈ సందర్భంగా శ్రీ బీబీ పాటిల్ గారు మాట్లాడుతూ, అందోల్ నియోజకవర్గంలో ప్రస్తుతం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్న శ్రీ దామోదర రాజ నర్సింహ గారు నియోజకవర్గ అభివృద్ధికి ఆశించిన స్థాయిలో కృషి చేయలేదని విమర్శించారు.

ప్రజలకు హామీలు ఇస్తూ, మాటలతో కాలం గడపడం తప్ప నియోజకవర్గంలో కనీస అభివృద్ధి కూడా జరగని పరిస్థితి ఉందని అన్నారు. నియోజకవర్గంలోని రహదారుల పరిస్థితిని పరిశీలిస్తే అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో స్పష్టంగా అర్థమవుతుందని పేర్కొన్నారు.నియోజకవర్గ అభివృద్ధికి తగిన కృషి చేయని నాయకులు ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తమ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేసుకొని, వాటి ఆధారంగా ప్రజలను ఓట్లు అడగాలని అన్నారు.

ఈరోజు శివంపేట గ్రామంలో పెద్ద సంఖ్యలో యువకులు భారతీయ జనతా పార్టీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. యువత బీజేపీలో చేరడం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని, యువకులందరినీ కలుపుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగుతామని తెలిపారు.

**చంటి ప్రభు గారి వ్యాఖ్యలు**

బీజేపీ ఎస్సీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చంటి ప్రభు గారు మాట్లాడుతూ, అందోల్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.నియోజకవర్గంలోని రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే, మంత్రి నివాసానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఉండకూడదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.బీజేపీలో చేరిన యువకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో అందోల్ నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేసి ప్రజల మద్దతుతో ముందుకు సాగుతామని తెలిపారు.

**గోదావరి అంజిరెడ్డి గారి వ్యాఖ్యలు**

బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి గారు మాట్లాడుతూ, తెలంగాణలో 2029 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.అందోల్ నియోజకవర్గంలో కూడా బీజేపీ జెండా ఎగురవేయడానికి యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేయాలని సూచించారు.



యువత పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరడం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని, కొత్తగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులుఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ రాశేకర్ రెడ్డి గారు, జిల్లా నాయకులు శ్రీ జగదీశ్వర్ పాటిల్ గారు, జిల్లా కార్యదర్శి శ్రీ భూమన గారు, బీజేపీ యువమోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీ బొర్రా ప్రవీణ్ యాదవ్ గారు, యువమోర్చా రాష్ట్ర కోశాధికారి శ్రీ నరేంద్ర దేశ్‌పాండే , మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీ బుట్టో , లేబర్ సెల్ కన్వీనర్ శ్రీ నాయకోటి యాదగిరి , ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్ శ్రీ పటంగి సత్యనారాయణ గారు, అందోల్ అసెంబ్లీ లీగల్ సెల్ కన్వీనర్ శ్రీ కలాలి వినోద్ కుమార్ , యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ తెలుగు సాయి తేజ , యువ న్యాయవాది శ్రీమతి చంటిక దేవిక పాల్గొన్నారు.అలాగే కిసాన్ సెల్ జిల్లా కార్యాలయ కార్యదర్శి సార రాజు చౌట్కూర్ మండల ఉపాధ్యక్షులు ముకుందం ప్రవీణ్ రెడ్డి ప్రభు కుమార్ , శ్రీ సాయి , వెండికోల శివ , ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి చౌట్కూర్ మండల బీజేపీ అధ్యక్షులు శ్రీ నీరుడి ప్రవీణ్ గారు అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ముఖ్య అతిథులకు, నాయకులకు, కార్యకర్తలకు, బీజేపీలో చేరిన యువకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ బీజేపీ ఎస్సీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చంటి ప్రభు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆశా వర్కర్ల హక్కుల కోసం గొంతెత్తితే అరెస్టులా?

- అక్రమ అరెస్టులను ఖండించిన పరిగి బీఆర్ఎస్ నాయకులు:

**పూడూర్ అక్టోబర్ 12, (పూదయం) వికారాబాద్ జిల్లా**




కొడంగల్‌లో ఆదివారం ఆశా వర్కర్ల హక్కుల సాధన కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరవుతున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబుని, ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోషా ని కొడంగల్ పోలీసులు అరెస్టు చేసి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.కేవలం ఆశా వర్కర్ల సమస్యలు, హక్కులపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నామని, ఎలాంటి ర్యాలీలు గానీ, ఆందోళన కార్యక్రమాలు గానీ నిర్వహించడం లేదని స్పష్టం చేసినప్పటికీ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం నిర్వహించుకోవడం కూడా తప్పేనా? ఆశా వర్కర్ల హక్కుల కోసం మాట్లాడే నాయకులను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం వారి గొంతును నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సింది పోయి, వారి తరపున మాట్లాడే నాయకులను పోలీసులతో అణచివేయడం సరికాదని పేర్కొన్నారు.అరెస్టు చేసిన నాయకులకు సంఘీభావం తెలిపిన పరిగి బీఆర్ఎస్ నాయకులు ఈ చర్యలను తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో పరిగి మండల అధ్యక్షులు ఆర్. ఆంజనేయులు , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ , సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి , కౌన్సిలర్లు జాక్ రవికుమార్ , మీదిగడ్డ శ్రీనివాస్ , ఆంజనేయులు , శశాంక్ రెడ్డి , నరేష్ యాదవ్ బి ఆర్ ఎస్ లీగల్ సెల్ చైతన్య కిరణ్, తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# పెద్ద చింతకుంట లో ఘనంగా దుర్గామాత కు మంగళ హారతులు



**మరికల్ అక్టోబర్ 11 (వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్ర పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలో ఆదివారం మొదటి రోజు అమ్మ దేవి నవరాత్రుల ఉత్సవం ఊరేగింపుతో మంగళహారతులతో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు ప్రతిష్ఠించే దుర్గాదేవి విగ్రహాన్ని సంప్రదాయబద్ధంగా మేళ తాళాలతో మంగళ హారతులతో అమ్మవారిని పెద్ద ఎత్తున ఊరేగించారు అనంతరం వేద పండితులు మంత్రాలతో ప్రతిష్ఠించి ప్రత్యక పూజలు నిర్వహించారు మొదటి రోజు బాల త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# BRS నాయకులపై కేసు నమోదు

**మరికల్ అక్టోబర్ 11 ( వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్రంలోని BRS నాయకులపై మరికల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు రైతులకు కోయిల్ సాగర్ నీటిని పంటలకు విడుదల చేయాలని ధర్నా చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీస్ వాళ్లు తెలిపారు మేము శాంతియుతంగా రైతులకు పంటలు ఎండిపోతుంటే నీటి కోసం ధర్నా చేస్తుంటే మాపైన అక్రమ కేసులు పెట్టినా గాని కార్యకర్తలు నిలదీశారు ఈ కార్యక్రమంలో రాజ వర్ధన్ రెడ్డి రాజేందర్ గౌడ్ కృష్ణారెడ్డి అశోక్ మతిన్ విష్ణువర్ధన్ రెడ్డి కానుగంటి నారాయణ రామస్వామి బసంత్ నరసింహులు తో పాటు టిఆర్ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు చేశారు





# గ్రేటర్ హైదరాబాద్



## ముడిమ్యాల్‌లో వీధి కుక్కల బీభత్సం.. 23 గొర్రెలు మృతి!



- **రూ.3 లక్షల నష్టం.. దిక్కుతోచని స్థితిలో బాధిత రైతు**

**చేవెళ్ల,అక్టోబర్ 11 (ఉదయం)**

వీధి కుక్కల దాడితో ఓ రైతు కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. చేవెళ్ల మండలం ముడిమ్యాల్ గ్రామానికి చెందిన రైతు మొండ్ర మల్లేష్ గొర్రెల మందపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో సుమారు 23 గొర్రెలు మృత్యువాత పడటంతో రైతుకు భారీ నష్టం వాటిల్లింది.రోజూ మాదిరిగానే ఉదయం నిద్రలేచి గొర్రెల మంద వద్దకు వెళ్లిన మల్లేష్‌కు హృదయవిదారక దృశ్యం కనిపించింది. గొర్రెలు రక్తపు మడుగులో విగతజీవులుగా పడి ఉండటాన్ని చూసి ఆయన కన్నీరుమున్నీరయ్యాడు. కుటుంబ పోషణకు ఆధారమైన గొర్రెలు మృత్యువాత పడటంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశాడు.ఈ దాడితో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.పెరుగుతున్న కుక్కల బెడద.. రైతుల్లో ఆందోళనఘటన విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని బాధిత రైతును ఓదార్చారు. గ్రామంలో వీధి కుక్కల సంచారం, దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రజలు, పశువుల రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.బాధితుడికి ప్రభుత్వం పరిహారం అందించాలిజీవనాధారమైన గొర్రెలను కోల్పోయిన మొండ్ర మల్లేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.సంబంధిత అధికారులు ఘటనపై విచారణ జరిపి నష్టాన్ని అంచనా వేసి, బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

## బీసీ న్యాయవాదుల సంఘం

- **హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలి**
- **బీసీ న్యాయవాదుల సంఘం తీర్మానం**

**హైదరాబాద్, అక్టోబర్**



ఈ రోజు హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన బీసీ న్యాయవాదుల సంఘం సమావేశంలో, దేశంలోని హైకోర్టులు మరియు సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల నియామకాల్లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యత కల్పించాలని సంఘం తీర్మానించింది.ఎస్సీ,ఎస్టీ,బీసీ మరియు మైనారిటీ, మహిళ వర్గాలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా న్యాయవ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది.ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తున్నందున, సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయమూర్తుల నియామకాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం అవసరమని సంఘం అభిప్రాయపడింది.న్యాయవ్యవస్థలో సామాజిక వైవిధ్యం పెంపొందించడం, అణగారిన మరియు వెనుకబడిన వర్గాలకు న్యాయవ్యవస్థలో తగిన అవకాశాలు కల్పించడం ద్వారా రాజ్యాంగం ఆశించిన సామాజిక న్యాయ లక్ష్యాలను సాధించవచ్చని సమావేశం పేర్కొంది.ఈ మేరకు సమావేశంలో ఆమోదించిన తీర్మానాన్ని భారత రాష్ట్రపతికి మరియు తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌కు పంపించాలని బీసీ న్యాయవాదుల సంఘం నిర్ణయించింది.న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే దిశగా సంబంధిత రాజ్యాంగ సంస్థలు, ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని సంఘం విజ్ఞప్తి చేసింది.

## గ్రీన్ మెడోస్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



- **ఈ నెల 18న సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు**

**బీరంగూడ (ఉదయం):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ గ్రీన్ మెడోస్‌లో గ్రీన్ మెడోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నారు. కాలనీలోని గణేష్ పార్క్ వేదికగా నిర్వహిస్తున్న ఈ వేడుకలు మహిళల్లో పండుగ ఉత్సాహాన్ని నింపుతున్నాయి. దసరా పండుగ వేడుకల్లో భాగంగా అక్టోబర్ 10వ తేదీ శనివారం సాయంత్రం 5:30 గంటలకు ర్వహిస్తూ మహిళలు పాటలు, సంప్రదాయ ఆచారాల ద్వారా తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యత, మన సంప్రదాయాల గొప్పతనాన్ని చా ప్రజల జీవన విధానంతో ముడిపడిన ప్రత్యేకమైన పండుగ. ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి, పాటలు పాడుతూ మహిళలు సామూహికంగా జరుపుకునే ఈ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా విశేష ప్రాధాన్యత ఉంది. పూల అందాలు, సంప్రదాయ పాటలు, మహిళల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలు ప్రతి కాలనీలో పండుగ వాతావరణాన్ని తీసుకొస్తాయి. ఇదిలా ఉండగా, గ్రీన్ మెడోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18వ తేదీ ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు **సద్దుల బతుకమ్మ వేడుకలను** నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గణేష్ పార్క్ వద్ద జరిగే ఈ కార్యక్రమంలో కాలనీలోని మహిళలు, కుటుంబ సభ్యులు, గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు. పండుగలను సమష్టిగా నిర్వహించడం ద్వారా కాలనీలో స్నేహ భావం, ఐకమత్యం పెంపొందుతాయని నిర్వాహకులు ఆశిస్తున్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు, పూల సౌందర్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటూ మన సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి.

## జర్నలిస్టుల సమస్యల కోసం ప్రెస్ క్లబ్ కార్యాచరణ ప్రణాళిక





**హైదరాబాద్, అక్టోబర్ 11:**

జర్నలిస్టులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమాజిగూడలో ఆదివారం నాడు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఎస్. విజయకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రెస్ క్లబ్ సీనియర్ జర్నలిస్టులు, సభ్యులు హాజరయ్యారు. ఏడాది కాలంలో మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యులకు సర్వసభ్య సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ప్రెస్ క్లబ్ స్థలం లీజు వెంటనే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రెస్ క్లబ్ ఏజీఎం ఏకగ్రీవంగా తీర్మానించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని దీనికోసం అన్ని జర్నలిస్టు సంఘాలను, యూనియన్లను కలుపుకొని కార్యాచరణ ప్రణాళిక అమలు చేసేందుకు కార్యవర్గం తీర్మానం ఆమోదించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, వయోధిక పాత్రికేయులకు పెన్షన్లను ఇవ్వాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రెస్ క్లబ్ ఏజీఎం తీర్మానించింది. ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ.రాజేష్, అరుణ అత్తలూరి, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్ , వర్ధెల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు ముత్యాల సత్తిబాబు, ఎం. రమాదేవి, రచన ముడుంబై, వనం.నాగరాజు, ఎన్.శ్రీనివాస్ రెడ్డి, అమిత్ బట్టు, అశోక్ దయ్యాల, రాజేశ్వరి కల్యాణం, శంకర్ శిగ సర్వసభ సమావేశంలో పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టులు దేవులపల్లి అమర్, ఆర్ .శైలేష్ రెడ్డి, దిలీప్ రెడ్డి, రవికాంత్ రెడ్డి సహా యూసుఫ్ బాబు తదితరులు హాజరయ్యారు. మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యుడి కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం తక్షణం అందజేయాలని ప్రెస్ క్లబ్ సర్వసభ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు నాయకులు దేవులపల్లి అమర్ ను ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి శాలువతో సత్కరించింది.

## చేవెళ్ల నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్‌గా బేగరి సుశాంత్ నియామకం



- **కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: బేగరి సుశాంత్**

**చేవెళ్ల, అక్టోబర్ 11 (ఉదయం)**

చేవెళ్ల నియోజకవర్గ అదివారం కాంగ్రెస్ పార్టీలో బేగరి సుశాంత్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు.నియోజకవర్గ ఎస్సీ సెల్ (SC సెల్) చైర్మన్‌గా ఆయనను నియమిస్తూ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ క్యారగరి శ్రీధర్, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీమ్ భరత్ చేతుల మీదుగా సుశాంత్ నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా బేగరి సుశాంత్ మాట్లాడుతూ.. తనపై కాంగ్రెస్ పార్టీ నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు.పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ,ఎస్సీ వర్గాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు .ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ,సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు,వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి కాంగ్రెస్ నియామకాలు



- **చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ పామెన భీమ్ భరత్ చేతుల మీదుగా ఘన సన్మానం**

**శంకర్ పల్లి, అక్టోబర్ 11 (ఉదయం)**

చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా మరో అడుగు పడింది. శంకర్ పల్లి మండలం మరియు మున్సిపాలిటీ ఎస్.సీ సెల్ అధ్యక్షుల ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది.చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో, మహాలింగాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పల్లుట్ల నర్సింలు శంకర్ పల్లి మండల ఎస్ సీ సెల్ అధ్యక్షుడిగా, అదేవిధంగా కుంటి దేవయ్య నీ శంకర్ పల్లి మున్సిపల్ ఎస్ సీ సెల్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీమ్ భరత్ నూతనంగా ఎన్నికైన ఇరువురు అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పామెన భీమ్ భరత్ మాట్లాడుతూ..."రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి గారి ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీలో దళిత వర్గాలకు పెద్ద పీట వేస్తున్నాం. ఎస్ సీ సెల్ ను గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలి. పల్లుట్ల నర్సింలు, కుంటి దేవయ్య ఇద్దరూ కష్టపడి పనిచేసే నాయకులు. వారి నాయకత్వంలో శంకర్ పల్లిలో ఎస్ సీ సెల్ మరింత బలంగా తయారవుతుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలి" అని పిలుపునిచ్చారు.నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు పల్లుట్ల నర్సింలు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీకి, పామెన భీమ్ భరత్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్.సీ వర్గాల సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అదే విధంగా మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు న్సిపాలిటీలోని ప్రతి వార్డులో SC సెల్ కమిటీలను వేసి పార్టీని బలోపేతం చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో టీ పి సి సి కార్యదర్శులు రామ్ రెడ్డి గారు, షాబాద్ మండల అధ్యక్షులు పెంట రెడ్డి గారు , మొయినాబాద్ మండల అధ్యక్షులు సత్య నారాయణ గారు, మొయినాబాద్ మండలం మాజీ అధ్యక్షులు మానయ్య గారు, షాబాద్ మాజీ సర్పంచ్ రవీందర్ గారు , షాబాద్ సర్పంచ్ అశోక్ గారు , జిల్లా వైస్ ప్రెసిడెంట్ పడాల రాములు గారు , జిల్లా సెక్రెటరీ శ్రీకాంత్ రెడ్డి గారు , మన్మరి మాజీ సర్పంచ్ సత్యం గారు , మొయినాబాద్ వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి , గన్నెపాగ నర్సింగ్ రావు ,విఠల్ యాదవ్ , బిక్షపతి , డైరెక్టర్ బాల కృష్ణ రెడ్డి, బద్దం కృష్ణ రెడ్డి, శంకర్ పల్లి మండల వైస్ ప్రెసిడెంట్ నసీరుద్దీన్ , డైరెక్టర్ రవీందర్ రెడ్డి , గణపురం ప్రసాద్ , శంకర్ పల్లి మండల సేవాదళ్ ఉపాధ్యక్షుడు దోసాడ పెంటారెడ్డి, చందిప్ప గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తర్ పల్లి భరత్ ,సంజయ్ , దయానంద్ గౌడ్ , చంద్రశేఖర్ , శశికాంత్ ,కిరణ్ నవీన్ ,గూడూరు శ్రీను మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేవెళ్ళ నియోజకవర్గం SC విభాగం నాయకులు, అన్ని మండలాల ఈ SC విభాగం నాయకులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ

**జిన్నారం అక్టోబర్ 11(ఉదయం ప్రతినిధి)**



గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్యపల్లి గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నవరాత్రుల్లో మొదటి రోజు ఆదివారం దుర్గామాత బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శరన్నవరాత్రుల నేపథ్యంలో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారగా, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## రూ.31వేల విరాళంతో అండగా

**జిన్నారం అక్టోబర్ 11(ఉదయం ప్రతినిధి)**

జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని మంగంపేట గ్రామానికి చెందిన మన్నే బాలకృష్ణ అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి 1992-93 పదో తరగతి బాల్యమిత్రులు అండగా నిలిచారు. పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.31 వేల ఆర్థిక సాయం సేకరించి ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. దశాబ్దాలు గడిచినా స్నేహబంధాన్ని మరువకుండా కష్ట కాలంలో కుటుంబానికి అండగా నిలిచిన బాల్యమిత్రుల ఔదార్యాన్ని పలువురు అభినందించారు. కష్టాల్లో ఉన్న మిత్రుడి కుటుంబాన్ని ఆదుకోవడంలోనే నిజమైన మానవత్వం ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాదగిరి, ఆనంద్, వినోద్, శంకర్, సంజీవ, నరేందర్, నాగరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కంతేటి వెంకట సుబ్బారావు కు గేమ్ చేంజర్ అవార్డు




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11,(ఉదయం ప్రతినిధి ),**

విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఫౌండర్ సచ్చివోలు రాంబాబు ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి గేమ్ చేంజర్ అవార్డ్స్ 2026 ను ఎల్ వి ప్రసాద్ ఆడిటోరియంలో జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా ప్రైమ్ 9 న్యూస్ ఛానల్ చైర్మన్ బండి శ్రీనివాస రఘువీర్ రిటైర్డ్ ఐపీఎస్ సురేందర్ రెడ్డి ప్రముఖ నిర్మాత దర్శకులు నాగబాల సురేష్ కుమార్ అతిథులుగా హాజరైన కార్యక్రమంలో ప్రకటించారు. సామాజిక సేవ విభాగంలో కంతేటి వెంకట సుబ్బారావు ను గేమ్ చేంజర్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ సేవా విభాగంలో సేవలు అందుస్తున్న వారిని గుర్తించి అవార్డ్స్ అందించి ఘనంగా సత్కరిస్తున్న విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ ఫౌండర్ రాంబాబు కు, ముఖ్య అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు.

## భూదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**నారాయణపేట అక్టోబర్11(ఉదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ అంబ భవాని మందిర్ ఎస్ ఎస్ కె సమా జము ధ్రువ పేట నారాయణపేట వారి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారు ఆదివారం శ్రీ భూదేవి రూపంలో దర్శన నిచ్చారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## బీఆర్ఎస్‌లోకి ప్రొద్దుటూరు నేతలు

- **ప్రొద్దుటూరులో బీఆర్ఎస్‌కు బలం.. గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ నుంచి భారీ చేరికలు**

**శంకర్‌పల్లి అక్టోబర్ 11 (ఉదయం)**



చేవెళ్ల నియోజకవర్గం, శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరు గ్రామంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మాజీ హోం, ఐటీ, విద్యా, భూగర్భ శాఖల మంత్రి, ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి సమక్షంలో పలువురు నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువాలు కప్పుకొని బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రొద్దుటూరు మాజీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ఏనుగు నరసింహారెడ్డి, బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన నక్క మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ మూడో వార్డు సభ్యురాలు అనిత రమేష్, పదో వార్డు సభ్యుడు తిరుపతిరెడ్డి సహకారంతో ఈ చేరికలు జరిగాయి. మండల పార్టీ అధ్యక్షుడు గండిచెర్ల గో మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రొద్దుటూరు మాజీ వార్డు సభ్యుడు నాని రత్నం కూడా ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. బొల్లారం జంగారెడ్డి సైతం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా గులాబీ కండువా నాయకులు ఏనుగు గోపాల్‌రెడ్డి, పెంటరెడ్డి, మాజీ వార్డు సభ్యుడు గౌండ్ల వీరేశం, ధరణి కిరణ్ యాదవ్, వార్డు సభ్యులుగా బూడిదుల అరుణ మల్లేష్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు అభినయ్ గౌడ్, నట్టలు కుమార్, చాకలి గోపాల్, నాని ప్రభాకర్, బి. మల్లేష్, బి. మాణిక్యం, కె. బ్రహ్మం, వరుణ్ గౌడ్, నక్క రాజు, నట్టల మల్లేష్, నగేష్, సురేష్, మొటే యాదయ్య, రాంచంద్రయ్య, పెంటోగోని శ్రీపాల్, నక్క మాణిక్యం, నక్క కృష్ణ, బి. మహేష్, నాని భాను ప్రసాద్, బి. బన్నీ, డి. కిరణ్, నక్క నర్సింలు, బి. రామచందర్, బి. యాదయ్య, నక్క విశాల్, నక్క గణేష్ గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రొద్దుటూరులో బీఆర్ఎస్ రాజకీయ కార్యకలాపాలకు కొత్త ఊపునిచ్చిందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.ప్రొద్దుటూరులో తాజా చేరికలతో రాబోయే రోజుల్లో గ్రామ రాజకీయ సమీకరణాలు ఎలా మారుతాయన్న అంశంపై స్థానికంగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా బీజేపీ నుంచి ఏనుగు నరేందర్‌రెడ్డి సుమారు 50 మంది అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరడం, కాంగ్రెస్ నుంచి నాని రత్నం వంటి మాజీ ప్రజాప్రతినిధులు పార్టీలో చేరడం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మాజీ సర్పంచ్ కొమ్మారెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి మద్దతు కూడా రోజుల్లో మరిన్ని చేరికలు జరిగే అవకాశం ఉందనే చర్చ స్థానికంగా వినిపిస్తోంది. అయితే ఈ రాజకీయ పరిణామాలు గ్రామంలో ఏ మేరకు ప్రభావం చూపుతాయన్నది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది. మొత్తంగా ప్రొద్దుటూరులో బీఆర్ఎస్ పార్టీలోకి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల చేరికలు గ్రామ రాజకీయాల్లో ఆసక్తిని పెంచాయి.


**దక్షిణ కోస్తా రైల్వే**

విశాఖపట్నం

www.scor.indianrailways.gov.in

**ఇ-టెండరు ప్రకటన నం.26.2026, తేది:07.10.2026**

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఇంజినీర్/ కో-ఆర్డినేషన్/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండరు కోరుచున్నారు.

క్ర.సం.01, టెండరు నం. Engg-GTL-Bridges-2163, పని వివరణ: గుంతకల్ డివిజన్ SW1: SSE/Br/RU అధికార పరిధిలో వివిధ మేజర్ బ్రిడ్జిలు మరియు ఆర్.ఓ.బిల గ్రాడెల్ అరేంజ్‌మెంట్ పని ఏర్పాటు. SW2: BAY-GTL. GY-KLU & DMM-PAK సెక్షన్: SSE/Br/Central/GTL అధికార పరిధిలో వివిధ మేజర్ మరియు ఆర్.ఓ.బిల గ్రాడెల్ అరేంజ్‌మెంట్ ఏర్పాటు. ప్రతిపాదిత విలువ: రూ.5,93,82,199.11 పై. బయానా: రూ.11,87,600.00 పై.

క్ర.సం.01, టెండరు నం. Engg-GTL-Bridges-2164, పని వివరణ: గుంతకల్ డివిజన్ మూడు సంవత్సరాల కాలానికి వాటర్‌వే బ్రిడ్జ్‌స్ కొరకు వాటర్ లెవల్ మానిటరింగ్ సిస్టమ్ కొరకు ప్రతిపాదిత వార్షిక నిర్వహణ - మొత్తం 7 బ్రిడ్జిలు ( RU-GY 579 UP, GDR-RU 59 UP, GDR-RU 118 DN, KLU-GY 45, RU-GY 688 DN, GTL-WD 1017 DN, BAY-GTL 292 UP) ప్రతిపాదిత విలువ: రూ.62,55,900.00 పై. బయానా: రూ.1,25,100.00 పై.

ఏదైనా సవరణ ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్/పనులు /గుంతకల్

PUB/SCoR-390

**టెండరు ప్రకటన నం. GTL-EM-47-2026-27 తేది: 08.10.2026**

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ నిర్వహణ/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

టెండరు నం: GTL-EM-47-26-27, పని పేరు: గుంతకల్ డివిజన్ - విద్యుత్ సామర్థ్యత మెరుగుపరుచుట కొరకు AD, HX, NRE, RC మరియు RU సెక్షన్‌లలో APFC ప్యానెల్స్ ఏర్పాటు. సుమారు విలువ: రూ.1619304.14.

ముగింపు తేది మరియు సమయం: 30.10.2026న 15:00 గం.కు

టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in కు లాగిన్ కాగలరు. టెండరుకు ఏదైనా సవరణ ఉంటే, ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

గమనిక: ఈ ఇ-టెండరులో పాల్గొనుటకు/ బిడ్ వేయుటకు టెండరుదారు చెల్లుబాటులో గల DSC (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్) కలిగి ఉండవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, నిర్వహణ,గుంతకల్

PUB/SCoR-391

**ఇ-టెండరు ప్రకటన నం. GNT/E.08/GS/TrD/2026-27**

దిగువ పనుల కొరకు దిగువ సంతకందారు 09.11.2026న 15.30 గం. వరకు కాంట్రాక్టర్ల నుండి ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

క్ర.సం.:01, టెండరు శీర్షిక: NLPD: NLPD స్టేషన్ వద్ద సరుకు పరీక్ష సౌకర్యాల స్థాయి పెంపుదల - 25kv OHE ఏర్పాట్లు. టెండరు నిర్దేశ నం.: GNT/E.08/GS/TrD/2026-27, సుమారు విలువ: రూ.3,84,15,401/-. బయానా: రూ.7,68,300/-. టెండరు ఫారం ధర (వాపసు రానిది) : లేదు.

ఇ-బిడ్ల ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది మరియు సమయం: 09.11.2026న 15.30 గం.వరకు

ఏదైన సవివరమైన సమాచారం కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in కొరకు 08.10.2026 నుండి 09.11.2026న 15.30 గం. వరకు లాగాన్ కాగలరు.

ఏదైన తదుపరి సమాచారం / సవరణ ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే తెలియచేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ /TRD/గుంటూరు

SCoR-A431

PUB/SCoR-392

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి వెబ్‌సైట్ http://www.ireps.gov.in www.scor.indianrailways.gov.in

# ఉష
వుదయం సాహిత్యం

# పూల గోపురాల బతుకమ్మ

గౌరీ దేవి దివ్య
ఆదరువు
బతుకునిచ్చే ప్రేమ
చెరువు
పల్లెంలో పువ్వుల
కొలువు
రంగుల సింగిడి
నెలవు
ఆనందోత్సాహాల
తావు
లేదెపుడూ
పూలకు కరువు
స్త్రీత్వం ఉట్టిపడే
బతుకమ్మలు !

బతుకమ్మ చుట్టు
పట్టు చీరలు
తంగేడు పసుపు
పూరేకులు
గునుగు గుబాళించే
రేవులు
సీత జడ పూల చిత్ర



విచిత్రాలు
ముద్ద బంతి పూల
మురిపాలు
గుమ్మడి పూవ్వుల్లో
గౌరమ్మలు
దీర్ఘ సుమంగళీ భవా
దీవెనలు !

కోలాటాలు,
జనపదాల హోరులు
నిత్య నైవేద్యాల
వితరణలు
ఊరు వాడల్లో జోరు
ఊరేగింపులు
బతుకమ్మ
సంతోషాల విందులు
పూల పండుగ భక్తి
ప్రపత్తులు
తెలంగాణ అంతటా
పూల జాతరలు
పల్లె పట్నాల్లో
బతుకమ్మ
సంబరాలు !

బంగారు
బతుకునియ్యవే
బతుకమ్మ
గుమ్మల నిండా
సిరిసంపదల నియ్యవే
ఆయురారోగ్యాల్ని
ప్రసాదించవే
మాయమ్మ
తీరొక్క పూల సింగిడి
సుగంధాలు చల్లవే
ప్రకృతి సౌందర్యాల్ని
ప్రసాదించవే మా తల్లి
పూల గోపురాల
గుడికి వందనాలు
మాత
అంగిలి పూల నుంచి
సద్దుల బతుకమ్మ
దాకా..
ఊరు వాడ ఊరేగవే
మా ముద్దుల
బతుకమ్మ !



మధుసూదన్ రెడ్డి
9949700037

# పల్లె మాట మాయమైతే... మన మట్టివాసనే మాయమవుతుందా?

పెద్దల పలుకుల్లో బతికిన తెలుగు.. పల్లె జీవనంతో పెనవేసుకున్న పాత పదాలు కనుమరుగవుతున్న వేళ.. ఒక పదంతో పాటు ఒక జ్ఞాపకం, ఒక వృత్తి, ఒక ఆచారం, ఒక జీవన విధానం కనుమరుగవుతున్నా? పల్లె అంటే కేవలం పొలాలు కాదు... పల్లె అంటే ఒక భాష. ఆ భాషలో మట్టి వాసన ఉంటుంది. చెమట చుక్క ఉంటుంది. పంట పరిమళం ఉంటుంది. అమ్మమ్మ కథ ఉంటుంది. తాతయ్య సామెత ఉంటుంది. రైతు నాగలి చప్పుడు ఉంటుంది. చెరువు గట్టు మీద పలికిన మాట ఉంటుంది. పండుగ పాట ఉంటుంది

.ఇంటి వాకిలి నుంచి పొలం గట్టు వరకు ప్రతి అడుగుకూ ఒక పదం ఉండేది. ఇప్పుడు కాలం మారుతోంది. ఇళ్లు మారుతున్నాయి. వృత్తులు మారుతున్నాయి. వ్యవసాయ పద్ధతులు మారుతున్నాయి. పిల్లల ఆటలు మారుతున్నాయి. ఈ మార్పుల మధ్య పల్లె నోట సహజంగా వినిపించిన ఎన్నో పాత తెలుగు పదాలు నిశ్శబ్దంగా కనుమరుగవుతున్నాయి. పదం వెనుక ఒక జీవితం పాత పదం అంటే పాతబడిపోయిన మాట కాదు.



అది ఒక కాలానికి సంబంధించిన జీవన సాక్ష్యం. ఒక వస్తువుకు పెట్టిన పేరు కావచ్చు. ఒక పనికి పెట్టిన పేరు కావచ్చు. ఒక పంట పద్ధతికి సంబంధించిన పదం కావచ్చు. ఒక వృత్తి నైపుణ్యాన్ని సూచించే మాట కావచ్చు. ఒక పండుగ ఆచారాన్ని గుర్తుచేసే పలుకు కావచ్చు. అందుకే ఒక పదం కనుమరుగైతే దాని వెనుక ఉన్న జీవన అనుభవం కూడా మసకబారుతుంది.

* వాకిలి నుంచి లోగిలి వరకు

... ఇంటికీ ఒక భాష ఉండేది పాత పల్లె ఇంటిని గుర్తు చేసుకుంటే వాకిలి, ముంగిలి, అరుగు, గడప, వసారా, లోగిలి వంటి పదాలు ముందుకు వస్తాయి. ఇవి కేవలం ఇంటి భాగాల పేర్లు కావు. వాటితో ఒక జీవనశైలి ముడిపడి ఉండేది. వాకిట్లో ముగ్గు పడేది. అరుగు మీద పెద్దలు కూర్చునేవారు. గడప దగ్గర అతిథిని పలకరించేవారు. వసారాలో కుటుంబ సంభాషణలు జరిగేవి. ఇంటి నిర్మాణం మారడంతో ఈ పదాలు కూడా రోజువారీ వాడుకలో తగ్గిపోయాయి.* పాక... కొట్టం... గాదె... దొడ్డి వ్యవసాయ కుటుంబానికి ఇల్లు అంటే నాలుగు గోడలు మాత్రమే కాదు. ఇంటి చుట్టూ పాక, కొట్టం, గాదె, దొడ్డి వంటి ప్రదేశాలు ఉండేవి. పశువులు, ధాన్యం, వ్యవసాయ పనిముట్లు, ఇంటి అవసరాలు అన్నీ ఆ జీవన నిర్మాణంలో భాగమే. ఇప్పుడు ఆధునిక ఇళ్లలో ఆ నిర్మాణాలు కనిపించకపోవడంతో వాటి పేర్లు కూడా అరుదవుతున్నాయి.* రైతు నోట బతికిన వ్యవసాయ తెలుగు పల్లె పదజాలంలో వ్యవసాయానికి సంబంధించిన పదాలకు ప్రత్యేక స్థానం ఉంది. చేను, పొలం, మడి, దుక్కి, నాగలి, కళ్లం, గట్టు, కాలువ, గాదె వంటి పదాలు రైతు జీవితంలో సహజమైనవి. ఒక్కో పదం వెనుక ఒక పని ఉంది. ఆ పని వెనుక తరతరాల అనుభవం ఉంది. ట్రాక్టర్లు, ఆధునిక యంత్రాలు వ్యవసాయాన్ని మార్చాయి. కానీ ఆ మార్పుతో పాత వ్యవసాయ పదాలు పూర్తిగా కనుమరుగవ్వాల్సిన అవసరం లేదు. వాటిని భాషా వారసత్వంగా నమోదు చేయాలి.* ఎద్దుల బండి నుంచి ఆధునిక వాహనాల వరకు ఒకప్పుడు పల్లె రహదారులపై ఎద్దుల బండి సాధారణ దృశ్యం. కాడి, పగ్గం, బండి, చక్రం, గంటలు వంటి పదాలు అందరికీ పరిచయం. నేడు ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు వచ్చాయి. ఎద్దుల బండి అరుదైంది. దానితో ముడిపడిన పదజాలం కూడా తగ్గింది. వాహనం మారింది; కానీ ఆ పాత పదాలు మాత్రం చరిత్రలో నిలవాలి.* అమ్మమ్మ కథలో ఒక భాష ఉండేది అమ్మమ్మ కథలు పల్లె భాషకు ఒక పెద్ద పాఠశాల. రాత్రివేళ పిల్లలను చుట్టూ కూర్చోబెట్టి చెప్పిన కథల్లో స్థానిక పదాలు, సామెతలు, నుడికారాలు సహజంగా వచ్చేవి. ఆ కథలు కేవలం వినోదం కాదు. ఒక తరం నుంచి మరో తరానికి భాషను అందించే మౌఖిక సంపద. ఇప్పుడు ఆ స్థానంలో డిజిటల్ వినోదం పెరిగింది. అందుకే పెద్దల కథలను రికార్డు చేసి భద్రపరచడం అవసరం.* సామెతలో దాగిన జీవన జ్ఞానం తెలుగు పల్లె జీవితంలో సామెతలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. రైతు అనుభవం, వర్షం, పంట, కుటుంబం, మనుషుల ప్రవర్తన—ఎన్నో విషయాలు చిన్న మాటలోనే చెప్పగలిగే శక్తి సామెతలకు ఉండేది. సామెతలు తగ్గిపోతే ప్రజల అనుభవ భాషలోని ఒక భాగం కూడా తగ్గుతుంది. అందుకే పెద్దలు చెప్పే సామెతలను సేకరించి నమోదు చేయాలి.* వంటింటి పదాలు కూడా వారసత్వమే రోకలి, రోకలిబండ, రుబ్బురోలు, చట్టి, కుండ, మూకుడు, పొయ్యి వంటి పదాలు ఒకప్పుడు ప్రతి ఇంటి వంటింట్లో వినిపించేవి. ఆధునిక వంట పరికరాలు వచ్చిన తర్వాత వాటి వినియోగం తగ్గింది. పరికరాలు మారడం సహజం. కానీ వాటి పేర్లు, ఉపయోగాలు, వాటితో ముడిపడిన వంట సంప్రదాయాలు మాత్రం భాషా చరిత్రలో భద్రపరచాలి.* పండుగ మారితే... పండుగ మాట కూడా మారుతుంది సంక్రాంతి, బతుకమ్మ, బోనాలు, దసరా, దీపావళి, ఉగాది వంటి పండుగలు పల్లె భాషకు ప్రత్యేక రంగులు అద్దేవి. ముగ్గులు, గొబ్బెమ్మలు, పాటలు, ఊరేగింపులు, జానపద గీతాలు—ప్రతి ఆచారానికీ స్థానిక పదజాలం ఉండేది.

పండుగలు కొనసాగుతున్నా వాటి చుట్టూ ఉన్న పాత భాషా వాతావరణం కొంత తగ్గుతోంది. పాత పండుగ పాటలు, ఆచార పదాలను నమోదు చేయాలి.* బంధుత్వ పదాల్లో కుటుంబ చరిత్ర తాతయ్య, అమ్మమ్మ, పెద్దమ్మ, చిన్నమ్మ, బాబాయి, పిన్ని, మేనమామ, మేనత్త వంటి పదాలు కుటుంబ సంబంధాలను మాత్రమే కాకుండా ఉమ్మడి కుటుంబ జీవన విధానాన్ని కూడా ప్రతిబింబించేవి. కుటుంబాలు చిన్నవుతున్న కొద్దీ కొన్ని బంధుత్వ పదాల వినియోగం కూడా తగ్గుతోంది. ఆ పదాలను పిల్లలకు పరిచయం చేయడం ద్వారా కుటుంబ చరిత్రను కూడా పరిచయం చేయవచ్చు.* వృత్తులు మారితే వృత్తి పదాలు మాయమవుతాయి కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, నేత, చాకలి, మంగలి, గొర్రెల కాపరి, మత్స్యకారుడు—ప్రతి వృత్తికీ తనదైన పదజాలం ఉండేది. పనిముట్లు, పని విధానం, తయారీ పద్ధతులు అన్నింటికీ ప్రత్యేక పదాలు ఉండేవి. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో కొన్ని సంప్రదాయ వృత్తులు తగ్గడంతో వాటి పదజాలం కూడా కనుమరుగవుతోంది. ఒక వృత్తి చరిత్రను నమోదు చేసేటప్పుడు దాని భాషను కూడా నమోదు చేయాలి.

* కుమ్మరి చక్రం నుంచి మగ్గం వరకు మట్టి కుండలు తయారు చేసిన కుమ్మరి చక్రం, ఇనుమును మలిచిన కమ్మరి కొలిమి, చెక్కను మలిచిన వడ్రంగి పనిముట్లు, వస్త్రాన్ని నేసిన నేత మగ్గం—ఇవన్నీ పల్లె ఆర్థిక వ్యవస్థకు గుర్తులు. వాటితో పాటు వచ్చిన పదాలు కూడా ఇప్పుడు అరుదవుతున్నాయి. ఈ పదాలను వృత్తి చరిత్రతో కలిపి భద్రపరచాలి.* పిల్లల ఆటలకూ ఒక భాష ఉండేది పాతకాలపు గ్రామీణ ఆటల్లో పిల్లల మధ్య సంభాషణ, పిలుపులు, నియమాలు, జట్టు పేర్లు, గెలుపుఓటమి పదాలు ఉండేవి. ఇప్పుడు మొబైల్ గేమ్స్, డిజిటల్ వినోదం పెరిగింది. బయట ఆడే ఆటలు తగ్గడంతో వాటికి సంబంధించిన స్థానిక పదజాలం కూడా తగ్గింది. పాత ఆటలను నమోదు చేయడం అంటే పిల్లల జ్ఞాపకాలను మాత్రమే కాదు, ఒక భాషా సంపదను కూడా కాపాడటం.* చెరువు గట్టు నుంచి వాగు వరకు చెరువు, కుంట, బావి, కాలువ, వాగు, వంక, మడుగు, గట్టు, కట్ట వంటి పదాలు పల్లె నీటి సంస్కృతికి అద్దం. పాత రైతు నీటిని గమనించేవాడు. వర్షాన్ని అంచనా వేసేవాడు. చెరువు నిండే తీరును గుర్తించేవాడు. ప్రకృతిని గమనిస్తూ వచ్చిన ఆ అనుభవ జ్ఞానానికి ప్రత్యేకమైన పదజాలం ఉండేది. ఆ పదాలను సేకరించడం మన పర్యావరణ చరిత్రను కూడా భద్రపరచడమే.* ప్రకృతిని చదివిన పల్లె మనిషి మేఘాల రంగు, గాలి దిశ, నేల వాసన, పక్షుల కదలిక, చెట్ల పూత—ఇవన్నీ గమనిస్తూ పల్లె మనిషి ప్రకృతితో జీవించేవాడు. ఆ పరిశీలనకు అనేక స్థానిక పదాలు ఉండేవి. ఆధునిక జీవితం ప్రకృతితో మన సంబంధాన్ని కొంత దూరం చేసింది. దాంతో ప్రకృతికి సంబంధించిన పాత పదాలు కూడా తగ్గుతున్నాయి.* పల్లె యాసను తక్కువగా చూడకూడదు ప్రాంతీయ యాస అనేది భాషలో లోపం కాదు. అది ఒక ప్రాంత ప్రజల జీవన అనుభవం. పల్లె యాసను తక్కువగా చూడకుండా దానిని పరిశోధనకు, సాహిత్యానికి, విద్యకు అనుసంధానం చేయాలి.* మహిళల నోట బతికిన జానపద సంపద జోలపాటలు, పెళ్లిపాటలు, పండుగ పాటలు, ఇంటి ఆచారాలకు సంబంధించిన పదాలు ఎక్కువగా మహిళల మౌఖిక సంప్రదాయం ద్వారా తరాలకు చేరాయి. ఒక పాటలో ఒక కుటుంబ చరిత్ర ఉండొచ్చు. ఒక జోలపాటలో ఒక ప్రాంతీయ పదం ఉండొచ్చు. ఒక పెళ్లిపాటలో ఒక పాత ఆచారం ఉండొచ్చు. అందుకే వృద్ధ మహిళల పాటలను, జ్ఞాపకాలను ఆడియో, వీడియో రూపంలో నమోదు చేయడం అత్యవసరం.* ప్రతి ఊరి పేరులో ఒక కథ గ్రామాల పేర్లు కూడా భాషా చరిత్రకు ఆధారాలు. చెట్టు, చెరువు, వాగు, వృత్తి, దేవాలయం లేదా ఏదైనా స్థానిక సంఘటన ఆధారంగా గ్రామానికి పేరు వచ్చి ఉండవచ్చు. ఆ పేర్ల వెనుక ఉన్న కథలు వృద్ధుల జ్ఞాపకాల్లోనే ఉండిపోయే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామానికి ఒక స్థానిక చరిత్ర, ఒక స్థానిక పదకోశం రూపొందిస్తే భవిష్యత్ తరాలకు విలువైన సమాచారంగా నిలుస్తుంది.* పాత పదాల కోసం పెద్దలను అడగాలి "మీ చిన్నప్పుడు ఈ వస్తువను ఏమని పిలిచేవారు?", "పంట పనిలో ఏ పదాలు వాడేవారు?", "పెళ్లిళ్లలో ఏ పాటలు పాడేవారు?", "ఇంటి భాగాలకు ఏ పేర్లు ఉండేవి?"—ఇలాంటి ప్రశ్నలు అడిగితే వృద్ధుల జ్ఞాపకాల నుంచి ఎన్నో అరుదైన పదాలు బయటకు వస్తాయి. ఆ మాటలను రాయాలి. ఉచ్చారణను రికార్డు చేయాలి. అర్థాన్ని తెలుసుకోవాలి. ఉపయోగాన్నినమోదు చేయాలి.* "మన ఊరి పదాలు" కార్యక్రమం అవసరం ప్రతి పాఠశాలలో విద్యార్థులతో "మన ఊరి పదాలు" అనే కార్యక్రమం నిర్వహించవచ్చు. ఒక్కో విద్యార్థి తన ఇంటి పెద్దల నుంచి పది లేదా ఇరవై పాత పదాలను సేకరించవచ్చు. వాటి అర్థం, ఉపయోగం, ప్రాంతం నమోదు చేయవచ్చు. పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయికి ఈ కార్యక్రమాన్ని విస్తరించవచ్చు.* డిజిటల్ భాండాగారం... భవిష్యత్తుకు భద్రత పాత పదాలను పుస్తకాల్లో మాత్రమే కాకుండా డిజిటల్ రూపంలో కూడా భద్రపరచాలి. పెద్దల గొంతులో పదాన్ని రికార్డు చేయాలి. పాత పాటలను భద్రపరచాలి. పాత పనిముట్ల చిత్రాలు తీసి వాటి పేర్లు నమోదు చేయాలి. గ్రామాల వారీగా డిజిటల్ పదకోశాలను రూపొందించాలి.

అప్పుడు భవిష్యత్ తరాలు తమ పూర్వీకుల భాషను వినగలుగుతాయి.* పత్రికలు, సాహితీవేత్తలకు ప్రత్యేక బాధ్యత పత్రికలు ప్రతి వారం ఒక పాత పదాన్ని పరిచయం చేయవచ్చు. దాని అర్థం, ఉపయోగం, ప్రాంతీయ నేపథ్యాన్ని వివరించవచ్చు. రచయితలు కథల్లో, కవితల్లో, వ్యాసాల్లో పల్లె పదాలను సహజంగా ఉపయోగించవzపలుకు ఇవ్వాలి పల్లె నుంచి పాత తెలుగు పదాలు కనుమరుగవుతున్నాయన్నది కేవలం భాషా సమస్య కాదు. అది మన సంస్కృతి, జీవన విధానం, వృత్తులు, పండుగలు, కుటుంబ సంబంధాలు,

జానపద సంప్రదాయాలు, ప్రకృతి జ్ఞానం—అన్నింటికీ సంబంధించిన విషయం. అభివృద్ధి రావాలి. ఆధునికత రావాలి. సాంకేతికత పెరగాలి. కానీ మన మూలాల మాటను మరచిపోవద్దు. ఇంటి పెద్దలను మాట్లాడించాలి. పాత పదాలను సేకరించాలి. పిల్లలకు పరిచయం చేయాలి. పాఠశాలల్లో నమోదు చేయాలి. పత్రికల్లో ప్రచురించాలి. డిజిటల్ భాండాగారాల్లో భద్రపరచాలి.* ఒక పాత పదం మళ్లీ ఒక పిల్లవాడి నోట వినిపించినప్పుడు, ఒక తరం మరో తరంతో కలుస్తుంది. ఒక అమ్మమ్మ చెప్పిన మాట మనవడు రాసుకున్నప్పుడు, ఒక కుటుంబ చరిత్ర భద్రపడుతుంది. ఒక రైతు ఉపయోగించిన పాత వ్యవసాయ పదం పుస్తకంలో నిలిచినప్పుడు, ఒక పల్లె జీవితం చరిత్రలో నిలుస్తుంది. అందుకే పల్లె మాటను కాపాడటం మనందరి బాధ్యత. పల్లె భాష బతికితే మన జ్ఞాపకం బతుకుతుంది. మన జ్ఞాపకం బతికితే మన సంస్కృతి బతుకుతుంది. మన సంస్కృతి బతికితే తెలుగు తన మూలాలతో మరింత బలంగా ముందుకు సాగుతుంది.



ఎం రవీందర్
7901503777

# భారతీయ కవిత

బతుకు
పోరాటంలో..
నువ్వు అలసిపోవచ్చు
నీలోకి తప్పుల్ని
వెతకడానికి..
లోకులు అసలే
అలసిపోరు సుమా

కప్పేస్తుందో అని !
చందమామ అంటే..
మబ్బు వెనక
దాక్కుంటావు
సూర్యుడిని అంటే...
అస్తమించి చీకట్లు
కమ్మేస్తావు

## బతుకు లోతులు

సముద్రానికి తన
లోతు తెలియదు..
అందులో మునిగితేనే
తెలుస్తుంది
పరాయి మనిషి
లోతులు తెలియవు..
మోసే వాడికే తెలుసు
కావడి బరువు
సాగరానికి చుమురు
చుక్కంటే భయం
ఎక్కడ తనపై పడి

స్నేహితుడు అంటే..
కొంత కాలానికి
దూరం అవుతావు
భారమై పోయావు
అంటే..
భరించాల్సిందే
అంటావు
నువ్వే కదా
"జీవితమా"..
మరణించే దాకా నా
వెంటే వస్తావు !

# అత్తాపూర్ లక్ష్మి నగర్ పార్క్ ఆరోగ్య నిలయం ఆనంద తరంగం

ఉరుకుల పరుగుల జీవితంలో
మనసుకు ప్రశాంతతను ఇచ్చి
ఉశారు ఉల్లాసం ఆహ్లాదానికి
వేదిక
అత్తాపూర్ పార్క్

పచ్చని ప్రకృతి ఒడిలోన
పరవశించే వేకువన
అత్తాపూర్ పార్క్ నిలిచింది
అనురాగాల వేదికగా

ఆరోగ్యానికి చిరునామా
ఆనందానికి కేతనం
అహ్లాదకరమైన గాలితో
ఇదొక నందన వనం
చిరునవ్వుల బాలల
ఆటపాటల కోలాహలం

చింతలు మరిచిన సీనియర్
సిటిజన్ల ఆత్మీయ సంభాషణ

త్వరితగతిన సాగే వాకర్ల
అడుగుల సవ్వడి

మనసుకు ప్రశాంతతనిచ్చే
యోగాసనాల సందడి
లక్ష్మీ మహేందర్ గారి యోగ

సాధనాల స్ఫూర్తితో
ఆరోగ్య వెలుగులు
నిండుతున్నాయి ప్రతి గుండెలో
కాయాన్ని కల్పతరువుగా మార్చే
వారి యోగ విద్య
పార్కు పరిమళాన్ని పెంచిన
నిరుపమ సేవా నైపుణ్యం

పాత్రికేయ ప్రగతి శీలి

శ్రీ ఉ'నరసింహారావు గారి కృషి
వాకర్స్ అసోసియేషన్
కాన్వీనర్గా
నిలిచిన ఆదర్శవాది
అభివృద్ధి బాటలో పార్కును
నడిపిన వారి సంకల్పం

ప్రతి ఒక్కరి హృదయంలో
నిలిచింది నిత్య నూతనం

లక్ష్మీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్
ప్రతినిధులు అండతో యోగ
అభ్యాసకులు వాకర్స్ ఆత్మీయ
ఐక్యమత్యంతో సాగింది
ఈ ప్రగతి ప్రయాణం

అందరి ఆరోగ్యమే లక్ష్యంగా

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా
అడుగులు వేస్తూ
ఈ నందనవనాన్ని అందరి
హృదయాలకు చేరువ చేసే
శుభ తరుణం ఆసన్నమైంది

అత్తాపూర్ పార్కు
ప్రారంభోత్సవ
వేళ ముఖ్య అతిథిగా
రాజేంద్రనగర్ నగర్ ఎమ్మెల్యే
శ్రీప్రకాష్ గౌడ్ గారి చేతుల
మీదుగా జోనల్ కమిషనర్ శ్రీ
శ్రీనివాస్ రెడ్డిగారి విశిష్ట
సమక్షంలో
మున్సిపల్ ఎస్ ఇ నరేందర్
గౌడ్
సంపూర్ణ మద్దతు మున్సిపల్
సిబ్బంది సహకారంతో
ఈ అద్భుత వనం ప్రజల

పరం కాబోతుంది

ఈశుభ సమయంలో
కలిసి నడుద్దాం ..రండి ప్రకృతి
ఒడిని చేరుదాం
ఆరోగ్యమే మహాభాగ్యమని
చాటుదాం!

అత్తాపూర్ లక్ష్మీ నగర్ పార్క్
సాక్షిగా ఆరోగ్య సమాజాన్ని
నిర్మిద్దాం ఆహ్లాదాల సందడి
చేద్దాం

ఆనంద శ్వాసతో నిండా
నూరేళ్ళు
జీవిద్దాం.ఆరోగ్యమే భాగ్య మని
సమాజానికి చాటుదాం.



నేదునూరి కనకయ్య
9440245771



# జాతీయం-అంతర్జాతీయం





## 'అయోధ్య' కేంద్రంగా వేడెక్కిన ఉత్తర్ ప్రదేశ్ రాజకీయం..

**యోగి సవాల్‌కు అఖిలేష్ ప్రతిసవాల్**

**లక్నో, అక్టోబరు 11 (ఎ.ఎం.ఎస్):**

మరికొద్ది నెలల్లో ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన యూపీలో వరుసగా రెండు సార్లు గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన బీజేపీ.. మూడోసారి గెలవాలనే పట్టుదలతో ఉంది. అయితే, ప్రధాన ప్రతిపక్షం ఎస్పీ నుంచి ఈసారి గట్టిపోటీ ఎదురవుతుందనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అయోధ్య నుంచి దమ్ముంటే పోటీచేసి గెలవాలని సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు అఖిలేష్ యాదవ్ సవాల్ విసిరారు. దీనిపై యోగి కూడా స్పందించడంతో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది.త్వరలోనే ఎన్నికల జరగనున్న ఉత్తర్ ప్రదేశ్‌లో అయోధ్య కేంద్రంగా సీఎం యోగి ఆదిత్యనాథ్, ప్రతిపక్ష నేత సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయం వేడెక్కింది. ముఖ్యమంత్రి యోగి శనివారం బల్‌రామ్‌పూర్ జిల్లాలో రూ.800 కోట్లకపైగా విలువైన 78 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

## ప్రతీ ఇల్లు ఒక జంతర్ మంతర్ అవుతుంది..

- **ప్రధాని మోదీకి ప్రకాశ్ రాజ్ వార్నింగ్**

**న్యూఢిల్లీ, అక్టోబరు 11 (ఎ.ఎం.ఎస్):**



ప్రధాని మోదీపై ప్రకాశ్ రాజ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. జంతర్ మంతర్‌ను ప్రస్తావిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలు తమ గొంతు వినిపించాలని.. ప్రతి ఇల్లు నిరసనకు ప్రతీకగా మారాలని వ్యాఖ్యానించారు. ఢిల్లీ నిరసనలను ప్రస్తావిస్తూ.. సీజేపీ నేతలను విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ధ్రువ్ రాఠీని పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యవహారాన్ని కూడా ఆయన తన వీడియోలో ప్రస్తావించారు. ఈ చర్యలను ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్య హక్కులు, నిరసన తెలిపే స్వేచ్ఛను కాపాడాలని పరోక్షంగా పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వంపై ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కులు, నిరసన తెలిపే స్వేచ్ఛకు సంబంధించిన పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆయన విడుదల చేసిన వీడియో రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దేశంలోని ప్రతి ఇల్లు జంతర్ మంతర్‌గా మారే వరకు ఈ పోరాటం ఆగదు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఢిల్లీలో నిరసనలకు సంబంధించిన పరిణామాలు, విమానంలోనే సీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్న ఘటన.. యూట్యూబర్ ధ్రువ్ రాఠీని పోలీసులు అదుపులోకి తీసుకున్న అంశాలను ప్రస్తావిస్తూ ప్రకాశ్ రాజ్ కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసనకు సిద్ధమైన సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను.. ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తర్వాత విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై ప్రకాష్ రాజ్ ప్రశ్నలు గుప్పించారు. ఈ ఘటనను ప్రస్తావించిన ప్రకాశ్ రాజ్.. నేతలు విమానం నుంచి బయటకు వచ్చే వరకు కూడా వేచి చూడకుండా చర్యలు తీసుకోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ కీలకమని స్పష్టం చేశారు. ప్రభుత్వ చర్యలు ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు.
ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా ఢిల్లీలో నిరసనలకు ముందు గురుగ్రామ్‌లోని ఆయన నివాసం నుంచి పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని ప్రకాశ్ రాజ్ తన వీడియోలో ప్రస్తావిస్తూ తీవ్రంగా విమర్శించారు. ధ్రువ్ రాఠీని కిడ్నాప్ చేశారంటూ ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే వ్యక్తులు, నిరసనల్లో పాల్గొనే వారిపై తీసుకుంటున్న చర్యలు ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నాయనే ప్రశ్నను ప్రకాశ్ రాజ్ లేవనెత్తారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలకు చోటు ఉండాలని.. ప్రజల గొంతుకను అణచివేయడానికి ప్రయత్నిస్తే వ్యతిరేకత మరింత పెరిగే అవకాశం ఉంటుందనే భావనను ఆయన తన వ్యాఖ్యల్లో వ్యక్తం చేశారు.
ప్రకాశ్ రాజ్ తన వీడియోలో జంతర్ మంతర్ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా నిరసనలకు ప్రతీకగా నిలిచే జంతర్ మంతర్‌ను పరిరక్షించాల్సిన వ్యవస్థలే అక్కడ నిరసనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాయంటూ ఆయన విమర్శించారు. జంతర్ మంతర్‌ను కాపాడే పేరుతో ఢిల్లీ నగరాన్నే మరో పెద్ద జంతర్ మంతర్‌గా మార్చేశారంటూ సెటైరికల్‌గా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను అంతర్జాతీయ సమాజం కూడా గమనిస్తోందని ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులపై చర్చ ఒక్క నగరానికో, ఒక నిరసన వేదికకో పరిమితం కాకూడదని.. ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు.



## నవనీతమ్ నవీ పిళ్లై...

- **సాధారణ బస్సు డ్రైవర్ కుమార్తె నుంచి నోబెల్ శాంతి బహుమతి విజేతగా..**

**న్యూయార్క్, అక్టోబరు 11:**

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పురస్కారం నోబెల్ శాంతి బహుమతి 2026కు భారత సంతతి మహిళను ఎంపిక చేశారు. దక్షిణాఫ్రికాలో సాధారణ భారతీయ కుటుంబంలో పుట్టిన ఆమె.. చిన్నతనం నుంచి పేదరికంతో పోరాటం చేశారు. ఏడుగురు సంతానంలో ఒకరైన ఆమె.. జాతివివక్షపై గళమెత్తారు. న్యాయవాద విద్యను అభ్యసించిన ఆమె.. దక్షిణాఫ్రికా హైకోర్టుకు న్యాయమూర్తి అయిన తొలి నల్ల జాతి మహిళగా రికార్డుల్లోకి ఎక్కారు. ఐరాస మానవహక్కుల విభాగం హైకమిషనర్‌గానూ ఆమె సేవలను అందించారు.

### చెన్నై మెట్రో రెండో దశను ప్రారంభించిన ప్రధాని మోదీ..

## సీఎం విజయ్‌తో కలిసి మెట్రో ప్రయాణం

**చెన్నై, అక్టోబరు 11 (ఎ.ఎం.ఎస్):**



ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం చెన్నై మెట్రో రెండో దశను ప్రారంభించారు. అనంతరం సీఎం విజయ్‌తో కలిసి ఆయన మెట్రోలో ప్రయాణించారు. ఇప్పటికే చెన్నై నగరంలో 54.1 కిలోమీటర్ల మేర మెట్రో లైన్ అందుబాటులో ఉంది. రెండో దశలో 118.9 కి.మీ. మేర మెట్రో లైన్ నిర్మిస్తున్నారు. అయితే రెండో దశ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. 2028 నాటికి రెండో దశ పూర్తి చేయాలని చెన్నై మెట్రో లక్ష్యంగా పెట్టుకుంది.
చెన్నై మెట్రో రెండో దశలో భాగంగా పూనమల్లి నుంచి వడపళని వరకు ఉన్న 15 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం తమిళనాడు సీఎం విజయ్‌తో కలిసి ప్రధాని మోదీ మెట్రోలో ప్రయా‾ించారు. తమిళనాడు గవర్నర్ విశ్వనాథ్ అర్లేకర్ సమక్షంలో ప్రధాని మోదీ, సీఎం విజయ్ కలిసి కొత్త మెట్రో సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెట్రో టికెట్ కొనుగోలు చేసిన ప్రధాని.. టికెట్ కౌంటర్లోని ఉద్యోగితో కాసేపు మాట్లాడారు.చెన్నై మెట్రో తొలి దశ పనులు 2009లో ప్రారంభంగా.. 2015లో మెట్రో సేవలను మొదలుపెట్టారు. తొలి దశ 54.1 కిలోమీటర్ల పూర్తి మార్గం 2019 ఫిబ్రవరి నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ఫస్ట్ ఫేజ్‌లో రెండు కారిడార్లు ఉన్నాయి. రెండో దశకు కేంద్ర మంత్రి అమిత్ షా 2020 నవంబర్ 21న శంకుస్థాపన చేశారు. రెండో దశలో మరో మూడు కారిడార్లు ఉన్నాయి.కారిడార్ 3: మాధవరం నుంచి సిప్‌కాట్ వరకు 45.8 కి.మీ. ఉంటుంది. కారిడార్ 4: లైట్ హౌస్ నుంచి పూనమల్లి వరకు 26.1 కి.మీ. ఉంటుందికారిడార్ 5: మాధవరం నుంచి షోల్లింగనూర్ వరకు 47 కి.మీ. ఉంటుందిచెన్నై మెట్రో రెండో దశలోని.. నాలుగో కారిడార్‌లో భాగంగా ఉన్న పూనమల్లి బైపాస్‌వడపల్లి ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు.
కొత్తగా ప్రారంభమైన మార్గంలో 11 మెట్రో స్టేషన్లు ఉన్నాయి. అవి పూనమల్లి బైపాస్, పూనమల్లి బస్టాండ్, పూనమల్లి గవర్నమెంట్ హాస్పిటల్, కరయాంచవాడి, కుమానాంచవాడి, కట్టుపక్కమ్, అయ్యప్పంథగల్, థెల్లియారాగారం, పోరూర్ బైపాస్, పోరూర్ జంక్షన్, వడపళని.2028 నాటికి రెండో దశ పూర్తయితే చెన్నై నగరంలో 173 కి.మీ. మెట్రో మార్గం అందుబాటులోకి వస్తుంది. దేశంలో అత్యధిక పొడవైన మెట్రో మార్గం ఉన్న నగరాల జాబితాలో చెన్నై నాలుగో స్థానంలో నిలిచే అవకాశం ఉంది. తొలి స్థానంలో ఢిల్లీ, రెండో స్థానంలో ముంబై, మూడో స్థానంలో బెంగళూరు ఉంటాయి. హైదరాబాద్ మెట్రో సంగతేంటి?హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం 67 కి.మీ. మెట్రో మార్గం అందుబాటులో ఉంది. 162.5 కి.మీ. మేర రెండో దశను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే మెట్రో డీపీఆర్‌కు కేంద్రం నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదు. రెండో దశను రెండు భాగాలుగా విభజించారు. ఫేజ్ 2ఏలో ఐదు కారిడార్లు..

నాగోల్‌శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, మియాపూర్‌పటాన్‌చెరు, రాయదుర్గంకోకాపేట నియోపోలిస్, ఎంజీబీఎస్‌చంద్రాయణగుట్ట, ఎల్‌బీ నగర్‌హయత్ నగర్ ఉంటాయి. ఫేజ్ 2బీలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌ఫ్యూచర్ సిటీ, జేబీఎస్‌మేడ్చల్, జేబీఎస్‌శామీర్‌పేట మార్గాలు ఉన్నాయి. రెండో దశ కూడా పూర్తయితే హైదరాబాద్ మెట్రో నెట్‌వర్క్ పొడవు 231.5 కిలోమీటర్లకు చేరుకుంటుంది. అయితే ఇంకా డీపీఆర్‌కే కేంద్రం ఆమోదం తెలపలేదు. కాబట్టి 2028లోగా రెండో దశ పూర్తి కావడం కష్టమని చెప్పొచ్చు.

# నేపాల్‌లో మళ్లీ వరద బీభత్సం..

- **నేపాల్‌లో మళ్లీ వరద బీభత్సం..**
- **కొట్టుకుపోయిన ఇళ్లు, బ్రిడ్జిలు..**
- **హైడ్రోపవర్ ప్రాజెక్టు ధ్వంసం**

**ఖాట్మండు, అక్టోబరు 11:**



నేపాల్‌లో మరోసారి వరద బీభత్సం సృష్టించింది. బుధీ గండకీ నదికి ఆకస్మికంగా వరద రావడంతో పలు గ్రామాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. 35కి పైగా ఇళ్లు, వంతెనలు కొట్టుకుపోగా.. జల విద్యుత్ ప్రాజెక్టుకు నష్టం వాటిల్లింది. కొద్ది సమయంలోనే నదిలో నీటిమట్టం ప్రమాద స్థాయిని దాటడంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షం లేకుండానే వరద రావడం వెనుక నదీ ప్రవాహానికి తాత్కాలిక అడ్డంకి ఏర్పడి.. అది ఒక్కసారిగా తెగిపోయి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. నేపాల్ సైన్యం, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి ఆరుగురిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు.
హిమాలయ దేశం నేపాల్‌లో మరోసారి ప్రకృతి విలయం తీవ్ర ఆందోళనకు గురిచేసింది. గోర్ఖా జిల్లాలోని బుధీ గండకీ నదికి ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా వరద పోటెత్తింది. భారీ బురద, రాళ్లు, ఇతర శిథిలాలతో ఉద్ధృతంగా ప్రవహించిన వరద నీటికి 35కి పైగా ఇళ్లు, బ్రిడ్జిలు కొట్టుకుపోయాయి. ఓ హైడ్రో పవర్ ప్రాజెక్టు కూడా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. చుమ్నుబ్రి గ్రామీణ మున్సిపాలిటీ పరిధిలోని సల్లేరి, పైయుకా, జగత్ ప్రాంతాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది.
జగత్ బజార్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో భారీగా నష్టం జరిగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. చుమ్నుబ్రి 3 వార్డును అనుసంధానించే సస్పెన్షన్ వంతెన కూడా వరద ధాటికి ధ్వంసమైనట్లు సమాచారం. అయితే, ఆస్తి నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు, నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 6.30 గంటలకు బుధీ గండకీ నదిలో నీటిమట్టం 3.66 మీటర్లుగా నమోదైందని.. అది ఉదయం 8.40 గంటలకు 8.43 మీటర్లకు చేరుకుందని తెలిపింది. నదికి ప్రమాద స్థాయి 5 మీటర్లుగా నిర్ణయించగా.. నీటిమట్టం దాన్ని గణనీయంగా అధిగమించింది. ముఖ్యంగా ఉదయం 8.30 నుంచి 8.40 గంటల మధ్య కేవలం 10 నిమిషాల్లోనే నీటిమట్టం 2 మీటర్లకు పైగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. వరద ఉద్ధృతికి నీటిమట్టాన్ని కొలిచే కేంద్రం..దాని సమీపంలోని వంతెన కూడా కొట్టుకుపోవడంతో తదుపరి వివరాలు సేకరించడం కష్టమైందని పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రధానంగా ఆందోళన కలిగిస్తున్న అంశం.. భారీ వర్షాలు కురవకుండానే నదిలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడం. ప్రాథమిక సమాచారం ప్రకారం.. శాటిలైట్ చిత్రాల పరిశీలన ఆధారంగా నదికి అనుబంధంగా ఉన్న ప్రవాహ మార్గంలో ఎక్కడైనా నీరు అడ్డుపడి.. ఆ అడ్డంకి ఒక్కసారిగా తెగిపోవడం వల్ల వరద సంభవించి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, అసలు కారణాన్ని నిర్ధారించేందుకు సాంకేతిక విశ్లేషణ కొనసాగుతోంది.
స్థానికులు కూడా సమీపంలోని స్యార్ వాగు ప్రవాహం మధ్యలో అడ్డంకి ఏర్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వరదకు ముందు వాగు నుంచి నీరు ఆగుతూ.. మళ్లీ ఉద్ధృతంగా ప్రవహిస్తున్నట్లుగా శబ్దాలు వినిపించాయని కొందరు పేర్కొన్నారు. చీకటిగా ఉండటంతో కొండచరియలు విరిగిపడ్డాయా లేక నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడిందా అనే విషయాన్ని గుర్తించలేకపోయామని తెలిపారు. ఈ అనుమానాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

# పాక్‌లో సంచలనం..

- **ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఇమ్రాన్ ఖాన్ పార్టీ ప్రభుత్వంపై ఎమర్జెన్సీ**

**ఇస్లామాబాద్, అక్టోబరు 11:**



పాక్‌లో ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ పార్టీ పాలనలో ఉన్న ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో కేంద్ర ప్రభుత్వం అత్యవసర పాలన విధించింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ప్రాంతీయ ప్రభుత్వం విఫలమైందని ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఆమోదించిన ఈ చర్యతో ప్రావిన్స్ పరిపాలనపై కేంద్రం అధికారాలు పెరిగే అవకాశం ఉంది. మరోవైపు, ఈ నిర్ణయం ప్రజాస్వామ్య విరుద్ధమని పీటీఐ నేతలు విమర్శిస్తున్నారు. ఇమ్రాన్ ఖాన్ విడుదల కోసం పార్టీ మద్దతుదారులు లాంగ్ మార్చ్ నిర్వహిస్తున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

పాకిస్థాన్‌లో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. జైల్లో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ అధికారంలో ఉన్న ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. ఆదివారం అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఈ నిర్ణయానికి ఆమోదం తెలిపినట్లు పాకిస్థాన్ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ప్రావిన్స్‌లో క్షీణిస్తున్న శాంతిభద్రతలు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ప్రాంతీయ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు ఈ నిర్ణయానికి కారణమని ప్రధాని షెహబాజ్ షరీఫ్ కార్యాలయం పేర్కొంది. ఈ పరిణామంతో ఇమ్రాన్ ఖాన్ పార్టీకి కీలకమైన రాజకీయ ప్రాంతంలో అధికారాలపై అనిశ్చితి నెలకొంది.ఇప్పటికే ఇమ్రాన్ ఖాన్ విడుదలను కోరుతూ పీటీఐ మద్దతుదారులు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర పాలన విధించడం పాకిస్థాన్ కేంద్ర ప్రభుత్వానికి, ప్రతిపక్ష పార్టీకి మధ్య ఘర్షణను మరింత తీవ్రం చేసే అవకాశముంది. పాకిస్థాన్ రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 232, 234 ఆధారంగా అత్యవసర పాలనకు సంబంధించిన నిర్ణయం తీసుకున్నట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ నిబంధనల ప్రకారం నిర్దిష్ట పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రావిన్స్ పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి.. కొన్ని పరిపాలనా అధికారాలను తన పరిధిలోకి తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.
ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా పరిస్థితిని సమీక్షించినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది. ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంలో ప్రావిన్స్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సహకరించడం లేదని మంత్రివర్గం అభిప్రాయపడినట్లు వెల్లడించింది. ఈ ప్రాంతంలో భద్రతా సమస్యలు, ఉగ్రవాద దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.
అయితే.. అత్యవసర పాలన అనంతరం ప్రావిన్స్‌ను ఏ విధంగా నిర్వహించనున్నారనే అంశంపై అధ్యక్ష కార్యాలయం పూర్తి వివరాలను వెల్లడించలేదు. రాజ్యాంగ ప్రక్రియలో భాగంగా పార్లమెంటు ఆమోదం వంటి అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి. అత్యవసర పాలన ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిదీ, ప్రావిన్స్‌లో పార్టీ అధ్యక్షుడు జునైద్ అక్బర్‌ను అరెస్టు చేసినట్లు పీటీఐ నేతలు ఆరోపించారు. ఈ విషయాన్ని పార్టీకి చెందిన శాసనసభ్యుడు జునైద్ అక్బర్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో వెల్లడించినట్లు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అయితే.. ఈ అరెస్టులకు సంబంధించి ప్రభుత్వ అధికారిక వివరణ అందుబాటులో ఉన్న కథనాల్లో స్పష్టంగా లేదు.

# ఢిల్లీలో మెట్రో రైళ్లు నడపండి..

- **ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించండి..**
- **ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఆదేశాలు**

**న్యూఢిల్లీ, అక్టోబరు 11 (ఎ.ఎం.ఎస్):**



దేశరాజధాని ఢిల్లీలో సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతోన్న ఆందోళనలను అడ్డుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను సుప్రీం కోర్టు తప్పుబట్టింది. మెట్రో రైళ్లు, ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. ప్రజల రాకపోకలను కూడా అడ్డుకోవద్దని స్పష్టం చేసింది.జంతర్‌మంతర్‌లో ఆందోళనలకు సీజేపీ పిలుపునిచ్చి నేపథ్యంలో ఢిల్లీలో మెట్రో రైళ్లను నిలిపేసిన ప్రభుత్వం.. రాజధానికి వచ్చే రైళ్లను సైతం ఆపేసింది. ఎక్కడిక్కడ బారికేడ్లతో ఆందోళనకారులను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యమైన ఆందోళనకారులను నిర్బంధంలో ఉంచుతోంది. ప్రభుత్వ వైఖరిని సవాల్ చూస్తే.. పలువురు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ.. న్యాయస్థానం ప్రత్యేకంగా ఈ పిటిషన్లు విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్లను విచారించిన జస్టిస్ జైమాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన లతో కూడిన ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది.దేశరాజధాని ఢిల్లీలో చట్టానికి లోబడి ప్రజలు సజావుగా రాకపోకలు సాగించడానికి అనుమతించాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. చట్ట ప్రకారమే చర్యలు తీసుకోవాలని.. అక్రమ నిర్బంధాలు చేపట్టొద్దని ఉండొద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 163 పరిధిలోకి వచ్చే ప్రాంతాలు మినహాయిస్తే.. మిగతా చోట్ల ఎలాంటి అక్రమ నిర్బంధాలు ఉండొద్దని.. శాంతియుత నిరసనలు, నిరాయుధంగా సమావేశం అయ్యే వారి పట్ల ఆంక్షలు విధించొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల రాకపోకలకు వీలుగా ఢిల్లీలో మెట్రో, రైలు సేవలను మామూలుగానే కొనసాగించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. నగరవ్యాప్తంగా ప్రజలు, ట్రాఫిక్ సాఫీగా రాకపోకలు సాగించేలా చూడాలని సూచించింది. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని బారికేడ్లు ఎంత మేరకు అవసరమో సమీక్షించాలని అధికారులను ఆదేశించింది. ఇంటర్నెట్ సేవలకు విఘాతం కలిగించొద్దని.. చట్టప్రకారం నడుచుకోవాలని హితవు పలికింది. తీవ్రమైన శాంతి భద్రతల సమస్య తలెత్తితే తప్పితే ఈ సేవలను పూర్తిగా నిలిపేయడం నిషిద్ధమని పేర్కొంది.సీజేపీ ఆందోళనల నేపథ్యంలో బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద సుప్రీం కోర్టు బయట నిషేధాజ్ఞలు విధించడాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఈ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలని సూచించింది.అభిజీత్ దిప్కే విడుదల..
అంతకు ముందు శనివారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కాక్రోచ్ జనతా పార్టీ నేతలు అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని ఢిల్లీ కంటోన్మెంట్‌లోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. అనంతరం రూ.50 వేల పూచీకత్తుతో ఢిల్లీ పోలీసులు విడుదల చేశారు. ఏడాదిపాటు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతియుతంగా ఉండాలని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వీరిని ఆదేశించారు. సుప్రీం కీలక ఆదేశాలు..మెట్రో, రైలు సేవలను యథావిధిగా నడపాలి. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నియంత్రణలు విధించాల్సిన అవసరం ఏర్పడే వరకు ఈ సేవలు కొనసాగించాలి.ట్రాఫిక్ నిబంధనలకు లోబడి నగరంలో ప్రజల రాకపోకలకు అనుమతించాలిలా అండ్ ఆర్డర్‌ను దృష్టిలో ఉంచుకొని బారికేడ్ల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించాలి.చట్ట ప్రకారం ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలి చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం నగరం ప్రజల రాకపోకలు సజావుగా సాగించేందుకు అనుమతివ్వాలిచట్టప్రకారమే నడుచుకోవాలి, ఎవర్నీ అక్రమంగా నిర్బంధించొద్దు.

## రియాద్ విమానాశ్రయంపై దాడి..

- **12 మంది దుర్మరణం..**
- **హౌతీలపై యుద్ధంలోకి అమెరికా..?**

**రియాద్, అక్టోబరు 11:**



సౌదీ అరేబియా రాజధాని నగరమైన రియాద్‌ను హౌతీలు లక్ష్యంగా చేసుకున్నారు. శనివారం రియాద్ ఎయిర్‌పోర్టుపై జరిగిన దాడుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోగా.. 300 మందికిపైగా గాయపడ్డారు. అంతకు ముందు కూడా హౌతీలు రియాద్ ఎయిర్‌పోర్టుపై దాడులు జరిపారు. శనివారం నాటి దాడుల అనంతరం కింగ్ ఖలీద్ విమానాశ్రయాన్ని మూసివేసి.. విమానాల రాకపోకలను మళ్లించారు. ఈ దాడులను అమెరికా సహా ప్రపంచ దేశాలు ఖండించాయి. సౌదీకి మద్దతుగా హౌతీలపై దాడులు చేసే యోచనలో ఉన్నట్లు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు.
సౌదీ అరేబియాలోని రియాద్ విమానాశ్రయంపై జరిగిన క్షిపణి దాడులో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 309 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. ఈ దాడుల అనంతరం కింగ్ ఖలీద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును మూసివేసిన అధికారులు.. విమానాలను దారి మళ్లించారు. మృతుల్లో నలుగురు సౌదీ పౌరులు ఉండగా.. ఇద్దరు బంగ్లాదేశీయులు ఉన్నారు. అమెరికా, జోర్డాన్, పాలస్తీనా, సిరియా, సూడాన్, ఈజిప్ట్ దేశాలకు చెందిన వారు ఒకరు చొప్పున ఈ దాడుల్లో చనిపోయారని సౌదీ పౌర విమానయాన వర్గాలు వెల్లడించాయి. 2015 మే తర్వాత సౌదీలో జరిగిన అత్యంత ప్రాణాంతకమైన దాడి ఇదే కావడం గమనార్హం.

## నాయినమ్మ మృతి..

- **అంత్యక్రియల్లో పాల్గొనేందుకు అభిజీత్ దీప్కేకి ఢిల్లీ పోలీసులు ఆఫర్..**
- **హాజరవుతారా? లేదా?**

**ముంబయి, అక్టోబరు 11 (ఎ.ఎం.ఎస్):**

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నానమ్మ సావిత్రి బాయి శనివారం ఉదయం కన్నుమూశారు. 85 ఏళ్ల వయసున్న ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో తన స్వగ్రామం సంతుక్ పింప్రిలో మృతి చెందారు. ఈ మరణవార్తను దీప్కేకు చేరవేసిన ఢిల్లీ పోలీసులు.. ఆయన అంత్యక్రియల్లో పాల్గొనడానికి సాయం చేస్తామని తెలిపారు. అయితే, వెళ్లాలా? వద్దా? అనేది దీప్కే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. ఈ విషయమై ఇప్పటి వరకూ స్పష్టత లేదు.
కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ఇంట విషాదం నెలకుంది. వయోభారంతో ఆయన నాయినమ్మ శనివారం ఉదయం కన్నుమూశారు. , కస్టడీలోనే ఉంటూ నిరసనను కొనసాగించాలా? లేక నాయినమ్మ అంత్యక్రియల కోసం స్వగ్రామానికి వెళ్లాలా? అనేది దీప్కే నిర్ణయానికే వదిలేశామని పోలీసు వర్గాలు తెలిపాయి. ఆదివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు జరగనున్నాయి.
మహారాష్ట్రలోని హింగోలీ జిల్లా సంతుక్ పింప్రి గ్రామంలో దిప్కే నాయినమ్మ వయసు సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. సరిగ్గా అదే సమయానికి జంతర్ మంతర్ నిరసనలో పాల్గొనేందుకు సీజేపీ నేతలతో కలిసి అభిజిత్ ముంబయి నుంచి ఢిల్లీకి విమానంలో బయలుదేరారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## వానాకాలం పంటల పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి



**యాసంగి సాగు ప్రణాళికను నీటి లభ్యతకు అనుగుణంగా రూపొందించాలి**
**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**
**మహబూబాబాద్, అక్టోబర్ 9.**
**(వుదయం జిల్లా ప్రతినిధి) :**

రాష్ట్రంలో వానాకాలం 2026 పంటల పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వానాకాలం పంట, వర్షపాతం వివరాలు, వ్యవసాయ కార్యకలాపాలు, రానున్న యాసంగి 2026-27 సాగు ప్రణాళిక, త్రాగునీటి సరఫరా, జల సంరక్షణ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ కె .అనిల్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో 2026 సెప్టెంబర్ 30 నాటికి సాధారణ వర్షపాతంతో పోలిస్తే 17 శాతం లోటు వర్షపాతం నమోదైందని, అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ వరకు వర్షపాత లోటు 99 శాతంగా ఉందని తెలిపారు. వానాకాలం 2026లో రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి మొత్తం 1 కోటి 31 లక్షల 38 వేల 611 ఎకరాలలో సాగు నమోదు అయిందని, ఇందులో 57 లక్షల 4 వేల 059 ఎకరాలలో వరి, 48 లక్షల 43 వేల 606 ఎకరాలలో పత్తి, 5 లక్షల 92 వేల 472 ఎకరాలలో మొక్కజొన్న, 7 లక్షల 97 వేల 772 ఎకరాలలో పప్పుధాన్యాలు సాగు జరిగిందని తెలిపారు. కొన్ని జిల్లాలలో వర్షపాత లోటు కారణంగా పంటలు వాడిపోవడం, ఎండిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను నిరంతరం పరిశీలించాలని సూచించారు.. రానున్న యాసంగి 2026-27 సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 65 లక్షల 89 వేల 293 ఎకరాలలో అంచనా సాగు జరుగుతుందని, గత యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈసారి 29.3 శాతం తక్కువ సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయడం జరిగిందని తెలిపారు.నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, సాగునీటి వనరులను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో వరి సాగును నిరుత్సాహపరుస్తూ, ఆయా ప్రాంతాలకు అనువైన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతు ఐడీల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, వానాకాలం 2026 ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని తెలిపారు. ఈ జలాశయాలలో త్రాగునీటి అవసరాలకు సరిపడా ఏడాది కాలానికి అవసరమైన ముడి నీటిని నిల్వ ఉంచేలా చర్యలు చేపట్టాలని, వాటిపై ఆధారపడిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు ఎగువ జలాశయాల్లోనూ తగిన నీటి నిల్వలు ఉండేలా చూడాలని సూచించారు. గ్రామాల్లోని చేతిపంపులు, నీటి సరఫరా పథకాలు, బహిరంగ బావులు సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని, స్థానిక నీటి వనరులను పరిరక్షిస్తూ నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో విద్యుత్, సాగునీరు, ప్రజారోగ్య ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో త్రాగునీటి సరఫరా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలలో జలాశయాల డెడ్ స్టోరేజీ నుంచి నీటిని వినియోగించుకునేందుకు తాత్కాలిక పంపుల ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది క్రియాశీల కూలీలు ఉన్న నేపథ్యంలో వి బి జి రామ్ జి పథకం క్రింద కూలీల సమీకరణను సమర్థవంతంగా చేపట్టి, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, అవసరమైన కూలీలను పనులలో భాగస్వాములను చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలలో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం క్రింద నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మ్యాజిక్ సోక్‌పిట్ల నిర్మాణం, 50 వేల ఫామ్ పాండ్ల ఏర్పాటు, 12 వేల పెర్కొలేషన్ ట్యాంకుల నిర్మాణం, 12 వేల బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాల ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణకు ఈ నిర్మాణాలు దోహదపడేలా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. పని చేస్తున్న బోరు బావుల వద్ద సోక్‌పిట్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఎండిపోయిన బోరు బావుల వద్ద భూగర్భ జలాల పునరుద్ధరణకు అనువైన రీచార్జ్ నిర్మాణాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**బాలాలయంలో చండీ హోమం..**
**అమ్మవారికి విశేష పూజలు**
**భూపాలపల్లి :అక్టోబర్ 11**
**(వుదయం విలేకరి):**

కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ ఆది ముక్తీశ్వర స్వామి వారి బాలాలయంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.నేటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా బాలాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 19వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం10.30 గంటలకు చండీ హోమం నిర్వహించనున్నారు. నవరాత్రుల సందర్భంగా ఉప ప్రధాన అర్చకులు పాణింద్ర శర్మ,అర్చకుల ఆధ్వర్యంలో ప్రతిరోజు అమ్మవారి విశేష పూజలు నిర్వహించారు.దేవాలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా బాలాలయంలో అమ్మవారి బింబానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, కార్యనిర్వహణాధికారి భక్తులు, గ్రామస్తులు నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఉత్సవాల నిర్వహణకు భక్తులు, గ్రామస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పూజల్లో ఈఓ మహేష్, చైర్మన్ అవధాని మోహన్ శర్మ, ధర్మకర్తలు గందేసిరి సత్యనారాయణ, సంకరి సీతయ్య,దేవుడా శ్యామ్ సుందర్, సర్వంద్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సుధీర్,ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజబాబు, అర్చకులు,సిబ్బంది,తదితరులు ఉన్నారు.

## డాక్టర్ రామ్మూర్తి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం
## 60 మందిలో 8 మందికి గుండె సమస్యలు గుర్తింపు



**ఏటా గుండె పరీక్ష తప్పనిసరి, మద్యం, పొగకు దూరంగా ఉండాలి**
**డాక్టర్ రామ్మూర్తి**
**సూర్యాపేట, అక్టోబర్ 11**
**(వుదయం ప్రతినిధి):**

ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒక్కసారైనా గుండె పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రామ్మూర్తి సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వినూత్న ఆసుపత్రిలో ఆయన ఆధ్వర్యంలో షటిల్ ప్లేయర్లకు ప్రత్యేకంగా ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి జిల్లా నలుమూలల నుండి 60 మంది క్రీడాకారులు హాజరై గుండె పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ, పరీక్షల్లో 60 మందిలో 8 మందికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వారందరినీ ముందస్తుగా గుర్తించడం వల్ల పెద్ద ముప్పు తప్పినట్లయిందని, వారు వెంటనే హైదరాబాద్ లో యాంజియోగ్రామ్ చేయించుకొని సకాలంలో చికిత్స పొందాలని సూచించారు.

క్రీడాకారులైనా తప్పదు జాగ్రత్త...

షటిల్ వంటి క్రీడలు ఆడేవారు ఫిట్ గా ఉంటారని అనుకుంటాం, కానీ వారిలో కూడా గుండె సమస్యలు బయటపడటం ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు. అధిక ఒత్తిడి, సరైన నిద్ర లేకపోవడం, జంక్ ఫుడ్, మద్యం, పొగ తాగడం వంటి అలవాట్లే గుండె జబ్బులకు ప్రధాన కారణమని వివరించారు. క్రీడాకారులు, యువత మద్యం, పొగకు దూరంగా ఉండాలని, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం, వాకింగ్ చేయాలని, కొవ్వు పదార్థాలు తగ్గించి పౌష్టికాహారం తీసుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ ఉచిత శిబిరంలో అందరికీ ఈసీజీ, 2డిఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. శిబిరానికి సహకారం అందించిన వినూత్న ఆసుపత్రి యాజమాన్యం నగేష్ ను డాక్టర్ రామ్మూర్తి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ మురళి, వినూత్న ఆసుపత్రి సిబ్బంది, షటిల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## గణేష్ నగర్ లో ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

**హసన్ పర్తి అక్టోబర్11**
**(వుదయం ప్రతినిధి):**



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలోని హసన్ పర్తి 66 వ డివిజన్ లో శ్రీ దుర్గాదేవి ఉత్సవ కమిటీ నిర్వాహకులు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆదివారం మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీ దుర్గాదేవి ఉత్సవ కమిటీ కి దాది సరోజన బిక్షపతి దంపతులు విగ్రహ దాతగా ఉన్నారు. పురోహితులు దహంగం రమేష్ శర్మ వేదమంత్రాలతో అమ్మవారి పూజలు చేశారు. అమ్మవారి కృపతో సకాలములో వర్షాలు కురవాలని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషలతో ఉండాలని శ్రీ దుర్గాదేవి ఉత్సవ కమిటీ నిర్వాహకులు అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు దాది మధుసూదన్, ఉప్పల రవి, ఉప్పల యుగేందర్, దాది రాజు, గరిగె శ్రీనివాస్, గరిగె నాగార్జున, కామేశ్వర్ రెడ్డి, వడ్డేపల్లి శ్రీనివాస్, దాది రాజేశ్వర్, వేణు, గరిగే రాజు, దాది నాగరాజు, తోట సంపత్, రాకేష్, కోటి, కన్నయ్య, సురేందర్, మహిళా భక్తురాలు రజినీ, శైలజ, రజిత, పద్మ, జ్యోతి, కొమురమ్మ, మంజుల, స్వప్న, సౌమ్య, సాంబలక్ష్మి, రమ్యకృష్ణ, రమ, సింధూ, భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం రెండింటికి సమ ప్రాధాన్యత



**పాలేరు నియోజక వర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**ఖమ్మం వుదయం బ్యూరో, అక్టోబర్ -11**

ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇచ్చి పాలన సాగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పాలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏదులాపురం మునిసిపాలిటీ 23 వ వార్డులో 2 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న గిరిజన భవనం, కూసుమంచి మండలం మంగళితాండ గ్రామంలో మంగళితాండ నుండి దుబ్బబండ వరకు రూ.163.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న బిటీ రోడ్డు, జుజ్జుల్ రావుపేట గ్రామంలో రూ. 45 లక్షల వ్యయంతో నిర్మించనున్న 100 కేఎల్ ఓహెచ్ఎస్ఆర్, పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. మంగళితాండ గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. కూసుమంచి మంత్రి క్యాంపు కార్యాలయంలో కూసుమంచి మండలానికి చెందిన 30 మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంత్రి చెక్కుల పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాల లబ్ధి చేకూరుస్తూ, మెరుగైన పాలన అందిస్తున్నదని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఎల్నినో కారణంగా దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తాగునీరు, కరెంట్ సమస్య తీవ్రంగా ఎదురవుతుందని, ప్రమాదం అంచున ఉన్నామని తెలిపారు. నీటి, కరెంట్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతన్నలు రెండవ పంట వెయ్యొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఏదలాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కూసుమంచి మండల తహశీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు

## గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**గిరిజనులు, ప్రజలు తమ సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలి**
**ఐటీడీఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట**
**భద్రాచలం, అక్టోబర్ 11**
**(వుదయం ప్రతినిధి) :**



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం, అక్టోబర్ 12వ తేదీన నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తెలిపారు. ఆదివారం వారు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో ఈ మేరకు స్పష్టం చేశారు. గిరిజనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రభుత్వ సేవలు పొందడంలో ఉన్న సమస్యలను ప్రజలు ఈ కార్యక్రమాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు, ఇతర ప్రజలు సంబంధిత అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదులను అందజేయాలని సూచించారు. ఫిర్యాదులో సమస్యకు సంబంధించిన వివరాలు స్పష్టంగా పేర్కొనడంతో పాటు, అవసరమైన ఆధార పత్రాలను జతచేస్తే సంబంధిత అధికారులు సమస్యను పరిశీలించేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసేందుకు సోమవారం ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరాల్లో సంబంధిత అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల స్వభావాన్ని బట్టి తగిన చర్యలు తీసుకునేలా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితులు లేకుండా, ఫిర్యాదులపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించడం అవసరమని తెలిపారు. గిరిజనుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు సంబంధిత అధికారులు సమయపాలన పాటిస్తూ హాజరుకావాలని, గిరిజనులు, ప్రజలు తమ సమస్యలపై లిఖితపూర్వక ఫిర్యాదులతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట సంయుక్త ప్రకటనలో కోరారు.

## తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాలి



**జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జ్యోతి**
**ఖమ్మం కలెక్టరేట్‌లో ఘనంగా రెండవ రోజు బతుకమ్మ సంబరాలు**
**ఖమ్మం వుదయం బ్యూరో**
**అక్టోబర్- 11:**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాలని జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాల్లో భాగంగా ఖమ్మం కలెక్టరేట్ లో ఆదివారం రెండవ రోజు అటుకుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో అధికారులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని, సాంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలతో పండుగ సంబరాలను జరుపుకున్నారు.ఈ సందర్భంగా

జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతిపై మనకున్న ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంప్రదాయాలను పరిరక్షిస్తూ, భావి తరాలకు అందించడంలో బతుకమ్మ పండుగకు విశిష్టమైన స్థానం ఉందని అన్నారు.వివిధ రకాల సహజసిద్ధమైన పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటిచెబుతుందని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ ఆనందోత్సాహాల మధ్య నిర్వహించే బతుకమ్మ వేడుకలు సామాజిక ఐక్యతను, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల్లో భాగంగా ప్రతిరోజూ నిర్దేశించిన శాఖల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గొల్లగూడ 42వ డివిజన్ లో ఘనంగా దుర్గామాత ఉత్సవాలు



**నవదుర్గ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు**
**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి**
**అక్టోబర్ 11**

నల్లగొండ పట్టణ పట్టణంలోని గొల్లగూడ 42వ వార్డులో నవదుర్గ యూత్ ఆధ్వర్యంలో 13వ సంవత్సరం దుర్గామాత ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత విగ్రహాన్ని అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.

దుర్గామాత ఉత్సవాలు భక్తిలోనే కాకుండా ఐకమత్యానికి, సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా నిర్వహించే పూజలు, భక్తి కార్యక్రమాలతో గొల్లగూడ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నవదుర్గ యూత్ సభ్యులు ఉత్సవాల నిర్వహణలో ఉత్సాహంగా పాల్గొంటూ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. యువత ఐకమత్యంతో సంప్రదాయాలను కాపాడుతూ, భక్తి భావాన్ని చాటడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. దుర్గామాత ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు, యువతలో సేవాభావాన్ని చాటుతున్నాయి కమిటీ సభ్యులు దాసరి క్రాంతి కుంచం శ్రీను సముద్రాల మధు బెజవాడ ఆంజనేయులు దుర్గామాత స్వాములు కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ " విగ్రహం ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి తుమ్మల



**సత్తుపల్లి అక్టోబర్ 11**
**(వుదయం ప్రతినిధి):**

సత్తుపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ ఆఫీస్ ఎదురుగ మెయిన్ రోడ్ లో " ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ " విగ్రహం ఆవిష్కరించిన..... రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు మరియు సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఈ కార్యక్రమం లో కల్లూరు సబ్ కలెక్టర్, ప్రభుత్వ అధికారులు,సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహన బేగం కమల్ పాషా, సత్తుపల్లి AMC చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ మున్సిపల్ కౌన్సిలర్స్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి,
సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు, పసుమర్తి చందర్ రావు, నిర్వాహకులు రిటైర్డ్ SE పద్మారావు, పద్మశాలి సంఘం కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, NSUI నాయకులు ,ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ సత్య శారద



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి**
**అక్టోబర్ 11.**

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం కుటుంబ సమేతంగా వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కలెక్టర్‌కు సాదర స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భద్రకాళి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కలెక్టర్ ఆకాంక్షించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆలయ పరిపాలన విభాగం అధికారులకు సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంతో పాటు ఉత్సవాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.భద్రకాళి అమ్మవారి ఆలయం భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో విశిష్ట పాత్ర పోషిస్తోందన్నారు.

## రైతు వేదికల్లో సీఎం వీడియో కాన్ఫెరెన్స్ ప్రసారం



**– మండల అధికారులు, స్పెషల్ అధికారులు తప్పక హాజరు కావాలి**
**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
**హనుమకొండ, అక్టోబర్ 11**
**(వుదయం జిల్లా ప్రతినిధి) :**

ఎల్ నినో అలాగే వ్యవసాయానికి సంబంధించిన వివిధ అంశాల మీద రేపు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మధ్యాహ్నం 12 గంటల నుండి మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా రేపు జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు .జిల్లాలోని అన్ని రైతువేదికలలో ప్రసారం కానున్న ఈ వీడియో కాన్ఫరెన్స్ కి మండలాధికారులు,వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు, స్పెషల్ అధికారులు హాజరు కావాల్సి ఉన్నందున గ్రీవెన్స్ కార్యక్రమం 12 గంటల వరకే జరుగుతుందని... ఈ విషయాన్ని ప్రజలు గమనించవలసిందిగా కలెక్టర్ కోరారు

## ఎల్లమ్మ గుడి యూత్ దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



**శ్రీనగర్ ఎన్‌జీవోస్ కాలనీలో భక్తిశ్రద్ధలతో దుర్గామాత ఉత్సవాలు**
**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి**
**అక్టోబర్ 11**

నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ ఎన్‌జీవోస్ కాలనీలో ఎల్లమ్మ గుడి యూత్ దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత ఉత్సవాలను 4వ సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు కాలనీ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దుర్గామాత శక్తి, ధైర్యం, ధర్మానికి ప్రతీకగా భక్తులు భావిస్తారు. దుష్టశక్తులపై విజయం సాధించి, సకల జనులకు శుభాలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజించడం ఆనవాయితీగా వస్తోంది. దుర్గామాత ఉత్సవాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతోపాటు, ఐక్యత, సోదరభావాన్ని చాటిచెబుతాయి.

ఎల్లమ్మ గుడి యూత్ దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలతో శ్రీనగర్ ఎన్‌జీవోస్ కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకర్ శివకుమార్ రంజిత్ కుమార్ సాయి భార్గవ్ సాయి రాజు నందు రోహిత్ దుర్గామాత భక్తులు కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రైతులకు రుణాల మంజూరులో ఇబ్బందులు పెట్టొద్దు
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**కరీంనగర్ అక్టోబర్ 11 (వుదయం ప్రతినిధి):**

మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. రైతులకు రుణాలు మంజూరు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులు కల్పించవద్దని, అవసరమైతే నిబంధనలను సరళతరం చేయాలని అన్నారు. తిమ్మాపూర్ మండలం పోరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా గోపు తిరుపతిరెడ్డితో పాటు పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి పాత బకాయిలు ప్రతిబంధకంగా మారకుండా చూడాలన్నారు. బకాయిల వసూళ్ల విషయంలో ఉదాసీన వైఖరిని వీడి, అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. అదే సమయంలో రైతులకు రుణాల మంజూరులో అనవసర జాప్యం లేకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రస్తుతం లాభాల్లో కొనసాగుతున్న పోరండ్ల పీఏసీఎస్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా కూరగాయలు సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తూ, వారి ఆదాయం పెరిగేలా సహకార సంఘం తరఫున అవసరమైన సహకారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి అక్బరుద్దీన్, స్థానిక సర్పంచ్ అసోద శ్రీనివాస్, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, ఒగ్గు దామోదర్, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, చింతల తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, ఉంటా రాజేందర్‌రెడ్డి, ద్యావ శ్రీనివాస్‌రెడ్డి, పులి కృష్ణ, లింగాల శ్రీనివాస్, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, రావుల కృష్ణగౌడ్, అయితం వెంకన్న, పొన్నాల సంపత్, కేతిరెడ్డి లింగారెడ్డి, మేడి అంజయ్య, పోలు రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిప్టో పేరుతో రూ.10 కోట్లకు పైగా మోసం

- రెండేళ్లలో రెట్టింపంటూ వందలాది మందికి టోకరా
- ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 11:**

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే రెండేళ్లలో రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మించి వందలాది మందిని మోసగించిన ఐటీసీ గ్లోబల్ సంస్థకు చెందిన ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 500 మంది బాధితుల నుంచి రూ.10 కోట్లకుపైగా వసూలు చేసినట్లు అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.



**రూ.7.50 లక్షలు పెట్టుబడి పెట్టి..**

తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన జువ్వక నర్సింలు ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఎస్పీ తెలిపారు. ఐటీసీ గ్లోబల్ ప్రతినిధులు అధిక లాభాలు వస్తాయని నమ్మించడంతో ఆయన 2023లో రూ.7.50 లక్షలు పెట్టుబడిగా పెట్టారని వివరించారు. పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా చెల్లించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడన్నారు. దీంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

**నకిలీ వెబ్‌సైట్‌తో వల** నిందితులు cticlub.org పేరుతో వెబ్‌సైట్ రూపొందించి, రూ.1,000 నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి ప్యాకేజీలను ప్రవేశపెట్టినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ పేర్కొన్నారు. రెండేళ్లలో పెట్టుబడి రెట్టింపు అవుతుందని, కొత్త సభ్యులను చేరిస్తే వారి పెట్టుబడులపై 25 శాతం వరకు కమీషన్ ఇస్తామని ఆశ చూపినట్లు వివరించారు. ఈ విధంగా పోంజీ పథకం, మల్టీ లెవల్ మార్కెటింగ్ విధానాల ద్వారా మరింత మందిని సభ్యులుగా చేర్చుకుని డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. **హోటళ్లలో సమావేశాలు.. జూమ్ మీటింగ్‌లతో ప్రచారం** ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు వివిధ ప్రాంతాల్లోని హోటళ్లు, లాడ్జీల్లో సమావేశాలు నిర్వహించడంతోపాటు జూమ్ మీటింగ్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా పథకాన్ని ప్రచారం చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. డైరీలు, క్యాలెండర్లు పంపిణీ చేస్తూ పెట్టుబడిదారులను ఆకర్షించారని తెలిపారు. ఆన్‌లైన్ ఎక్స్ఛేంజ్‌లు, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారా డబ్బులు సేకరించినట్లు వివరించారు. పెట్టుబడిదారుల ఐడీల్లో క్రిప్టో కరెన్సీ జమ అయినట్లు చూపించి నమ్మించారని పేర్కొన్నారు.

**ఆదిలాబాద్‌లో ఐదుగురు బాధితులు**

ఆదిలాబాద్‌లోని ద్వారక హోటల్‌లో సమావేశాలు నిర్వహించి పెట్టుబడులపై ప్రచారం చేసినట్లు విచారణలో గుర్తించామని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదుల ప్రకారం జువ్వక నర్సింలు రూ.7.50 లక్షలు, చిక్కి గంగాధర్ రూ.7.50 లక్షలు, అడ్డీ కాంతారెడ్డి రూ.6.21 లక్షలు పెట్టుబడిగా చెల్లించినట్లు వెల్లడించారు. ఈ ముగ్గురి పెట్టుబడుల మొత్తం రూ.21.21 లక్షలు కాగా, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం ఐదుగురు బాధితులు సుమారు రూ.30 లక్షలు నష్టపోయినట్లు గుర్తించామని పేర్కొన్నారు. **ఇద్దరు అరెస్టు.. ఆస్తులు స్వాధీనం** ఈ కేసులో ఐటీసీ గ్లోబల్ వ్యవస్థాపకుడు పొలమారశెట్టి రత్నరాజు (47), సహ వ్యవస్థాపకుడు దొండపాటి లక్ష్మణరావు అలియాస్ లాజరస్ (46)ను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సంస్థ ప్రతినిధులు గోపికృష్ణ, అజీమ్ ఖాన్, వరంగల్‌కు చెందిన ఏజెంట్లు గాజుల ప్రమోద్ కుమార్, వేమునూరి సుధీర్‌లపై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు. దర్యాప్తులో భాగంగా జహీరాబాద్, రాజమండ్రికి సంబంధించిన ఆస్తులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతర బాధితుల వివరాలు, ఆర్థిక లావాదేవీలు, మోసానికి గురైన మొత్తం నగదును గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

**పెట్టుబడులపై అప్రమత్తంగా ఉండాలి**

క్రిప్టో కరెన్సీ పేరుతో తక్కువ సమయంలో పెట్టుబడులు రెట్టింపు చేస్తామని, అధిక లాభాలు ఇస్తామని చెప్పే వ్యక్తులు, సంస్థల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. పెట్టుబడి పెట్టే ముందు సంస్థ విశ్వసనీయత, చట్టబద్ధతను పరిశీలించాలని తెలిపారు. సైబర్ ఆర్థిక మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని, సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్, ఎస్ఐలు అశోక్, సంజయ్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## రామకృష్ణాపూర్‌లో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..

- పలు మండపాల్లో దుర్గామాత విగ్రహాల ప్రతిష్ఠ...

**మంచిర్యాల /రామకృష్ణాపూర్/ అక్టోబర్ 11(వుదయం ప్రతినిధి)**

రామకృష్ణాపూర్ పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రత్యేక మండపాలు, ఆలయాల్లో ప్రతిష్ఠించారు. డీజే సప్పులు, బాజాభజంత్రీల నడుమ భక్తుల కోలాహలం మధ్య అమ్మవారి విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించడంతో పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రామకృష్ణాపూర్ పట్టణంలోని సీహెచ్‌పీ, రాజీవ్ చౌక్, బిజోన్ సెంటర్, సూపర్ బజార్, కాశీ విశ్వనాథ షిరిడీ సాయిబాబా ఆలయం,రామాలయం,ఏ జోన్, భగత్ సింగ్ నగర్, హాట్స్ ఏరియా, అమ్మ గార్డెన్ ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా మండపాలను నిర్వాహకులు విద్యుత్ దీపాలు, పూల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

**దుర్గామాత ఆరాధనకు విశేష ప్రాధాన్యం..**హిందూ సంప్రదాయంలో శరన్నవరాత్రులకు విశిష్టమైన స్థానం ఉంది. దుర్గామాతను శక్తి, ధైర్యం, జ్ఞానం, ధర్మానికి ప్రతీకగా భక్తులు ఆరాధిస్తారు. దుష్టశక్తులపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా అమ్మవారి ఆరాధనను భావిస్తారు. మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించి లోకాలకు శాంతిని చేకూర్చిన దుర్గాదేవి కథ చెడుపై మంచి సాధించిన విజయాన్ని చాటిచెబుతుంది. నవరాత్రుల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పర్వదినాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావం, సేవా భావానికి ప్రేరణనిస్తాయి.ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి నిష్ఠతో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దుర్గామాత కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పలువురు భక్తులు దుర్గామాత మాలలు ధరించి నియమనిష్ఠలతో పూజలు నిర్వహిస్తున్నారు. భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య రామకృష్ణాపూర్ పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జగిత్యాల క్రీడాకారులు

- ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ అభినందనలు

**జగిత్యాల అక్టోబర్ 11 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) 2026-27 సంవత్సరానికి నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జగిత్యాల క్రీడాకారులను జగిత్యాల నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అభినందించారుజగిత్యాల కేలో ఇండియా బాక్సింగ్ సెంటర్‌కు చెందిన క్రీడాకారులు అండర్-14 అండర్-17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు క్రీడాకారులను అభినందిస్తూ రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జగిత్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు అనంతరం కోచ్ నవీన్ ను అభినందించారు అండర్-14 విభాగంలో సిహెచ్ గుణతేజ వి మిధున్ అసిత్ ఇస్మాయిల్ అండర్-17 విభాగంలో ఎల్ కార్తికేయ హృదయ్ సిహెచ్ శ్రీవైష్ణవి కే వాసవి ఎస్ స్వరాలి తదితర క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు క్రీడాకారులు కష్టపడి సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు జగిత్యాల జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు ఖేలో ఇండియా బాక్సింగ్ సెంటర్ ను అందరూ ఉపయోగించుకోవాలని చదువు తో పాటు శారీరక దారిద్యం ముఖ్యమే అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ బాక్సింగ్ కోచ్ ఆరుముల పవన్ కేలో ఇండియా కోచ్ నల్ల నవీన్ జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం మాజీ సర్పంచ్ మహేశ్వర్ రావు శరత్ రావు మహేందర్ రావు ఈశ్వర్ బాల ముకుందం తదితరులు పాల్గొన్నారు



## ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

**రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 11 (వుదయం ప్రతినిధి)**



.. దసరా పండుగకు ఊర్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలిగ్రామాల్లో, కాలనిలలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండిదసరా పండుగ సందర్భంగా చాలామంది తమ స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారని, ఇదే అదనుగా భావించి దొంగలు ఇళ్లలో చోరీలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. పండుగకు ఊళ్లకు వెళ్లే వారు తమ ఇళ్ల భద్రత విషయంలో ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లా పరిధిలో చోరీల నియంత్రణకు పోలీసు శాఖ తరఫున అన్ని అవసరమైన చర్యలు చేపడుతున్నామని, రాత్రి వేళల్లో పోలీసు గస్తీని ముమ్మరం చేయడంతో పాటుగా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తున్నన్నారు.గ్రామాల్లో, కాలనిలలో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా,

అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని కోరారు.దొంగతనాలు దృష్ట్యా పోలీస్ శాఖ వారి పలు సూచనలు ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా పరదా కప్పి ఉంచాలి. మెయిన్ డోర్ లోపల నుంచి లాక్ చేసి.. పక్క ఊరు వెళ్లేముందు ఇంట్లో బంగారు, వెండి, డబ్బు వంటి విలువైన వస్తువులను బీరువాలో పెట్టకూడదు. బ్యాక్ లాకర్లలో దాచుకోవడం మంచిది. విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాల సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దు. బీరువా తాళాలు ఇంట్లో కప్‌బోర్డులు లేదా ఇతర ప్రదేశాలలో ఉంచకూడదు. ఊరు వెళితే ఇంటి పక్కనవారికి, సంబంధిత పోలీసులకు సమాచారం అందించడం ద్వారా రాత్రి సమయాల్లో గస్తీ తిరగడానికి వచ్చినప్పుడు ఇంటి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.

రాత్రి సమయంలో ఏదైనా ఒక రూమ్‌లో లైట్ వెలుగుతూనే ఉండేలా ఆన్ చేసి ఉంచాలి. అనుమానిత లేదా కొత్త వ్యక్తులు ఇంటి చుట్టూ తిరగడం కనిపిస్తే వెంటనే 100/112 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వండి. మీ మొబైల్ కి నోటిఫికేషన్ వచ్చేలా.. ఇంటికి సీసీ కెమెరా అమర్చుకోవాలి. ఇంటి బయట నాలుగు దిక్కులు కవర్ అయ్యేలా కెమెరాలు అమర్చుకోవాలి. చుట్టుప్రక్కల వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం, ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఇంట్లో ఎవరైనా మహిళలు, వృద్ధులు వద్దకు వచ్చి అపరిచితులు సమాచారం కావాలంటూ వస్తే నమ్మవద్దని చెప్పాలి.

## రెవెన్యూ, అటవీ భూముల హద్దుల గుర్తింపునకు రీ సర్వే

- ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)11 అక్టోబర్ 2026**



జిల్లాలో రెవెన్యూ, అటవీ భూ సమస్యల పరిష్కారానికి భూముల రీ సర్వే ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.

ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూముల రీ సర్వే, అటవీ-రెవెన్యూ భూ సమస్యలు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రీ సర్వే ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ, నీటిపారుదల తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, భూ సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, జిల్లా అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీవో దేవిదాస్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల సంఘంపై ఎంపీ వంశీకృష్ణ నిరాధార ఆరోపణలు



- ఓటమి భయంతోనే ఓట్ల చోరీ నాటకం
- పెద్దపల్లికి ఎంపీ చేసిందేమీ లేదు..ఢిల్లీలో ఫోటోలకే పరిమితం
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం

**పెద్దపల్లి, అక్టోబర్ 11 (వుదయం ప్రతినిధి)**

కేంద్ర ఎన్నికల సంఘంపై,చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేస్తున్న నిరాధార వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థలను తీవ్రంగా కించపరిచేలా ఉన్నాయని బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం మండిపడ్డారు.జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో పల్లె సదానంద మాట్లాడుతూ మహారాష్ట్ర,హర్యానా ఎన్నికల ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు ఈవీఎంలు,రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని ధ్వజమెత్తారు.ఢిల్లీ వేదికగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతున్న 13 కోట్ల ఓట్ల చోరీ ఆరోపణలకు ఒక్క ఆధారమైనా చూపించగలరా అని సూటిగా ప్రశ్నించారు.పెద్దపల్లి ఎంపీగా గెలిచి 16 నెలలు గడిచినా నియోజకవర్గానికి నయాపైసా తీసుకురాలేదని,రామగుండం ఎరువుల కర్మాగారం,ఎన్టీపీసీ,రైల్వే లైన్ డబ్లింగ్,నేషనల్ హైవే 363 వంటి అభివృద్ధి పనులన్నీ మోదీ ప్రభుత్వ నిధులతోనే సాధ్యమయ్యాయని స్పష్టం చేస్తూ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రాముడిని కల్పిత పాత్రగా కోర్టులో అఫిడవిట్ ఇచ్చిన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు రాముడి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని,కాకా కుటుంబం పేరు చెప్పుకుని గెలిచిన వంశీకృష్ణ సింగరేణి కార్మికులకు ఇండ్ల పట్టాల హామీని ఎందుకు నెరవేర్చలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు.స్థానిక సమస్యలను గాలికొదిలేసి ఢిల్లీలో రాహుల్ గాంధీ మెప్పు,ఫోటోల కోసమే సమయం వెచ్చిస్తున్న ఎంపీ వెంటనే ఎన్నికల సంఘానికి,సీఈసీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోర మనోహర్, పెండ్యాల కుమార్,సంపత్ చారి,కోల సుధాకర్,ముస్తాల సంతోష్,బండ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా





**నిజామాబాద్ :**

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 275 మంది లబ్ధిదారులకు రూ. 2.75 కోట్లకు పైగా ఆర్థిక సాయం

పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.

నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 275 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మొత్తం రూ. 2,75,31,900 విలువైన ఆర్థిక సహాయ చెక్కులను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అందజేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, ఆడబిడ్డల వివాహాలు పేద కుటుంబాలకు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో షాదీ ముబారక్ పథకం కింద 149 మంది లబ్ధిదారులకు రూ. 1,49,17,284, కళ్యాణ లక్ష్మి పథకం కింద 126 మంది లబ్ధిదారులకు రూ. 1,26,14,616 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ రెండు పథకాల ద్వారా మొత్తం 275 మంది లబ్ధిదారులకు రూ. 2,75,31,900 ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టిందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతు రుణమాఫీ, రైతు భరోసా, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో NUDA చైర్మన్ కేశ వేణు, స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా సయ్యద్ ఖదీర్ నియామకం

- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేత

**కామారెడ్డి, అక్టోబర్ 11 (వుదయం ప్రతినిధి):-**



కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సయ్యద్ ఖదీర్ (సయ్యద్ మసూద్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ పట్టణ మైనార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇలియాజ్ కి, రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షులు ఇర్ఫాన్ అలీకి, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు షేక్ అజీమ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తానని సయ్యద్ ఖదీర్ తెలిపారు.

## రామగిరి శ్రీనివాస్ కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం...

**మంచిర్యాల/రామకృష్ణాపూర్ /అక్టోబర్ 11(వుదయం ప్రతినిధి)**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామగిరి శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పలువురు నాయకులు సంతాపం తెలిపారు.ఆయన దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం మంత్రి వివేక్ వెంకటస్వామి రూ.10 వేలు, కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి,తవక్కల్ విద్యాసంస్థల అధినేత అబ్దుల్ అజీజ్ రూ.10 వేలు, యువత జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మొత్తం రూ.30 వేల సాయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాండ్ల సమ్మయ్య చేతుల మీదుగా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు, ప్రధాన కార్యదర్శి ఎల్పుల సత్యనారాయణ, యువ నాయకులు బోద్దుల ప్రేమ్ సాగర్, గౌస్, కలీమ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. రామగిరి శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## క్రీడలు క్రమశిక్షణ, పట్టుదలను నేర్పుతాయి

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, అక్టోబర్ 11 (వుదయం ప్రతినిధి)**




క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలలో శనివారం 12వ తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలను జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్పీ నితిక పంత్, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని 32 జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. చిన్న వయస్సు నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని,గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామని తెలిపారు. క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

అనంతరం పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు పతకాలు, బహుమతులు, ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎం.శేకు, డీసీసీ ప్రతినిధి ఆత్రం సుగుణ, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి కొట్నాక విజయ్, వివిధ శాఖల అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## వీసీల ద్వారా నేడు సీఎం రైతులతో ముఖాముఖి

- **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

**నారాయణపేట టౌన్ అక్టోబర్11 (వుదయం ప్రతినిధి)**



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం 12వ తేదీ సోమవారం ఉదయం 11: 30 గంటలకు జిల్లాలోని అన్ని రైతు వేదికలలో లైవ్ టెలికాస్ట్ చే యనున్నట్లు ఆమె తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని రైతాంగానికి ప్రస్తుత పంటలను కాపాడుకునే విధానము, రాబోవు యాసంగి సీజన్లో, పంటల సాగు ప్రణాళిక ఎలా వుండాలి, ఎలినినో తీవ్ర కరువును ఎలా తట్టుకోనే వ్యూహాలు గురించి ప్రసంగిస్తారు. రైతులతో ముఖాముఖి రైతుల అభిప్రాయ సేకరణ,అభిప్రాయాలు తీసుకుంటారు. సోమవారం నాటి ముఖ్యమంత్రి వీడియో వీడియో కాన్ఫరెన్స్ నారాయణపేట జిల్లా లోని 38 విని యూనిట్స్ గల రైతు వేదిక లలో నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు హాజరు కావాలని ఆమె కోరారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సంప్రదించి వారు వారి లబ్ధిదారులు కూడా అధిక సంఖ్యలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొనేలా ఈ కార్యక్రమాన్ని జయప్రదం అయ్యేలా అధికారులు అందరూ వ్యవసాయ సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

## అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ

- **37వ వార్డులో యూజీడీ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**సంగారెడ్డి ,వుదయం**



అభివృద్ధిలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయాలనిగత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.50 కోట్లలో రూ.22 కోట్ల పనులే పూర్తి.. మిగతా నిధులను రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంఅభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.సంగారెడ్డి పట్టణంలోని 37వ వార్డులో కౌన్సిలర్ జలేందర్ ఆధ్వర్యంలో చేపట్టనున్న యూజీడీ (అండర్గ్రౌండ్ డ్రైనేజీ) పనులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి విషయంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వార్డుల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంగారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అయితే, ఆ నిధుల్లో కేవలం రూ.22 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయని, మిగిలిన నిధులను ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు.సంగారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం గతంలో మంజూరైన మిగిలిన నిధులను తిరిగి మంజూరు చేసి, పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణ ప్రజలకు అవసరమైన డ్రైనేజీ, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలోనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కూన వసిత, కాసాల బుచ్చిరెడ్డి, నాగరాజు గౌడ్, పల్లె సంజీవరావు, కౌన్సిలర్లు కొత్తపల్లి శ్రీకాంత్, దశరథ్ రెడ్డి, జాఫర్, సురేష్, నాయికోటి నవీన్, శ్రీకాంత్, వార్డు సభ్యుడు జీవీ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణికి బ్రేక్!

- **సీఎం వీడియో కాన్ఫరెన్స్ నేపథ్యంలో కలెక్టర్ కీలక నిర్ణయం**

**మండల, డివిజన్ స్థాయి కార్యక్రమాలు రద్దు**

**గద్వాల అక్టోబర్ 11 (వుదయం కరస్పాండెంట్)**



జిల్లాలో నేడు నిర్వహించాల్సిన మండల, డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల పరిస్థితిపై సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు రైతు వేదికల్లో విధులు నిర్వహించాల్సి ఉండటంతో ప్రజావాణి కార్యక్రమాలను రద్దు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజావాణి ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలనుకునే ప్రజలు ఈ మార్పును గమనించాలని సూచించారు.

## తెల్లాపూర్‌లో ఘనంగా దసరా, బతుకమ్మ వేడుకలు..

**మహిళలకు చీరలు, ఆటో డ్రైవర్లకు బహుమతులు పంపిణీ**



**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 11)**

దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పండుగ కానుకల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కేసీఆర్ నగర్ ఫేస్1, ఫేస్2 మహిళలకు, మున్సిపల్ సిబ్బందికి చీరలు, ఆటో డ్రైవర్లకు దుస్తులు, బహుమతులు అందజేశారు. బతుకమ్మ, దసరా పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలతో సంతోషాలను పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ నగర్ ఫేస్1, ఫేస్2 నాయకులు పాల్గొన్నారు.

## గజ్వేల్ తహసిల్దార్ సస్పెన్షన్ పట్ల హర్షం



**మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్**

**నారాయణపేట అక్టోబర్11 (వుదయం ప్రతినిధి)**

రైతును అవమానించిన గజ్వేల్ తహశీల్దార్ ను అధికారులు సస్పెండ్ చేయడం పట్ల నారాయణ పేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణు గోపాల్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తహశీల్దార్ ను సస్పెండ్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనని నిరూపించుకున్నదని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యను పరిష్కరించాల్సిన అధికారి, రైతును చూసి నిన్ను చూస్తే నవ్వొస్తుంది అనడం బాధాకరమన్నారు. ఇది ప్రజా పాలనకు విరుద్ధం అని అన్నారు. అలాంటి అధికారిపై చర్య తీసుకుని ప్రభుత్వం అందరికీ హెచ్చరిక చేసినట్లు అయిందనీ అన్నారు.రైతును ఆదుకున్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రకృతి దోపిడీకి మట్టి మాఫియా.. గద్వాలలో యథేచ్ఛగా గుట్టల విధ్వంసం!

- **మాది కాదు.. మాకు సంబంధం లేదు'.. అధికారుల అడ్డగోలు సమాధానాలు!**
- **ప్రాణకోటికి ముప్పు ముంచుకొస్తున్నా.. నిద్రమత్తు వీడని యంత్రాంగం!**

**గద్వాల, అక్టోబర్ 11 (వుదయం బ్యూరో)**



ఉమ్మడి జిల్లా కేంద్రానికి అతి సమీపంలో, పచ్చని ప్రకృతి ఒడిలో దశాబ్దాలుగా ప్రశాంతంగా నిలిచిన గుట్టలు నేడు రాక్షస కాండకు బలవుతున్నాయి. రాత్రికి రాత్రే జేసీబీలు, టిప్పర్లతో మూగబోయిన కొండలను గుల్ల చేస్తూ.. కోట్ల విలువైన మట్టి సంపదను మాఫియా ముఠాలు అప్పనంగా దోచుకెళ్తున్నాయి. పచ్చని కొండలు కంకర కుప్పలుగా మారుతుంటే, కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికార యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తోంది. గుట్టల తవ్వకాలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నా, అసలు అనుమతులు ఎవరిచ్చారనే దానిపై అధికారుల వద్దే పొంతన లేని, బాధ్యతారహితమైన సమాధానాలు వస్తుండటం గమనార్హం. ఒక శాఖపై మరో శాఖ నెపం నెడుతూ 'బ్లేమ్ గేమ్' ఆడుతుండటంతో.. ఈ అక్రమ దందాల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది ఇప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

అనుమతులు ఎవరిచ్చారు? బాధ్యత ఎవరిది?

జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో గుట్టలను ధ్వంసం చేస్తూ, మట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యవ హారంపై మైనింగ్ శాఖ ఏడీని వివరణ కోరగా వెలువడిన సమాధానం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, బహుశా తహసీల్దార్ కార్యాలయం నుంచే మంజూరై ఉండవచ్చని ఆయన బాధ్యతను వేరేవారికి అంటగట్టే ప్రయత్నం చేశారు. ఇక అసలు తహసీల్దార్‌ను ఆరా తీస్తే.. తమ కార్యాలయం నుంచి కూడా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని బుకాయించడం సిగ్గుచేటు. రెండు ప్రధాన శాఖలు పరస్పరం బాధ్యతను తప్పించుకుంటున్న వేళ.. నిబంధనలను తుంగలో తొక్కి సాగుతున్న ఈ అక్రమ తవ్వకాలకు అండగా నిలుస్తున్న తెరవెనుక శక్తులు ఎవరివనేది ఇప్పుడు అంతుచిక్కని ప్రశ్నగా మారింది. అధికారుల ఉదాసీనత.. నిఘా లోపం!

అధికారికంగా అనుమతులు లేవని ఒకరినొకరు వేలెత్తి చూపుతున్న అధికారులు.. క్షేత్రస్థాయిలో వేల టన్నుల మట్టి కొల్లగొట్టబడుతున్నా ఎందుకు నిఘా పెట్టలేకపోతున్నారు? రోజూ భారీ వాహనాల్లో మట్టి తరలిపోతుంటే అధికారుల కంట పడకపోవడం వెనుక ఆంతర్యమేమిటి? తెరవెనుక ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా.. ఎందుకు నోరుమెదపడం లేదు? కేవలం మీడియాలో వార్తలు వచ్చినప్పుడే హడావుడి చేయడం, ఆపై మొక్కుబడి తనిఖీల పేరుతో కాలయాపన చేయడం పరిపాటిగా మారింది. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ లోపించడం వల్లే మాఫియాకు అడ్డులేకుండా పోతోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ సమతుల్యతకు పెను ముప్పుగుట్టలు, కొండలు కేవలం రాతి బండలు కావు; అవి ప్రకృతి సమతుల్యతకు, జీవవైవిధ్యానికి మూలస్తంభాలు.

ఇలాంటి వాటిని విచక్షణారహితంగా తవ్వివోస్తే భవిష్యత్తులో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో పాటు తీవ్ర వాతావరణ మార్పులు, దుష్ప్రభావాలు ప్రజల ప్రాణాల మీదకు వస్తాయి. పారదర్శకత లోపించడం, చట్టాలను కఠినంగా అమలు చేయకపోవడం వల్లే అక్రమార్కులు మరింతగా రెచ్చిపోయి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతు న్నారు.కలెక్టర్ జోక్యంతోనే గుట్టు రట్టు!క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ దారుణాలపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. మైనింగ్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులపై కొరడా ఝుళిపించి, సమగ్ర విచారణకు ఆదేశించాలి. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, మట్టి తరలింపు పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. నిబంధనల ఉల్లంఘన రుజువైతే బాధ్యులపై నిర్దాక్షిణ్యంగా చట్టపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో, ప్రకృతి సంపద దోపిడీకి అధికార యంత్రాంగం కుమ్మక్కైందనే ఆరోపణలకు బలం చేకూర్చినట్లవుతుంది. ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మరి ఈ వ్యవహారంలో జిల్లా యంత్రాంగం నిద్రమత్తు వీడి ఎప్పుడు స్పందిస్తుంది? ప్రజల సందేహాలను నివృత్తి చేసి వాస్తవాలు వెలుగులోకి తెచ్చేదెవరు? కలెక్టర్ కార్యాలయం నుంచి తక్షణ స్పందన వచ్చే వరకు స్థానికుల చూపు ఆ వైపే నిలిచింది.

## సిద్ధిపేటలో శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**



సిద్దిపేటలోని శ్రీశ్రీశ్రీ అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు జి. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి మహాభిషేకం, ప్రత్యేక పూజలు, చండీ హోమం నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అక్టోబర్ 20 వరకు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజూ చండీ హోమం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు కృపాకరాచార్యులు, వైదిక నిర్వాహకులు పూసాల వెంకటాచార్యులు తెలిపారు. సోమవారం అమ్మవారు గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

## రజకుల ఐక్యతకు మరో అడుగు

- **దౌల్తాబాద్ మండల కమిటీ ఏర్పాటు.. అధ్యక్షుడిగా ముత్యంగారి స్వామి**
- **రజకుల హక్కుల సాధనకు సమష్టి కృషి – గ్రామస్థాయి నుంచి సంఘం బలోపేతమే లక్ష్యం**

**దౌల్తాబాద్, అక్టోబర్ 11 (వుదయం):**



రజక సామాజిక వర్గాన్ని ఐక్యంగా సంఘటితం చేసి, వారి హక్కుల సాధనకు కృషి చేయడమే లక్ష్యంగా తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం దౌల్తాబాద్ మండల కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా ముత్యంగారి స్వామిని నియమించారు. సిద్దిపేట జిల్లాలో నిర్వహించనున్న సమితి నాలుగో మహాసభ ఏర్పాట్లలో భాగంగా మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు తెలిపారు. ఇప్పటివరకు 11 మండల కమిటీల ఏర్పాటు పూర్తయిందన్నారు.

**మండల కమిటీ నియామకాలు**

మండల గౌరవ అధ్యక్షుడిగా ఆర్.మల్లేశం, ఉపాధ్యక్షులుగా ముత్యాల శంకర్, చిన్నాకుల నరేష్, ప్రధాన కార్యదర్శులుగా ముత్యంగారి నవీన్, ముత్కంగారి మహేష్, ముఖ్య సలహాదారుగా ముత్యంగారి స్వామి, కోశాధికారిగా రాముల్ల నర్సింలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిటికుల స్వామి, యువజన విభాగం అధ్యక్షుడిగా ముత్యంగారి స్వదేశ్, సహాయ కార్యదర్శిగా కమలాకర్, సామాజిక మాధ్యమాల కన్వీనర్‌గా సట్టా బానును నియమించారు.

**హక్కుల సాధనకు సంఘటిత పోరాటం**

ఈ సందర్భంగా తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక,

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నరంగారి మాట్లాడుతూ.. రజక సామాజిక వర్గాన్ని ఏకతాటి పైకి తీసుకురావడం, వారి హక్కుల సాధనకు సమష్టిగా కృషి చేయడం కమిటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అర్హులైన వారందరికీ అవగాహన కల్పించి, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రజకుల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు సమితిని బలోపేతం చేయడం ద్వారా రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయవచ్చన్నారు. సిద్దిపేట జిల్లాలో నిర్వహించనున్న సమితి నాలుగో మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చింతకింది కరుణాకర్, ఉపాధ్యక్షులు ముత్యాల సత్యస్వామి, జూపల్లి నర్సింలు, మండల అధ్యక్షుడు జంగపల్లి రాజమల్లు, మండలంలోని పలువురు రజక నాయకులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో ఘనంగా అటుకుల బతుకమ్మ వేడుకలు

- **సాంప్రదాయ దుస్తుల్లో మహిళల ఆటపాటలు..**
- **పూల పండుగతో పులకించిన పట్టణం**

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 11, వుదయం:**





తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ సంబరాల్లో రెండో రోజైన అటుకుల బతుకమ్మ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో సందడి చేశారు. తంగేడు, గునుగు, బంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, కోలాటాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆట పాటల అనంతరం మహిళలు పూలతో పేర్చిన బతుకమ్మలను స్థానిక చెరువులో నిమజ్జనం చేసి పండుగను భక్తిభావంతో జరుపుకున్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ వేడుకలు మరోసారి చాటిచెప్పాయి.



## కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**మహబూబ్‌నగర్**

కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఆదివారం వివిధ శాఖల ఉద్యోగులు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా ఆడి పాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల ఆర్. సి.ఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డి.ఎం.హెచ్.ఓ) కార్యాలయ సిబ్బంది,జి.జి.హెచ్,మెడికల్ డైరెక్టర్ ,జడ్చర్ల ఏరియా ఆసుపత్రి సిబ్బంది, పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఏర్పాటు హర్షణీయం.. అభివృద్ధి ఆక్షేపణీయం!

- **ఉద్యమాలతో సాధించుకున్న వికారాబాద్ జిల్లా..**
- **పదేళ్ల తర్వాత కూడా వెనుకబాటేనా?**
- **వి.డి.డి.ఎఫ్. చైర్మన్ కె. శ్రీనివాస్**

**వికారాబాద్ అక్టోబర్ 11 (వుదయం బ్యూరో)**



వికారాబాద్ జిల్లా ఏర్పాటు కోసం సాగిన ఉద్యమం ఒకరోజులో పుట్టింది కాదు.. దశాబ్దాల ఆకాంక్ష, ప్రజల నిరీక్షణ, ప్రజా సంఘాల పోరాటం, ఉద్యమకారుల కృషి ఫలితంగానే జిల్లా ఆవిర్భవించిందని వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం (విడిడిఎఫ్) చైర్మన్ కె. శ్రీనివాస్ పేర్కొన్నారు. అయితే జిల్లా ఏర్పాటు జరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగకపోవడం ఆందోళన కలిగించే అంశమని ఆయన అభిప్రాయపడ్డారు.దశాబ్దాల కల.. ప్రాంతీయ శాసనసభ్యులకు అప్పటి ముఖ్యమంత్రి కిర వేరలేదన్నది విరుద్ధ వాదన.

జిల్లా సాధించాం..

అభివృద్ధి సాధించామా?జిల్లా ఏర్పాటుతో వెనుకబడిన ప్రాంతంగా ప్రత్యేక నిధులు, ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు వస్తాయని ప్రజలు ఆశించారని శ్రీనివాస్ తెలిపారు.జిల్లా సాధన అనంతరం వికారాబాద్ జిల్లా ఫోరంను *వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం (వీడీడీఎఫ్)*గా మార్చి, జిల్లా అభివృద్ధిపై కూడా పోరాటం కొనసాగించాలని నిర్ణయించుకున్నామని చెప్పారు.జిల్లా ఏర్పాటు సంబరాలను వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో సుమారు 10 వేల మంది ప్రజలు, విద్యార్థులతో నిర్వహించామని తెలిపారు.

అభివృద్ధి విషయంలో ఎందుకు వెనుకబాటు?జిల్లా ఏర్పడి దాదాపు దశాబ్దం పూర్తవుతున్న సమయంలో వికారాబాద్ అభివృద్ధిపై సమీక్ష అవసరమని శ్రీనివాస్ పేర్కొన్నారు.కలెక్టరేట్, ప్రభుత్వ ప్రశ్న ఇప్పుడు జిల్లా ఏర్పాటు జరిగిందా? అన్నది కాదు.. జిల్లా ఏర్పాటు వల్ల ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చింది? అన్నదే.కొడంగల్ వైపు అభివృద్ధి.. జిల్లా కేంద్రం వైపు నిరీక్షణ?2023 ఎన్నికల అనంతరం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రం అభివృద్ధిపై చర్చ మళ్లీ మొదలైంది.కొడంగల్ ప్రాంతానికి అభివృద్ధి రావడాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం లేదని, అదే సమయంలో జిల్లా కేంద్రంగా ఉన్న వికారాబాద్‌కు కూడా సమాన ప్రాధాన్యం దక్కాలని శ్రీనివాస్ వాదిస్తున్నారు.వికారాబాద్,

పరిగి, తాండూరు ప్రాంతాల ప్రజల్లో అభివృద్ధి సమతుల్యతపై అసంతృప్తి పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో సంబంధిత ప్రజాప్రతినిధుల వైఖరి, ప్రభుత్వ నిర్ణయాలు, నిధుల కేటాయింపులపై అధికారిక గణాంకాలతో సమగ్ర సమీక్ష అవసరం. ఒక ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుండటం మరో ప్రాంతానికి నిధులు రావడం లేదనే విషయాన్ని స్వయంచాలకంగా నిర్ధారించదు. కాబట్టి జిల్లా అభివృద్ధిపై రాజకీయ ఆరోపణల కంటే నిధులు, ప్రాజెక్టులు, పూర్తయిన పనులు, పెండింగ్ పనుల ఆధారంగా ప్రజా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ప్రజాప్రతినిధులపై ప్రశ్నలు.. ప్రజల వద్ద సమాధానాల కోసం ఎదురుచూపులు జిల్లా కేంద్రం అభివృద్ధికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ప్రశ్నించాల్సిన అంశాలపై ప్రశ్నించకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరగడం సహజమని ఆయన అన్నారు.మరో ఉద్యమం అవసరమా?తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అన్యాయం జరుగుతోందనే భావన నుంచి పుట్టిందని, అదే తరహాలో జిల్లా అభివృద్ధిలో అసమానతలపై ప్రజా ఉద్యమం అవసరమనే అభిప్రాయాలు ఇప్పుడు వినిపిస్తున్నాయని శ్రీనివాస్ తెలిపారు.అయితే ఉద్యమం అంటే కేవలం ఆందోళనలు, ధర్నాలు మాత్రమే కాకుండా జిల్లాకు అవసరమైన అభివృద్ధి ప్రణాళికను రూపొందించడం, ప్రాధాన్యతా ప్రాజెక్టులను గుర్తించడం, ప్రభుత్వ నిధులపై ప్రజా పర్యవేక్షణ, ప్రజాప్రతినిధుల బాధ్యతను ప్రశ్నించడం కూడా కావాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.అభివృద్ధికి ఐదు ప్రధాన ప్రశ్నలువికారాబాద్ జిల్లా అభివృద్ధిని అంచనా వేయాలంటే ఐదు ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం.జిల్లా ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ఎన్ని కోట్ల రూపాయల నిధులు వచ్చాయి?ఏ ప్రధాన ప్రాజెక్టులు మంజూరయ్యాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి?జిల్లా కేంద్రానికి అవసరమై

## మహబూబ్‌నగర్‌లో నేడు (అక్టోబర్ 12) తాగునీటి సరఫరాకు అంతరాయం

**మహబూబ్‌నగర్**

నగరపాలక సంస్థ పరిధిలో సోమవారం (అక్టోబర్ 12) తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. రామ్ రెడ్డి గూడెం ట్రాన్స్‌ఫార్మర్ సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ల మార్పిడి పనులతో పాటు ధర్మాపూర్ సమీపంలో 945MM BWSC పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో రామ్ రెడ్డి గూడెం నీటి శుద్ధి కేంద్రం (WTP) నుంచి జరిగే తాగునీటి సరఫరా నిలిచిపోనుందని నగర పాలక సంస్థ కమిషనర్ రామానుజుల రెడ్డి తెలిపారు.

మరమ్మతు పనులు పూర్తయిన అనంతరం అక్టోబర్ 13 నుంచి తాగునీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ముందస్తుగా నీటిని నిల్వ చేసుకోవాలని, సరఫరాలో అంతరాయానికి సహకరించాలని కమిషనర్ కోరారు.

### బాలా త్రిపురసుందరి దేవిగా

## ఏడుపాయల వనదుర్గమ్మ

- **అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్ నగేష్**

**(వుదయం ప్రతినిధి) పాపన్నపేట, అక్టోబర్ :11**



తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల శ్రీ వనదుర్గా భవానీ మాత దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు .అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని స్థానిక గోకుల్ షెడ్‌లో ప్రతిష్ఠించి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పురవీధుల గుండా సాగిన అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శరన్నవరాత్రుల తొలిరోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రెండో రోజైన సోమవారం అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వీరేశం, ఆలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శివాజీ మత నాయకుడు కాదు.. ప్రజా నాయకుడు!

- మహనీయుల చరిత్రను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి, అక్టోబర్ 11:వు దయం**

ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఒక మతానికి పరిమితం చేయడం సరి కాదని, ఆయన ప్రజల సంక్షేమం, రాజ్య భద్రతకు ప్రాధాన్యమిచ్చిన గొప్ప ప్రజా నాయకుడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. మహనీయుల చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించకూడదని హితవు పలికారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**రాజకీయ లబ్ధి కోసమే చరిత్ర వక్రీకరణ**

ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటోందని జగ్గారెడ్డి ఆరోపించారు. శివాజీని ఒక మతానికి చెందిన నాయకుడిగా చిత్రీకరించడం సరికాదన్నారు. ఆయన పాలనలో ముస్లింలు సైతం ఉన్నతాధికారులుగా పనిచేశారని గుర్తుచేశారు. దౌలత్ ఖాన్, ముల్లా హైదర్ వంటి ముస్లిం అధికారులు శివాజీ పాలనలో కీలక బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు.

**ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యం**

ఛత్రపతి శివాజీకి కులమతాల కంటే తన రాజ్యంలోని ప్రజల సంక్షేమం, భద్రతే ముఖ్యమని జగ్గారెడ్డి అన్నారు. ముస్లిం పాలకులతో జరిగిన యుద్ధాలను మతపరమైన ఘర్షణలుగా చిత్రీకరించడం సరికాదని వ్యాఖ్యానించారు. రాజ్యాల మధ్య జరిగిన పోరాటాలకు మతం రంగు పులమడం ద్వారా చరిత్రను తప్పుదోవ పట్టించకూడదన్నారు. యువత చరిత్రను అధ్యయనం చేయాలి ఛత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప వీరుడని, ఆయన ధైర్యసాహసాలు, పాలనా దక్షత, ప్రజల పట్ల చూపిన నిబద్ధతను నేటి యువత తెలుసుకోవాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మహనీయుల చరిత్ర నుంచి స్ఫూర్తి పొందాలని, వారి పేర్లను స్వార్థ రాజకీయాల కోసం ఉపయోగించుకోవద్దని సూచించారు.

## 17 ఏళ్లకే వైద్య విద్యలోకి అడుగు

- తొలి ప్రయత్నం లోనే నిగరీస్ ఘన విజయం

**నారాయణపేట టౌన్ అక్టోబర్11 (వుదయం ప్రతినిధి)**

చిన్న వయసులోనే వైద్య విద్యలో ప్రవేశం పొందుతూ తొలి ప్రయత్నంలోనే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో అర్హత సాధించి నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సంపాదించిన నిగరీష్‌ను జిల్లా గ్రామీణ వైద్య సేవకుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హుస్సేన్ పాషా, నిషత్ హుస్సేన్ దంపతుల కుమారుడైన నిగరీష్ సాధించిన విజయంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ



అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ రావు మాట్లాడుతూ తొలి ప్రయత్నంలోనే నీట్‌లో అర్హత సాధించి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందడం ఎంతో సంతోషకరమని అన్నారు. చిన్న వయసులోనే వైద్య విద్యలో ప్రవేశం పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. నిగరీష్ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఎండీ ఖాసీం మాట్లాడుతూ చిన్న వయసులోనే ఎంబీబీఎస్ సీటు సాధించడం నిగరీష్ కుటుంబానికి గర్వకారణమని అన్నారు. పట్టుదల, కృషితో లక్ష్యాన్ని చేరుకున్న నిగరీష్ భవిష్యత్తులో వైద్య రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ సమాజానికి సేవ చేయాలని సూచించారు.అనంతరం నిగరీష్‌ను సంఘం ప్రతినిధులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జమీర్ పాషా, చింతలయ్య, వెంకట రాములు, సతీష్, సుధాకర్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొని నిగరీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆడపిల్లలపై వివక్షకు చరమగీతం పాడుదాం!

- కలలకు రెక్కలు తొడుగుదాం.. సమానత్వపు బాటలు వేద్దాం!
- బాల్య వివాహాలను నిరోధిద్దాం.. ఇందువాసిలో ఘనంగా 'అంతర్జాతీయ బాలికల దినోత్సవం'

**గట్టు అక్టోబర్ 11 (వుదయం బ్యూరో)**

ఆడపిల్లలపై సాగుతున్న సామాజిక వివక్షను రూపుమాపాలని, వారి భవిష్యత్తుకు శాపంగా మారిన బాల్య వివాహాలను కఠినంగా అడ్డుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్యం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించినప్పుడే ఏ సమాజమైనా ప్రగతి పథంలో పయనిస్తుందని స్పష్టం చేశారు. గట్టు మండల పరిధిలోని ఇందువాసి గ్రామంలో 'అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని' పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. బాలికల అభ్యున్నతి, సాధికారతకు కుటుంబ సభ్యులతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని ఈ సందర్భంగా కోరారు. వివక్షకు స్వస్తి.. సమానత్వానికి శ్రీకారం! ఆడపిల్లల పట్ల చూపుతున్న పక్షపాత వైఖరిని వీడి, అన్ని రంగాల్లో వారికి ప్రోత్సాహం అందించాల్సిన అవసరాన్ని వక్తలు నొక్కిచెప్పారు. నాణ్యమైన విద్యే ఆయుధం: ఆడపిల్లలకు ఉన్నత విద్యను అందించడం ద్వారా వారిలోని ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి. లక్ష్యాల దిశగా అడుగులు: తమ హక్కులపై అవగాహన పెంచుకుంటూ, సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలికలకు సూచించారు. అవకాశాల నిరాకరణ - అభివృద్ధికి అడ్డంకి: మహిళా శక్తులకు అవకాశాలు నిరాకరించడం సమాజ పురోగతికే పెద్ద అడ్డంకిగా మారుతుందని పేర్కొన్నారు. బాల్య వివాహాలు' సామాజిక రుగ్మత.. అడ్డుకోవడమే శ్రేయస్కరం! బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తును దెబ్బతీసే బాల్య వివాహాల ఆచారాన్ని పూర్తిగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. ఆచారాల పేరిట



చదువును ఆపొద్దు: ఆడపిల్లలను చదువుకు దూరం చేసే మూఢనమ్మకాలు, వివక్షాపూరిత ధోరణులను పూర్తిగా విడనాడాలి.తల్లిదండ్రుల ప్రోత్సాహం: ప్రతి బాలిక తన కలలను సాకారం చేసుకునేలా కుటుంబ వాతావరణం, ప్రోత్సాహం లభించాలి.గ్రామస్థుల బాధ్యత: గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాల ప్రయత్నాలు జరిగితే గ్రామస్థులు సామాజిక బాధ్యతగా స్పందించి అడ్డుకోవాలి. నిరంతర చైతన్యం: బాలికల హక్కుల పరిరక్షణ అనేది ఒక రోజు వేడుకకే పరిమితం కాకుండా నిరంతర సామాజిక బాధ్యతగా కొనసాగాలి. ఆడపిల్ల ఎదిగితేనే.. సమాజానికి ప్రగతి! బాలికలకు గౌరవం, భద్రత, సమాన అవకాశాలు లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు. ప్రతి కుటుంబం ఆడపిల్ల ఎదుగుదలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమం ముగింపులో బాలికలకు తీపి పదార్థాలు పంపిణీ చేసి, అంతర్జాతీయ బాలికల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



## గొర్లఖాన్ దొడ్డిలో ఆధ్యాత్మిక హోరు.. అమ్మవారికి నీరాజనం!

- రెండోసారి దుర్గమ్మ ప్రతిష్ఠా మహోత్సవం.. ఐకమత్యంతో సరికొత్త చరిత్ర
- తొలిరోజు బాలా త్రిపుర సుందరిగా దివ్యదర్శనం.. మార్మోగిన ఆధ్యాత్మిక రవాలు

**గట్టు, అక్టోబర్ 11 (వుదయం కరస్పాండెంట్ )**

శరన్నవరాత్రుల వేళ గట్టు మండలం గొర్లఖాన్ దొడ్డి గ్రామం భక్తి పారవశ్యంలో మునిగితేలుతోంది! ఊరంతా ఆధ్యాత్మిక హోరుతో మార్మోగుతుండగా.. దుర్గమ్మ తల్లి కొలువుదీరిన వేళ భక్తిభావం అంబరాన్నం టింది. గ్రామ పెద్దలు, యువకుల సమష్టి కృషితో ప్రగాఢమైన భక్తిశ్రద్ధల నడుమ అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాన్ని రెండోసారి అత్యంత ఘనంగా నిర్వహించి ఊరి ఐకమత్యాన్ని చాటిచెప్పారు.బాలా త్రిపుర సుందరిగా అభయప్రదానం.. ఉత్సవాల తొలిరోజైన ఆదివారం జగన్మాత బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు కన్నులపండువగా దివ్యదర్శనమిచ్చారు.

వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి విశేష పూజలు, దివ్యాభిషేకాలు గావించారు. మాతృమూర్తికి కదంబం, రవ్వ కేసరిని ప్రసాదంగా నివేదించి, కృపాకటాక్షాల కోసం భక్తులు ప్రార్థించారు. ఐకమత్యానికి సజీవ సాక్ష్యంగా వేడుకలు.. కులమతాలకు అతీతంగా ఊరంతా ఒక్కటై, మహిళలుయువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహోత్సవాన్ని విజయవంతం చేస్తున్నారు. రెండోసారి అమ్మవారి ప్రతిష్ఠను ఇంత అంగరంగ వైభవంగా నిర్వహించడం ప్రాంతంలో చర్చనీయాం శంగా మారింది. గ్రామ సుభిక్షం, ప్రగతిని కాంక్షిస్తూ సాగుతున్న ఈ నవరాత్రి ఉత్సవాలు గొర్లఖాన్ దొడ్డి ఐకమత్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## శ్రీ బాల త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం



**సదాశివపేట అక్టోబర్ 11 (వు ద మం):**

సదాశివపేట వాసవి ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రులు సదాశివపేట: స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నాడు అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి దివ్య అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విశేష కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి శాస్త్రోక్తంగా మహా హారతి సమర్పించి, అనంతరం విచ్చేసిన భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా ప్రసాద వితరణ (అన్నదానం) చేపట్టారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది.

## వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు



- రాజ రాజేశ్వరి అలంకరణలో అమ్మవారి దర్శనం

**వెల్దండ అక్టోబర్ 11 (వు దయం )**

మండల కేంద్రంలో ఆదివారం వైభవంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి బుధవార్ పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో మరియు పాండురంగ నాయక దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ యన్నం భూపతిరెడ్డి జయమ్మ దంపతులు నిర్వహించిన పూజా కార్యక్రమానికి సీఐ రఘువీర్ రెడ్డి ,సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్,

జియాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ మండల పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్ జిల్లా కార్యదర్శిలు మోతిలాల్ నాయక్ శంకర్ నాయక్ . పర్వత్ రెడ్డి రామచంద్రా రెడ్డి వెంకటయ్య మల్లయ్య కృష్ణా ముదిరాజ్ వెంకటేష్ తోపాటు తదితరులు ఉన్నారు

## విధి నిర్వహణలో నిజాయితీ చాటుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు

**నారాయణపేట అక్టోబర్11(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పోలీస్ కోచింగ్ ఎంట్రెన్స్ పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన ఓ అభ్యర్థి నగదు రోడ్డుపై పడిపోగా, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది ఆ నగదును బాధ్యతాయుతంగా సంబంధిత అభ్యర్థికి తిరిగి అందించి నిజాయితీని చాటుకున్నారు.

ఉచిత పోలీస్ కోచింగ్ ఎంట్రెన్స్ పరీక్ష సందర్భంగా కళాశాల గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ధన్వాడ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులుకు రోడ్డుపై పడిపోయిన నగదు కనిపించింది. దీంతో ఆయన ఆ నగదును భద్ర



పరిచి, స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లుకు అప్పగించారు. అనంతరం ఎస్సై వెంకటేశ్వర్లు పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులను విచారించి, కృష్ణ మండలం కున్సి గ్రామానికి చెందిన మహేష్ అనే అభ్యర్థి పరీక్షకు హాజరయ్యే హడావుడిలో తన నగదు రోడ్డుపై పడిపోయినట్లు గుర్తించారు.విచారణ అనంతరం ఆ నగదు 1450 రూపాయలు మహేష్‌దేనని నిర్ధారించుకుని, అతనికి తిరిగి అందజేశారు. తన నగదును భద్రంగా తిరిగి అందించిన పోలీసులకి మహేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల ఆస్తి, సొమ్ము పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నిజాయితీని చాటుకున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, ఎస్సై వెంకటేశ్వర్లును పలువురు అభినందించారు. పోలీస్ శాఖలో విధి నిర్వహణతో పాటు ప్రజల పట్ల బాధ్యత,

నిజాయితీ, మానవీయ విలువలకు ప్రాధాన్యత ఉంటుందని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

## జర్నలిస్టుల సమస్యల కోసం ప్రెస్ క్లబ్ కార్యాచరణ ప్రణాళిక



**హైదరాబాద్, అక్టోబర్ 11:**

జర్నలిస్టులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమాజిగూడ లో ఆదివారం నాడు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఎస్. విజయకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రెస్ క్లబ్ సీనియర్ జర్నలిస్టులు, సభ్యులు హాజరయ్యారు. ఏడాది కాలంలో మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యులకు సర్వసభ్య సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ప్రెస్ క్లబ్ స్థలం లీజు వెంటనే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రెస్ క్లబ్ ఏజీఎం ఏకగ్రీవంగా తీర్మానించింది.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని దీనికోసం అన్ని జర్నలిస్టు సంఘాలను, యూనియన్లను కలుపుకొని కార్యాచరణ ప్రణాళిక అమలు చేసేందుకు కార్యవర్గం తీర్మానం ఆమోదించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, వయోధిక పాత్రికేయులకు పెన్షన్లను ఇవ్వాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ప్రెస్ క్లబ్ ఏజీఎం తీర్మానించింది. ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ.రాజేష్, అరుణ అత్తలూరి, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్ , వర్దిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు ముత్యాల సత్తిబాబు, ఎం. రమాదేవి, రచన ముదుంబై, వనం. నాగరాజు, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, అమిత్ బట్టు, అశోక్ దయ్యాల, రాజేశ్వరి కల్యాణం, శంకర్ శిగ సర్వసభ సమావేశంలో పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టులు దేవులపల్లి అమర్, ఆర్ .శైలేష్ రెడ్డి, దిలీప్ రెడ్డి, రవి కాంత్ రెడ్డి సహా యూసుఫ్ బాబు తదితరులు హాజరయ్యారు. మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యుడి కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం తక్షణం అందజేయాలని ప్రెస్ క్లబ్ సర్వసభ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు నాయకులు దేవులపల్లి అమర్ ను ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి శాలువతో సత్కరించింది.

## చంద్రపూరి కాలనీ వాసులంతా సుఖశాంతులతో మెలగాలి



. చంద్రపూరి కమిటీ హాల్ వద్ద బతుకమ్మ ఆటలాడుతున్న దృశ్యం

- చంద్రపూరి మహిళ కమిటీ సభ్యులు హనుమంతు సువర్ణ

**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 11 (వుదయం ) :**

చంద్రపూరి కాలనీ వాసులంతా సుఖశాంతులతో మెలగాలని చంద్రపూరి కాలనీ కమిటీ సభ్యులు హనుమంతు సువర్ణ ,వెంకటమ్మ ,పద్మ, సుష్మిత అన్నారు.

ఎంగిలి పువ్వు బతుకమ్మ సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని చంద్రపూరి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంగిలి పువ్వు బతుకమ్మ సందర్భంగా కాలనీ వాసులంతా బతుకమ్మ పండుగను కాలనీ కమిటీ హాల్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలంతా బతుకమ్మను పెట్టి ఆటపాటలతో ఆలరించారు.ఈ కార్యక్రమంలో పద్మ,విజయ, శ్రీలత, సునితారెడ్డి, తనూజ, మంగమ్మ, రమాదేవి, జయ, పద్మ, యశోద, కల్పన, ప్రమీల, మమత తదితరులు పాల్గొన్నారు.





## విద్యాభివృద్ధికి చేయూత

- సేవాభావానికి ప్రతీక! శ్రీ సరస్వతీ శిశు మందిర్‌కు రూ.1,11,111 విరాళం

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 11, (వుదయం ప్రతినిధి):**

విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తూ నాగర్‌కర్నూల్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో తరగతి గది నిర్మాణం కోసం రూ.1,11,111 (ఒక లక్షా పదకొండు వేల నూట పదకొండు రూపాయలు) విరాళంగా అందజేశారు.

ఈ విరాళాన్ని ఆర్వ్య (AARVYA) చేతుల మీదుగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ అధ్యక్షుడు వాసా రమేష్ బాబుకు కొట్ర హేమారాణి-బాలాజీ దంపతులు అందించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలనే లక్ష్యంతో తరగతి గది నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం విశేషం. విద్యారంగ అభివృద్ధికి దాతలు అందించే ఇటువంటి సహకారం విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడంతోపాటు సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. "విద్యకు చేసే సహాయం.. భావితరాల భవిష్యత్తుకు పెట్టుబడి" అనే సందేశాన్ని ఈ విరాళం చాటి చెబుతోంది.

ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి రవీంద్ర చారి,కోశాధికారి శేషీ రెడ్డి,ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి. చంద్ర శేఖర్ ,పాఠశాల ప్రధానోపాధ్యయురాలు ప్రసన్నలక్ష్మీ, కొట్ర అక్షయ్, కొట్ర సాయి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాలు





- బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం

**నాగర్ కర్నూల్, అక్టోబరు 11 (వుదయం బ్యూరో):**

జిల్లా కేంద్రంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఉత్సవాల తొలిరోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరి దేవిగా ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన, గణపతి పూజ, పుణ్యాహవచనం చేపట్టారు.అంతకుముందు మార్కెట్ యార్డులోని శివాలయం నుంచి అమ్మవారి కలశం, ఉత్సవ విగ్రహంతో పూణె బ్యాండ్ వాయిద్యాలు, కోలాటాలు, భజనల నడుమ శోభాయాత్ర ఘనంగా ప్రారంభమై ప్రధాన వీధుల మీదుగా ఆలయానికి చేరుకుంది. శోభాయాత్రలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయానికి చేరుకున్న అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాల వితరణ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో మార్మోగాయి. భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు.సాయంత్రం లలిత సహస్ర నామ పారాయణము, కుంకుమార్చన, బిల్వార్చన హారతి పల్లకి సేవ డోలోత్సవం అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు

ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలో భాగంగా పోలోజు సత్యం సాయి లహరి ఆర్ట్స్ అకాడమీ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం అల్పాహారం వితరణ చేశారుఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రతిరోజూ వివిధ అవతారాలలో అలంకరణలు, ప్రత్యేక పూజలు, లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు ని



ర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు చండీ సబ్ స్టేషన్ వద్ద ధర్నా....

- భారీగా తరలిరండి రైతులారా....
- బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజా రమణా గౌడ్...

**వుదయం న్యూస్ శివ్వంపేట అక్టోబర్ 11...**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చెంది సబ్ స్టేషన్ వద్ద నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి పిలుపుమేరకు వివిధ గ్రామాల నుంచి రైతులు భారీగా తరలి రావలసిందిగా మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ పిలుపునిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కెసిఆర్ ఉన్నప్పుడు 24 గంటల కరెంటు ఉండేది. కానీ నేడు కరెంటు ఉంటే ఒట్టు పంటలన్నీ ఎండిపోతూ రైతులు లబోదిబోమంటున్నారు ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదు. నాడు కరెంటు పోతే ఒట్టు నేడు కరెంటు ఉంటే ఒట్టు



ఇలా ఉంది పరిస్థితి ఇది ఇలాగే ఉంటే రైతుకు కష్టాలు తప్ప లాభాలు ఉండవని ఇకనైనా మేలుకొని ప్రభుత్వం వారు రైతులకు నాణ్యమైన కరెంటు 12 గంటలైనా ఇవ్వాలని నేడు 11 గంటలకు చండి సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించుటకై నర్సాపూర్ శాసనసభ్యురాలు వాటి సునీత లక్ష్మారెడ్డి పిలుపుమేరకు వివిధ గ్రామాల నుండి రైతులు భారీగా వచ్చి ధర్నాను విజయవంతం చేయవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు.

30 ఏళ్లు దాటిన తరువాత

# కండరాల నిర్మాణం సాధ్యం కాదా..

ఇరవై ఏళ్ల వయసులో కండరాలను పెంచుకోవడం సులభమా? ముప్పై ఏళ్ల వయసులోనూ అదే స్థాయిలో కండరాలను అభివృద్ధి చేసుకోవచ్చా? బరువులతో వ్యాయామం ప్రారంభించే చాలామందికి ఈ సందేహాలు ఎదురవుతుంటాయి. వయసు పెరిగే కొద్దీ శరీరం కోలుకునే వేగం, కొన్ని శారీరక ప్రక్రియల్లో మార్పులు వస్తాయి. అయితే, ముప్పై ఏళ్లు దాటగానే కండరాలను పెంచుకోవడం కష్టమైపోతుందని భావించాల్సిన అవసరం లేదు. సరైన వ్యాయామం, తగినంత ప్రోటీన్ తీసుకోవడం, నాణ్యమైన నిద్ర, శరీరానికి తగిన విశ్రాంతి ఇవ్వడం వంటి అలవాట్లతో ముప్పై ఏళ్ల వయసులోనూ కండరాలను బలంగా, దృఢంగా తీర్చిదిద్దుకోవచ్చు. ఇరవై ఏళ్ల వయసులో హార్మోన్ల స్థాయిలు, శరీరం వ్యాయామానికి అలవాటు పడే సామర్థ్యం, కోలుకునే వేగం అనుకూలంగా ఉంటాయి. దీంతో కొందరు కఠినమైన వ్యాయామాలను సులభంగా తట్టుకుని త్వరగా కోలుకుంటారు. అయితే, ఇరవై ఏళ్ల వయసులో ఉన్న ప్రతి ఒక్కరికీ కండరాలు వేగంగా పెరుగుతాయని చెప్పలేం. వ్యాయామంలో క్రమబద్ధత, ఆహారం, నిద్ర, ఒత్తిడి, జన్యుపరమైన అంశాలు కూడా కండరాల పెరుగుదలపై ప్రభావం చూపుతాయి. ఇరవై ఏళ్ల వయసులో సరిగ్గా వ్యాయామం చేయని వారికంటే, ముప్పై ఏళ్ల వయసులో క్రమబద్ధమైన వ్యాయామం ప్రారంభించిన వారు మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ముప్పై ఏళ్లు దాటినంత మాత్రాన కండరాలను పెంచుకునే సామర్థ్యం తగ్గిపోదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వయసులో కొందరికి వ్యాయామం తర్వాత శరీరం కోలుకోవడానికి కొంత ఎక్కువ సమయం పడుతుంది. ముఖ్యంగా అధిక తీవ్రతతో వ్యాయామం చేయడం, తగినంత నిద్ర లేకపోవడం, సరైన ఆహారం తీసుకోకపోవడం వంటి పరిస్థితుల్లో ఈ మార్పు ఎక్కువగా కనిపిస్తుంది. ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ బాధ్యతలు, ఒత్తిడి కారణంగా విశ్రాంతికి సమయం తగ్గడం కూడా దీనికి కారణం అవుతాయి. ఇరవై ఏళ్ల వారైనా, ముప్పై ఏళ్ల వారైనా కండరాలు అభివృద్ధి చెందాలంటే వాటికి తగిన వ్యాయామ ప్రేరణ అవసరం. ఇందుకోసం క్రమంగా బరువులు పెంచడం, పునరావృతాల సంఖ్యను పెంచడం, వ్యాయామ సెట్లు లేదా మొత్తం వ్యాయామ పరిమాణాన్ని అవసరానికి అనుగుణంగా పెంచడం వంటి పద్ధతులను అనుసరించాలి. అయితే, బరువులు పెంచే సమయంలో సరైన పద్ధతిలో వ్యాయామం చేయడం ముఖ్యం. వ్యాయామశాలలో ఎక్కువ సమయం గడిపినంత మాత్రాన కండరాలు ఎక్కువగా పెరుగుతాయని భావించకూడదు. కండరాలకు తగిన శ్రమ కల్పించడంతోపాటు, అవి కోలుకునేందుకు అవసరమైన సమయాన్ని కూడా ఇవ్వాలి.

కండరాల పెరుగుదలకు వ్యాయామంతోపాటు ఆహారం కూడా కీలకం. వ్యాయామం కండరాల అభివృద్ధికి ప్రేరణనిస్తే, ఆహారంలోని పోషకాలు వాటి మరమ్మత్తు, పెరుగుదలకు అవసరమైన పదార్థాలను అందిస్తాయి. అందువల్ల రోజువారీ ఆహారంలో తగినంత ప్రోటీన్ ఉండేలా చూసుకోవాలి. గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, చికెన్, తక్కువ కొవ్వు కలిగిన మాంసం, సోయా, బీన్స్, పప్పుధాన్యాలు వంటి వాటి ద్వారా ప్రోటీన్ పొందవచ్చు. ప్రోటీన్‌తోపాటు రోజంతా తీసుకునే మొత్తం కేలరీలు, ఆహార నాణ్యత కూడా ముఖ్యమే. కండరాలను పెంచుకోవాలనే లక్ష్యానికి అనుగుణంగా సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి. అలాగే, నిద్రకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. నిరంతరం సరిపడా నిద్ర లేకపోతే శరీరం కోలుకునే ప్రక్రియ, శక్తి స్థాయిలు, వ్యాయామ సామర్థ్యం దెబ్బతింటాయి. వారంలో ఆరు రోజులు వ్యాయామం చేసినా, సరిగా నిద్రపోని వ్యక్తికి ఆశించిన ఫలితాలు రావు. తగినంత విశ్రాంతితో కూడిన వ్యాయామ ప్రణాళికను పాటించే వ్యక్తి మెరుగైన పురోగతి సాధిస్తారు. ముఖ్యంగా ముప్పై ఏళ్ల వయసులో ఉద్యోగం, కుటుంబ బాధ్యతల మధ్య నిద్రకు, విశ్రాంతికి సమయం కేటాయించడం అవసరం. కండరాల పెరుగుదల అనేది కేవలం వ్యాయామశాలకు వెళ్లడంపైనే ఆధారపడదు. అధిక ఒత్తిడి, సరైన నిద్ర లేకపోవడం, క్రమం తప్పిన భోజనం, వ్యాయామంలో స్థిరత్వం లేకపోవడం వంటివి కూడా ఫలితాలను ప్రభావితం చేస్తాయి. అందుకే ఒకే వయసులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు వేర్వేరు ఫలితాలు వస్తాయి. వ్యాయామం, ఆహారం, నిద్ర, ఒత్తిడి నియంత్రణపై శ్రద్ధ పెట్టే వ్యక్తి ముప్పై ఏళ్ల వయసులో వ్యాయామం ప్రారంభించినప్పటికీ మంచి ఫలితాలు సాధించవచ్చు. గతంలో తీవ్రమైన వ్యాయామం చేయని వారు కూడా ముప్పై లేదా ముప్పై రెండేళ్ల వయసులో సరైన ప్రణాళికతో బరువులతో వ్యాయామం ప్రారంభిస్తే కండరాల బలం, పరిమాణంలో గణనీయమైన మార్పులను సాధించవచ్చు. దీనికి వయసు కంటే క్రమబద్ధత ఎంతో ముఖ్యం. సరైన వ్యాయామ ప్రణాళికను అనుసరించడం, క్రమంగా వ్యాయామ తీవ్రతను పెంచడం, తగినంత ప్రోటీన్ తీసుకోవడం, నాణ్యమైన నిద్ర పొందడం, కండరాలకు విశ్రాంతి ఇవ్వడం, ఒత్తిడిని నియంత్రించడం, దీర్ఘకాలం పాటు వ్యాయామాన్ని కొనసాగించడం ముఖ్యమైన అంశాలు. ముప్పై ఏళ్ల వయసులో వ్యాయామం చేసే వారు తమ శరీరం స్పందించే తీరును బట్టి వ్యాయామ పరిమాణాన్ని, విశ్రాంతి సమయాన్ని సర్దుబాటు చేసుకోవాలి. అధిక పరిమాణంలో వ్యాయామం చేయడం కంటే అవసరానికి తగిన శిక్షణను ఎంచుకోవడం మంచిది. కఠినమైన వ్యాయామాల మధ్య తగినంత విశ్రాంతి తీసుకోవాలి. కండరాల నొప్పి ఎక్కువకాలం కొనసాగడం లేదా వ్యాయామ సామర్థ్యం తగ్గిపోవడం వంటి లక్షణాలను గమనించాలి. అయితే, ముప్పై ఏళ్లు వచ్చాయని బరువులు ఎత్తడం మానేయాల్సిన అవసరం లేదు.



# చక్కని ఆరోగ్యం

## మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే 5 పోషక లోపాలు..

మానసిక ఆరోగ్యంపై ఒత్తిడి, నిద్ర, హార్మోన్లు, పోషకాహారం వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. తరచూ మూడ్‌లో మార్పులు, ఏకాగ్రత లోపించడం లేదా నిద్రకు సంబంధించిన సమస్యలు కనిపిస్తే, వాటి వెనుక ఏదైనా ఆరోగ్య సమస్య ఉండే అవకాశం ఉంటుంది. అందువల్ల ఎక్కువ కాలం కొనసాగే లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైనప్పుడు వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.



పోషకాహార నిపుణురాలు దీపశిఖా జైన్ పోషకాల లోపాలు, మానసిక ఆరోగ్యం మధ్య ఉండే సంబంధాన్ని వివరించారు. కొన్ని విటమిన్లు, ఖనిజాల స్థాయిలు తక్కువగా ఉండడం వల్ల ఆందోళన, తక్కువ మూడ్, బ్రెయిన్ ఫాగ్, నిద్రలేమి, చిరాకు వంటి లక్షణాలతో సంబంధం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. తరచూ ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయవద్దని దీపశిఖా జైన్ సూచించారు. అవసరమైన పోషకాల స్థాయిలను పరీక్షించుకుని, లోపాలు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని సరిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఆమె వివరించిన లక్షణాల్లో మొదటిది ఆందోళన. మెగ్నీషియం, విటమిన్ బి6 స్థాయిలు తక్కువగా ఉండడం ఆందోళన భావనలతో సంబంధం కలిగి ఉంటుందని దీపశిఖా జైన్ చెప్పారు.

ఆందోళనకు అనేక కారణాలు ఉంటాయని, పోషకాల లోపం వాటిలో ఒక కారణం మాత్రమే అవుతుందని గుర్తుంచుకోవాలి. రెండోది డిప్రెషన్. డిప్రెషన్ గురించి మాట్లాడుతూ విటమిన్ డి3, విటమిన్ బి12 లోపాలతో పాటు పేగుల్లోని సమతుల్యతలో మార్పులను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. మూడోది బ్రెయిన్ ఫాగ్. ఏకాగ్రత కుదరకపోవడం, స్పష్టంగా ఆలోచించడంలో ఇబ్బంది పడడం వంటి లక్షణాలను బ్రెయిన్ ఫాగ్‌గా పేర్కొంటారు. తక్కువ ఈస్ట్రోజెన్ స్థాయిలు, విటమిన్ బి12 లోపం, ఒమెగా 3 తక్కువగా తీసుకోవడం వంటి అంశాలు ఈ లక్షణాలతో సంబంధం కలిగి ఉంటాయని పోషకాహార నిపుణురాలు తెలిపారు. నాలుగోది నిద్రలేమి. నిద్రకు సంబంధించిన సమస్యల విషయంలో మెగ్నీషియం, మెలటోనిన్, విటమిన్ బి12 స్థాయిలతో సంబంధం ఉండే అవకాశం ఉందని ఆమె వివరించారు. ఐదోది తరచూ చిరాకు రావడం. తరచూ చిరాకు లేదా మూడ్‌లో మార్పులు కనిపించడానికి తక్కువ ఈస్ట్రోజెన్ స్థాయిలు, విటమిన్ బి12 లోపం, మెగ్నీషియం స్థాయిలు వంటి అంశాలు సంబంధం కలిగి ఉంటాయని దీపశిఖా జైన్ పేర్కొన్నారు.

## నోటి ఆరోగ్యం సరిగ్గా లేకపోతే నోటి క్యాన్సర్ వస్తుందా..

అయితే

నోటి ఆరోగ్యం అంటే కేవలం దంతాలు శుభ్రంగా ఉండడం, నోటి దుర్వాసన రాకుండా చూసుకోవడం మాత్రమే కాదు. ఇది శరీర మొత్తం ఆరోగ్యంతోనూ సంబంధం కలిగి ఉంటుంది. చిగుళ్ల వ్యాధులు, దీర్ఘకాలిక వాపు, నోటిలో ఉండే సూక్ష్మజీవుల్లో మార్పులు క్యాన్సర్‌తో సహా పలు వ్యాధులతో సంబంధం కలిగి ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే నోటి పరిశుభ్రత సరిగా లేనంత మాత్రాన క్యాన్సర్ వస్తుందని భావించకూడదు. నోటి ఆరోగ్య సమస్యలకు, నోటి క్యాన్సర్‌కు మధ్య సంబంధం ఉన్నట్లు కొన్ని అధ్యయనాలు సూచించినప్పటికీ, ఈ రెండింటి మధ్య ప్రత్యక్ష కారణ సంబంధాన్ని నిర్ధారించడానికి మరింత పరిశోధన అవసరం. దేశంలో పొగాకు వినియోగం, మద్యం సేవించడం, వక్క లేదా సుపారీ నమలడం వంటి అలవాట్లు నోటి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే ముఖ్యమైన కారణాలుగా ఉన్నాయి. పుణెలో 187 మంది నోటి క్యాన్సర్ బాధితులు, 240 మంది ఇతర వ్యక్తులతో నిర్వహించిన అధ్యయనంలో నోటి పరిశుభ్రత సరిగా లేని వారిలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా పొగాకు నమిలే అలవాటు ఉన్నవారిలో ఈ సంబంధం మరింత స్పష్టంగా కనిపించింది. 2026లో ప్రచురితమైన 15 అధ్యయనాల సమీక్షలోనూ దంతాలు సరిగా తోముకోకపోవడం, దంత వైద్యులను తక్కువగా సంప్రదించడం నోటి క్యాన్సర్ ప్రమాదంతో సంబంధం కలిగి ఉన్నట్లు వెల్లడైంది. అయితే పొగాకు, మద్యం, ఆహారపు అలవాట్లు, ఆర్థిక పరిస్థితులు వంటి ఇతర అంశాలు కూడా ఈ ఫలితాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల నోటి పరిశుభ్రత లోపమే క్యాన్సర్‌కు ప్రత్యక్ష కారణమని నిర్ధారించలేరు. మరోవైపు, దంతాలపై పేరుకునే మలినాల్లోని బ్యాక్టీరియా వల్ల చిగుళ్ల వాపు ఏర్పడుతుంది. ఈ సమస్య తీవ్రమైతే దంతాలకు ఆధారంగా ఉండే కణజాలం దెబ్బతినే పీరియడొంటైటిస్ అనే వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. దీర్ఘకాలిక వాపు, రోగనిరోధక వ్యవస్థలో మార్పులు, నోటిలోని సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతినడం వంటి అంశాలు క్యాన్సర్ సంబంధిత ప్రక్రియలతో ముడిపడి ఉన్నాయా అనే విషయంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. చిగుళ్ల వ్యాధులకు శరీరంలోని ఇతర భాగాల్లో వచ్చే క్యాన్సర్లకు మధ్య సంబంధం ఉందా అనే అంశంపైనా శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. కొన్ని పరిశీలనాత్మక అధ్యయనాల్లో చిగుళ్ల వ్యాధులు ఉన్నవారిలో పెద్దపేగు, క్లోమం, ఊపిరితిత్తులు, జీర్ణవ్యవస్థ పైభాగానికి సంబంధించిన క్యాన్సర్లతో సంబంధం ఉన్నట్లు వెల్లడైంది.



## ఎముకలే కాదు, గుండె ఆరోగ్యాన్ని సైతం కాపాడే విటమిన్ డి..

విటమిన్ డి శరీరంలో ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా, గుండె ఆరోగ్యానికి సంబంధించిన కొన్ని కణ ప్రక్రియల్లోనూ కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. శరీరంలో ఈ విటమిన్ లోపిస్తే గుండె కణాల్లో ఒత్తిడి పెరిగి, సహజంగా కణాలను రక్షించే యాంటీఆక్సిడెంట్ వ్యవస్థ బలహీనపడుతుందని హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ శాస్త్రవేత్తలు నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ పరిశోధన అంతర్జాతీయ జర్నల్ స్టెరాయిడ్స్‌లో ప్రచురితమైంది. అయితే ఈ ఫలితాలు ప్రస్తుతం జంతువులు, కణాలపై నిర్వహించిన ప్రయోగాల ఆధారంగా వచ్చినవే కావడంతో, మనుషుల్లోనూ ఇదే ప్రభావం ఉంటుందో లేదో నిర్ధారించేందుకు మరిన్ని అధ్యయనాలు అవసరమని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. ఈ అధ్యయనంలో భాగంగా ఎలుకలకు వివిధ స్థాయిల్లో విటమిన్ డి అందించి, వాటి గుండె ఆరోగ్యంపై ప్రభావాలను పరిశీలించారు. అలాగే ఆక్సీకరణ ఒత్తిడికి గురైన ఎలుకల గుండె కణాలపై ప్రయోగాలు నిర్వహించారు. విటమిన్ డి తక్కువగా లేదా తగినంతగా అందని ఎలుకల్లో గుండె కణాలకు ఆక్సీకరణ వల్ల కలిగే నష్టం పెరిగినట్లు గుర్తించారు. కణాలను రక్షించడంలో సహాయపడే గ్లుటాథయోన్ స్థాయిలు తగ్గడంతోపాటు, కీలకమైన యాంటీఆక్సిడెంట్ ఎంజైమ్‌ల పనితీరు కూడా మందగించినట్లు తేలింది. అలాగే ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కణాలను కాపాడే ఎన్‌ఆర్ఎఫ్2 అనే రక్షణ వ్యవస్థ పనితీరు దెబ్బతిన్నట్లు పరిశోధకులు గుర్తించారు. విటమిన్ డి లోపం ఉన్న ఎలుకల గుండెలో కణాల అంతర్గత ఒత్తిడికి సంబంధించిన సంకేతాలు పెరిగినట్లు అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా ఎండోప్లాస్మిక్ రెటిక్యులమ్ ఒత్తిడి, ఆటోఫాజీ, అపోప్టోసిస్ వంటి ప్రక్రియలకు సంబంధించిన సూచికల్లో మార్పులు కనిపించాయి. అపోప్టోసిస్ అంటే కణాలు ప్రణాళికాబద్ధంగా మరణించే ప్రక్రియ. దీర్ఘకాలం పాటు విటమిన్ డి తగినంతగా అందకపోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి పెరిగి, క్రమంగా గుండె కణాలకు నష్టం కలిగించే అవకాశముందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.




## ప్రతి ఒక్కరు తరచూ చేయించుకోవాల్సిన ముఖ్యమైన వైద్య పరీక్షలు ఇవే..



రక్త పరీక్షల ద్వారా మన శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలు ఎలా ఉన్నాయి, ఐరన్ నిల్వలు సరిపోతున్నాయా, శరీరంలో వాపు సూచనలు ఉన్నాయా వంటి అనేక విషయాలను తెలుసుకోవచ్చు. అయితే, వైద్య పరీక్షల నివేదికల్లో ఉండే సంఖ్యలు, వైద్య పదాల అర్థాలు చాలామందికి సులభంగా అర్థం కావు. అందువల్ల నివేదికలోని ఏ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలో తెలుసుకోవడం ముఖ్యం. పోషకాహార నిపుణురాలు నమామి అగర్వాల్ తన సూచనల్లో భాగంగా ఐదు ముఖ్యమైన ఆరోగ్య సూచికలను వివరించారు. అవి హెచ్‌బీఏ1సీ, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, ఫెరిటిన్, ఫాస్టింగ్ ఇన్సులిన్, హోమా–ఐఆర్, హెచ్ఎస్–సీఆర్‌పీ. హెచ్‌బీఏ1సీ పరీక్ష గత మూడు నెలలుగా రక్తంలో చక్కెర స్థాయిలు సగటున ఎలా ఉన్నాయో తెలియజేస్తుంది. ఒకరోజు చేసిన పరీక్షలో వచ్చిన ఫలితాన్ని మాత్రమే కాకుండా, గత కొంతకాలంగా చక్కెర నియంత్రణ ఎలా ఉందో అంచనా వేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు సాధారణంగా కొలెస్ట్రాల్ పరీక్షలో భాగంగా ఉంటాయి. ఎల్‌డీఎల్ ఒక రకమైన కొలెస్ట్రాల్ కాగా, ట్రైగ్లిజరైడ్లు రక్తంలో ఉండే కొవ్వు పదార్థాలు. వీటి స్థాయిల ద్వారా శరీరం కొవ్వులను, అదనపు కేలరీలను ఎలా వినియోగించుకుంటుందో అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. ఫెరిటిన్ పరీక్ష శరీరంలో నిల్వ ఉన్న ఐరన్ పరిమాణం గురించి తెలియజేస్తుంది. హిమోగ్లోబిన్ స్థాయిలు సాధారణంగా ఉన్నప్పటికీ, ఫెరిటిన్ తక్కువగా ఉంటే శరీరంలో ఐరన్ నిల్వలు తగ్గినట్లు అర్థం అని భావించాలి. ఫాస్టింగ్ ఇన్సులిన్, హోమా–ఐఆర్ పరీక్షలు శరీరం ఇన్సులిన్‌ను ఎలా వినియోగించుకుంటుందో తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. వీటి ద్వారా ఇన్సులిన్ నిరోధకతను ప్రారంభ దశలో గుర్తించేందుకు వైద్యులకు సహాయపడతాయి. ఇక హెచ్ఎస్–సీఆర్‌పీ అనేది శరీరంలో వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్‌కు సంబంధించిన సూచిక. గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదాన్ని అంచనా వేయడానికి వైద్యులు ఇతర ఆరోగ్య వివరాలతోపాటు ఈ ఫలితాన్ని కూడా పరిశీలిస్తారు.

అయితే, రక్త పరీక్షల ఫలితాలను అర్థం చేసుకునేటప్పుడు కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. పరీక్షకు ముందు తీసుకున్న ఆహారం, పానీయాలు, వాడుతున్న మందులు లేదా పోషకాహార సప్లిమెంట్లు, అధిక శారీరక వ్యాయామం వంటి అంశాలు



కొన్ని పరీక్షల ఫలితాలపై ప్రభావం చూపిస్తాయి. నెలసరి సమయంలో కూడా కొన్ని పరీక్షల ఫలితాల్లో మార్పులు కనిపించే అవకాశం ఉంది. అందుకే పరీక్షకు ముందు ఉపవాసం ఉండడం లేదా కొన్ని ఆహారాలను తీసుకోకుండా ఉండడం వంటి సూచనలు ఇస్తే వాటిని తప్పనిసరిగా పాటించాలి. పరీక్షకు ఎలా సిద్ధం కావాలో వైద్యులు లేదా ఆరోగ్య నిపుణులు తెలియజేస్తారు. ఫలితాలు సాధ్యమైనంత కచ్చితంగా రావాలంటే వారి సూచనలను జాగ్రత్తగా అనుసరించాలి. వైద్య పరీక్షల నివేదికలను సరిగ్గా అర్థం చేసుకోవడం ద్వారా మన ఆరోగ్య పరిస్థితిని మరింత మెరుగ్గా తెలుసుకునే వీలు ఉంటుంది.

# మెడ సాగిందా?

అమ్మాయిలు అందంగా కనిపించాలని రకరకాల క్రీములు వాడతారు. అయితే, కొన్ని సమస్యలకు జీవనశైలి మార్పులు చేసుకోవడం తప్పనిసరి. అలాంటి వాటిల్లో మెడ కింద చర్మం సాగడం ఒకటి. వయసు పెరుగుతోందనడానికి చిహ్నంగా భావించే దీన్ని ఎలా తగ్గించుకోవాలంటే... మెడ కింద చర్మం జన్యుపరంగా అంటే... కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఉంటే, తర్వాత తరాల వారికి కూడా వచ్చే అవకాశం ఉంది. ఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల అల్ట్రా వయొలెట్ కిరణాలు చర్మంలోని కొలాజన్ ఉత్పత్తిని దెబ్బతీస్తాయి. అలానే, శరీరంలో తేమ తగ్గడం వల్ల చర్మం నిగారింపు కోల్పోయి వదులుగా మారుతుంది. ముఖం–మెడ వ్యాయామాలు: సీలింగ్ వైపు చూస్తూ ముద్దు పెడుతున్నట్లుగా పెదవులను ముందుకు సాగదీయండి. ఇది మెడ కండరాలను బిగువుగా చేయడానికి సహాయపడుతుంది. తలను నెమ్మదిగా కుడి, ఎడమ వైపులకు తిప్పడం, వృత్తాకారంలో తిప్పడం వల్ల కండరాలు దృఢంగా



సాగడాన్ని టర్కీ నెక్ అని పిలుస్తారు. ఈ సమస్య చాలామందిలో సాధారణంగా కనిపిస్తుంది. ఇది వయసుతోనే కాదు... ఇతర జీవనశైలి కారణాల వల్లా రావొచ్చు. వయసు పెరిగే కొద్దీ చర్మానికి సాగే గుణాన్ని ఇచ్చే కొలాజన్, ఎలాస్టిన్ ఉత్పత్తి తగ్గడంతో చర్మం పట్టు కోల్పోయి కిందికి సాగుతుంది. అంతేకాదు, ఎప్పుడూ తల వంచుకుని ఫోన్లు, స్క్రీన్‌లను చూడటం వల్ల మెడ కండరాలపై ఒత్తిడి పడి, చర్మం త్వరగా ముడతలు పడి సాగుతుంది.

మారతాయి. ముఖానికి రాసే మాయిశ్చరైజర్ లేదా రెటినాల్ ఆధారిత యాంటీ–ఏజింగ్ గుణాలు ఉన్నవి మెడ కింది భాగానికి కూడా రాసి పైకి మసాజ్ చేయాలి. ఎండలోకి వెళ్లేటప్పుడు తప్పకుండా సన్‌స్క్రీన్ ఉపయోగించండి.

విటమిన్ సి, ఈ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తరచూ తీసుకోవాలి. ఇవి కొలాజన్ ఉత్పత్తిని పెంచుతాయి. అలానే, రోజుకు కనీసం 8–10 గ్లాసుల నీరు తాగండి. ఇది చర్మానికి తగిన తేమను అందించి సాగే గుణం మెరుగవుతుంది. భంగిమను మార్చుకోవడం: ఫోన్ చూసేటప్పుడు స్క్రీన్‌ను కంటికి ఎదురుగా ఉంచండి. తల వంచి చూడటాన్ని తగ్గించండి.

# కేశ సంరక్షణ కోసం..!

వేప వల్ల మన చర్మానికి, జుట్టుకు ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం తెలిసిందే. అందుకే దీనిని వివిధ సౌందర్య ఉత్పత్తుల తయారీలో వాడుతుంటారు. ఈ క్రమంలో– ప్రత్యేకించి కేశ సంరక్షణలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది అంటున్నారు నిపుణులు.

వేపాకుల పొడిని తరచూ ఉపయోగిస్తూ ఉంటే తలలోని ఇన్ఫెక్షన్లు దూరమవుతాయంటున్నారు నిపుణులు. వేప నూనెను తలకు పట్టించడం వల్ల జుట్టు రాలే సమస్య తగ్గే అవకాశం ఉంటుందట. దీంతో పాటు జుట్టు చిట్లిపోవడం కూడా తగ్గుతుందంటున్నారు నిపుణులు.

కొన్ని వేపాకులను తగినన్ని నీళ్లలో వేసి మరిగించి, దీన్లో తేనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి అరగంట ఉంచి తర్వాత కడిగేయాలి. ఇది జుట్టుకు కండిషనర్‌గా పనిచేస్తుంది. బిరుసుగా ఉన్న జుట్టును మెత్తగా మార్చడమే కాకుండా చుండ్రును కూడా తొలగిస్తుందంటున్నారు నిపుణులు. కొన్ని రకాల సబ్బులు, షాంపూలు, లోషన్స్, క్రీమ్స్ వంటి వాటిలో వేప నూనెను ఉపయోగిస్తారు. దీనికి చర్మాన్ని లోపలి నుంచి



శుభ్రం చేసే గుణం ఉంటుంది. దీని వల్ల చర్మం కాంతిమంతంగా మారుతుంది అంటున్నారు నిపుణులు.

అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. వ్యక్తిగతంగా ఎవరికి వారు తమ జుట్టు తత్వానికి సరిపడతాయో లేదో పరిశీలించుకోవాలి. అవసరమైతే ఆయా పదార్థాలను వాడే ముందు సంబంధిత నిపుణులను సంప్రదించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం మంచిది.

## గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌కు అదిరే ఆరంభం: అమెజాన్

తమ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ – 2026 అత్యంత బలమైన ప్రారంభాన్ని నమోదుచేసిందని అమెజాన్ ఇండియా తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఆర్డరు చేసిన ఉత్పత్తుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా పెరగ్గా, అమ్మకాల ప్రారంభ దశలో వెబ్‌సైట్‌ను సందర్శించిన వారి సంఖ్య 44 కోట్లను అధిగమించింది. ప్రధాన నగరాల ఆవలకూ ఇ–కామర్స్ గిరాకీ విస్తరించడం, కొనుగోలుదార్లు విలాసవంత ఉత్పత్తుల వైపు మొగ్గుచూపడం దీనికి కారణం. భారత్‌లోని తొమ్మిది ప్రధాన మెట్రోపాలిటన్ ప్రాంతాల వెలుపల నుంచే 72 శాతానికి పైగా వీక్షణలు ఉన్నాయని, మొదటిసారి కొనుగోలు చేసే వారి సంఖ్య దాదాపు 100% పెరిగిందని అమెజాన్ ఒక ప్రకటనలో తెలిపింది.

# బిజినెస్

# హైదరాబాద్‌లో ఆఫీస్ స్థలాలకు పెరిగిన గిరాకీ



దేశ వ్యాప్తంగా కార్యాలయాల స్థలాల నికర అద్దె లావాదేవీలు తగ్గినప్పటికీ, హైదరాబాద్‌లో మంచి వృద్ధి నమోదైంది. 2026 జనవరి–సెప్టెంబరు వరకూ నగరంలో ఆఫీస్ స్థలాల నికర లీజింగ్ 41% పెరిగి 73 లక్షల చదరపు అడుగులకు చేరింది. గతేడాది ఇదే కాలంలో ఇది 52 లక్షల చదరపు అడుగులుగా ఉంది. మరోవైపు దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో కలిపి నికర లీజింగ్ 20% తగ్గి, 3.67 కోట్ల చ.అ.కు పరిమితమైంది. నాణ్యమైన కార్యాలయ స్థలాలకు పరిమిత సరఫరా, గతేడాది నమోదైన అధిక గణాంకాల ప్రభావం ఈ తగ్గుదలకు కారణమని స్థిరాస్తి సేవల సంస్థ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా కార్యాలయ స్థలాల నికర లీజింగ్ గతేడాది జనవరి–సెప్టెంబరు మధ్య కాలంలో 4.60 కోట్ల చ.అ.గా నమోదైంది. ఈ ఏడాది ఇదే కాలంలో నికరంగా అద్దెకు వెళ్లిన స్థలం తగ్గినా, మొత్తం అద్దె లావాదేవీలు మాత్రం పుంజుకున్నాయి. స్థూల కార్యాలయ లీజింగ్ ఏడాది ప్రాతిపదికన ఒక శాతం పెరిగి, రికార్డు స్థాయిలో 6.46 కోట్ల చ.అ.కు చేరింది.

బెంగళూరులోనూ..: దేశంలోనే అతి పెద్ద ఆఫీస్ మార్కెట్‌గా ఉన్న బెంగళూరులో లీజింగ్ 16% వృద్ధితో 1.10 కోట్ల చ.అ.కు చేరింది. అహ్మదాబాద్‌లో 81% పెరిగి 12 లక్షల చ.అ.కు చేరింది. దిల్లీ–ఎన్‌సీఆర్‌లో 48% క్షీణించి, 50 లక్షల చ.అ.కు పరిమితమైంది. చెన్నైలో 48% తగ్గి, 28 లక్షల చ.అ.కు చేరింది. ముంబయిలో 46 శాతం క్షీణించి, 41 లక్షల చ.అ., పుణెలో 39% తగ్గి, 42 లక్షల చ.అ., కోల్‌కతాలో 12 శాతం క్షీణించి, 11 లక్షల చ. అడుగులకు పరిమితమైంది. అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత కార్యాలయ మార్కెట్ బలంగానే ఉందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఇండియా, దక్షిణాసియా, ఆసియా పసిఫిక్ కార్యాలయ, రిటెయిల్ విభాగాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ అన్షుల్ జైన్ తెలిపారు.

# గ్రీన్ కార్డు ప్రోగ్రామ్ సస్పెన్షన్‌పై స్పందించిన ఇన్ఫోసిస్




అర్హులైన విదేశీ కార్మికులకు గ్రీన్‌కార్డు కోసం కంపెనీలు స్పాన్సర్ చేయడానికి వీలు కల్పించే పర్మ్ కార్యక్రమం నుంచి అమెరికా తమను సస్పెండ్ చేయడంపై ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ స్పందించింది. ఈ నిర్ణయం తమ కార్యకలాపాలపై గణనీయమైన ప్రభావం చూపదని భావిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపనీ వెల్లడించింది. 'ట్రంప్ సర్కారు పర్మ్ ప్రోగ్రాం నుంచి ఇన్ఫోసిస్‌ను సస్పెండ్ చేసింది. ఇది కంపెనీ కార్యకలాపాలపై పెద్దగా ప్రభావం చూపదని భావిస్తున్నాం. అమెరికాలో సాంకేతికతకు, ఆవిష్కరణలకు, స్థానిక ఉద్యోగాల నియామకాలకే కంపెనీ పెట్టుబడులు పెడుతోంది. అమెరికాలో వర్తించే నిబంధనలకు, చట్టాలన్నింటికీ కట్టుబడి ఉన్నాం'' అని ఇన్ఫోసిస్ తెలిపింది. హెచ్–1బీ వీసా ఉద్యోగులకు గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కంపెనీలను అనుమతించే పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ (పర్మ్) నుంచి మైక్రోసాఫ్ట్, టాటా, ఇన్ఫోసిస్, విప్రో సహా మొత్తం 8 దిగ్గజ ఐటీ కంపెనీలను అమెరికా సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, గత కొన్నేళ్లుగా భారత ఐటీ కంపెనీల గ్రీన్ కార్డు దరఖాస్తులను గణనీయంగా తగ్గించినట్లు టెక్ వర్గాలు చెబుతున్నాయి. యూఎస్ ఆర్థిక సంవత్సరం–26లో టీసీఎస్ కేవలం 2 పర్మ్ దరఖాస్తులు మాత్రమే సమర్పించడం గమనార్హం.

# వేణు శ్రీనివాసన్ కుటుంబంలో విభేదాలు!




టీవీఎస్ మోటార్ కంపెనీ, దాని హోల్డింగ్ సంస్థ అయిన టీవీఎస్ హోల్డింగ్స్ లిమిటెడ్‌లో యాజమాన్యం, వారసత్వ అంశాల విషయంలో పారిశ్రామికవేత్త వేణు శ్రీనివాసన్ కుటుంబంలో విభేదాలు తలెత్తాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. కుమార్తె లక్ష్మీ వేణు, కుమారుడు సుదర్శన్ వేణు మధ్య సామరస్యపూర్వక, న్యాయమైన పరిష్కారం కోసం ఆయన భార్య మల్లికా శ్రీనివాసన్ ఒత్తిడి చేస్తున్నారని వెల్లడించాయి. కుటుంబంలో చర్చలను ప్రోత్సహిస్తున్నారని తెలిపాయి. ఏప్రిల్ 2025లో తమ ప్రధాన సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్, ఎండీ సుదర్శన్ వేణును ట్రస్ట్ స్ట్రక్చర్స్ ద్వారా ఒక ముఖ్యమైన లబ్ధిదారుగా నియమించినట్లు టీవీఎస్ హోల్డింగ్స్ వెల్లడించడంతో, ప్రమోటరు కుటుంబంలో విభేదాలు తలెత్తినట్లు సమాచారం. వాహన విడిభాగాల తయారీ సంస్థ సుందరం క్లేటాన్ లిమిటెడ్‌కు సారథ్యం వహిస్తున్న కుమార్తె లక్ష్మీ వేణు తన హక్కులను కోరుతున్నారు. కుటుంబ సంపదకు సంబంధించి ఒక న్యాయమైన పరిష్కారం కోసం ఆమె నిరంతరం చర్చలు, సంప్రదింపులు జరపాలని కోరుతున్నారని వారు తెలిపారు.

మార్చి 2024లో వీళ్ల కుటుంబం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఇది వివిధ వ్యాపార విభాగాల్లో టీవీఎస్ బ్రాండు వినియోగం, పోటీ చేయకూడదనే ఒప్పందానికి మాత్రమే పరిమితమైంది. ఆర్థిక పరిష్కారం లేదా విలువ ఆధారిత కుటుంబ సంపద విభజనకు సంబంధించినది కాదు. తమ ఆస్తుల ఆర్థిక విభజనపై ఆ కుటుంబం ఇంకా ఒక పరిష్కారానికి రాలేదని, విభేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి సంబంధిత వర్గాలన్నీ చర్చల్లో పాల్గొనాలని మల్లిక కోరుకుంటున్నారని వర్గాలు తెలిపాయి. వేణు శ్రీనివాసన్ కుటుంబం టీవీఎస్ హోల్డింగ్స్, టీవీఎస్ మోటార్ కంపెనీ, టీవీఎస్ క్రెడిట్, ఎన్‌సీఎల్ సహా పలు కీలక వ్యాపారాలను నిర్వహిస్తోంది. కాగా.. ఇప్పటివరకు ఈ పరిణామాలపై టీవీఎస్ గ్రూపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. టీవీఎస్ హోల్డింగ్స్ వార్షిక నివేదిక ప్రకారం.. టీవీఎస్ హోల్డింగ్స్ లిమిటెడ్‌లో ఆ కుటుంబం లేదా ప్రమోటరు 74.45 శాతం వాటాను కలిగి ఉన్నారు.

# డేటా కేంద్రాల్లోకి 5 ఏళ్లలో రూ.16.67 లక్షల కోట్లు



మనదేశంలో డేటా కేంద్రాల రంగం వేగంగా విస్తరిస్తోంది. సాంకేతికత వినియోగం పెరగడం, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత గిరాకీ, డిజిటలీకరణతో ఈ రంగంలో పెట్టుబడులు–కొత్త ప్రణాళికలు భారీగా పెరుగుతున్నాయి. 2021 నుంచి 2026 ప్రథమార్థం వరకు, భారత డేటా సెంటర్ రంగానికి సుమారు 173 బి.డాలర్ల (సుమారు రూ.16.67లక్షల కోట్లు) పెట్టుబడి హామీలు లభించినట్లు స్థిరాస్తి సేవల సంస్థ సీబీఆర్ఈ తన 'బియాండ్ గ్రోత్: ఇండియాస్ రైజ్ అమాంగ్ ఏపీఏసీ లీడింగ్ డేటా సెంటర్ మార్కెట్స్' నివేదికలో తెలిపింది. ఈ పెట్టుబడుల్లో హైపర్‌స్కేల్, కో–లొకేషన్ ప్రాజెక్టుల వాటా దాదాపు 62 శాతంగా ఉంది. మొత్తం పెట్టుబడి హామీల్లో 15 శాతానికి పైగా ఏఐకి సంబంధించినవేనని పేర్కొంది.

ఏడాది చివరికి 2 గిగావాట్లు..: దేశీయంగా డేటా సెంటర్ మార్కెట్ 2026 తొలి ఆరు నెలల్లో సుమారు 130 మెగావాట్ల కొత్త సామర్థ్యాన్ని జోడించుకుంది. రెండో అర్ధభాగంలో 200 మెగావాట్లకు పైగా సామర్థ్యం అందుబాటులోకి రావచ్చు. దీంతో ఈ ఏడాది చివరికి దేశంలో నిర్వహణలో ఉన్న డేటా సెంటర్ సామర్థ్యం 2 గిగావాట్లకు చేరే అవకాశం ఉంది. క్లౌడ్, హైపర్‌స్కేల్, బ్యాంకింగ్–ఆర్థిక సేవలు–బీమా (బీఎఫ్ఎస్ఐ), ఓటీటీ సంస్థల నుంచి కొనసాగుతున్న గిరాకీ ఈ విస్తరణకు మద్దతు ఇస్తున్నాయి. ఈ విస్తరణతో ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోని 'హై గ్రోత్ మార్కెట్' విభాగం నుంచి 'లీడింగ్ డేటా సెంటర్ మార్కెట్స్' విభాగంలోకి భారత్ చేరనుంది. ఈ విభాగంలో జపాన్, ఆస్ట్రేలియా, చైనాతో పాటు భారత్ ఉంటుంది. ప్రస్తుతం దేశ డేటా సెంటర్ సామర్థ్యంలో ముంబయి కీలక కేంద్రంగా ఉంది. నిర్వహణలో ఉన్న మొత్తం సామర్థ్యంలో ముంబయి వాటా 52%. 2026 ప్రథమార్థంలో కొత్తగా చేరిన సామర్థ్యంలో ముంబయి వాటా ఏకంగా 94%. ముంబయి, చెన్నై, దిల్లీ–ఎన్‌సీఆర్‌లలో దేశంలోని 80 శాతానికి పైగా నిర్వహణ సామర్థ్యం కేంద్రీకృతమై ఉంది. నవీ ముంబయి, చెన్నైలోని సిరుసేరి వంటి మైక్రో మార్కెట్లలో కొత్త కార్యకలాపాలు సాగుతున్నాయి. కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు, ప్రభుత్వ విధానాల మద్దతు, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ వంటివి ఇందుకు కారణాలు.

దేశీయ సంస్థల వాటా పెరుగుతోంది 2026 తొలి 6 నెలల్లో కొత్తగా చేరిన దేశీయ డెవలపర్ల వాటా 48%. అమెరికా సంస్థల వాటా 28%, ఐరోపా సంస్థల వాటా 24 శాతంగా నమోదైంది. మొత్తం డేటా సెంటర్ సరఫరాలో అత్యున్నత ప్రమాణాల 'టియర్–4' కేంద్రాల వాటా 2024లో 21% కాగా, 2026 జూన్ చివరికి 43 శాతానికి పెరిగింది. మౌలిక వసతుల నాణ్యత, సామర్థ్యం పెరుగుతున్నదానికి ఇది సంకేతం.

భవిష్యత్తులో డేటా సెంటర్లు ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు, కోల్‌కతా తదుపరి వృద్ధి కేంద్రాలుగా ఉంటాయి. భూమి, విద్యుత్తు, నీటి లభ్యతతో పాటు మౌలిక వసతులు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు ఇందుకు దోహదం చేస్తాయని వివరించారు.

# క్రీడలు

## యునిసెఫ్ సెలబ్రిటీ సలహాదారుగా స్మృతి మంధాన!



భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన స్మృతి మంధానకు మరో అరుదైన గౌరవం దక్కింది. ఆమె యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ సలహాదారుగా నియమితులయ్యారు. బాలికలకు సమాన అవకాశాలు, వారి ఆరోగ్యం, సంక్షేమం, క్రీడల్లో అవకాశాలు వంటి విషయంలో యునిసెఫ్‌తో కలిసి స్మృతి పని చేయనుంది. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది.

'యూనిసెఫ్ ఇండియాలో సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం చాలా గర్వంగా ఉంది. క్రికెట్ ఆడుతూ పెరగడం వల్ల ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని నేను నేర్చుకున్నాను. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహంతో, ఆ అవకాశం ఒక అసాధారణమైన విషయంగా మారగలదు. పెద్ద కలలు కనేందుకు, వారి పూర్తి సామర్థ్యాన్ని అందుకొనేలా ప్రతి ఒక్కరికి అవకాశం దక్కాలి' అని స్మృతి మంధాన పేర్కొన్నారు.

## బౌలర్ల కెరీర్‌కు రిస్కే.. 'పిచ్'పై గంభీర్ అసంతృప్తి



మొన్నటికి మొన్న ఒక వన్డే మ్యాచ్‌లో మొత్తంగా 811 పరుగులు.. నిన్న భారత్–వెస్టిండీస్ (IND vs WI) రెండో టీ20లో రెండు జట్ల స్కోరు కలిపి 501. ఇలాంటి భారీ స్కోరుతో కొత్త రికార్డులు నమోదవుతున్నప్పటికీ బ్యాటింగ్ పిచ్‌లతో క్రికెట్ కళ తప్పుతోందనే విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. తాజాగా టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా ఈ విషయంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో బౌలర్ల కెరీర్ ప్రమాదంలో పడుతోందని అన్నాడు. శుక్రవారం జరిగిన రెండో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 20 ఓవర్లలో 249 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన వెస్టిండీస్ మరో 9 బంతులు మిగిలి ఉండగానే 252 పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో ఈ మ్యాచ్‌లో మొత్తంగా ఇరు జట్లూ కలిపి 501 పరుగులు చేశాయి. దీనిపై మ్యాచ్ అనంతరం గంభీర్ మాట్లాడాడు. ''బంతికి, బ్యాట్‌కు మధ్య మంచి పోటీ ఉండాలనే మనమందరం కోరుకుంటున్నాం. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో బౌలర్ల కెరీర్‌లు ప్రమాదంలో పడుతున్నాయి. వారు డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చేందుకు ఎంతగానో శ్రమిస్తారు. కానీ, వారి శ్రమ అంతా వృథా అవుతోంది. బంతికి, బ్యాట్ మధ్య మెరుగైన పోటీ ఉన్నప్పుడే అత్యుత్తమ క్రికెట్‌ను మనం చూడగలం'' అని గంభీర్ వ్యాఖ్యానించాడు.

కొండంత కొట్టినా.. రెండో టీ20లో భారత్ పరాజయం ఇటీవల భారత్–వెస్టిండీస్ మధ్య వన్డే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు నమోదైనప్పుడు కూడా గంభీర్ ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశాడు. రికార్డుల పరంగా, ప్రేక్షకులకు, బ్రాడ్ కాస్టర్లకు ఆ మ్యాచ్ అద్భుతంగా అనిపించినా.. క్రికెట్ అభిమానిగా, కోచ్‌గా తాను అసంతృప్తి చెందినట్లు తెలిపాడు. అది కేవలం బ్యాటింగ్ మాత్రమేనని, క్రికెట్ కాదని అన్నాడు.

ఈ సందర్భంగా వెస్టిండీస్ బౌలర్ రోస్టన్ ఛేజ్‌పై గంభీర్ ప్రశంసలు కురిపించాడు. ''ఒక లైన్ అండ్ లెంగ్త్‌లో బంతులేస్తే బ్యాటర్లు సెటిలైపోతారు. పరిస్థితులను బట్టి వేరియేషన్లను మార్చుకోవాలి. రోస్టన్ ఈ మ్యాచ్‌లో అదే చేశాడు. మధ్య ఓవర్లలో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబేను ఔట్ చేయడంతో భారత్ ఒకింత నెమ్మదించింది'' అని హెడ్‌కోచ్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ఒక్క రోస్టన్ (3/24) మినహా ఇరు జట్ల బౌలర్లందరూ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ఇక, టీమ్‌ఇండియా ఓటమిపై గంభీర్ స్పందిస్తూ.. ''ఇక్కడ నేను ఎవర్నీ నిందించలేను. 250 టార్గెట్ ఇచ్చినప్పుడు గెలుస్తామనే అనుకుంటాం.

## రొనాల్డోపై వేటు



పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డోపై ఆ దేశ ఫుట్‌బాల్ సంఘం తాత్కాలిక నిషేధం విధించింది. ఒక టోర్నీ నడుస్తుండగా జాతీయ జట్టు నుంచి వెళ్లిపోయాడనే కారణంతో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రధాన కోచ్ జోర్జ్ జీసెస్‌తో వివాదం కారణంగా నేషన్స్ లీగ్‌లో డెన్మార్క్‌తో మ్యాచ్‌కు ముందు రొనాల్డో జట్టును వీడాడు. ఈ టోర్నీలో నార్వేతో మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశం ఇస్తానని.. కోచ్ జోర్జ్ తనను బెంచ్ మీదే కూర్చోబెట్టాడని అతడు ఆరోపించాడు. డెన్మార్క్‌తో పోరుకు ముందు జాతీయ జట్టును వీడినందుకు సహచరులు, మద్దతుదారులను అతడు క్షమాపణలు కోరాడు. తాను జాతీయ జట్టుకు ఆడటానికి, జట్టును గెలిపించడానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పాడు. అయితే శిబిరం నుంచి రొనాల్డో వీడడాన్ని తీవ్రంగా పరిగణించిన పోర్చుగల్ ఫుట్‌బాల్ సంఘం అతడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఈ విషయంపై విచారణ చేపట్టింది. నేషన్స్ లీగ్‌లో నార్వేతో మ్యాచ్‌లో రొనాల్డో సబ్‌స్టిట్యూట్‌గా ఉన్నాడు. కానీ బరిలోకి దిగలేదు. రొనాల్డో స్థానంలో గత మూడు మ్యాచ్‌ల్లో ఆడిన గొంకాలో రమోస్ గోల్స్ కొట్టాడు. జోర్జ్ జీసెస్ పోర్చుగల్ కోచ్‌గా ఈ ఏడాది జులైలో బాధ్యతలు చేపట్టాడు.

## ఆ ఓవర్‌ను మయాంక్‌కు ఎందుకివ్వలేదు..



రెండో టీ20లో విండీస్ ఛేదనలో 17వ ఓవర్‌ను కుల్‌దీప్‌కు ఇవ్వడాన్ని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ ప్రశ్నించాడు. ఆ ఓవర్‌ను మయాంక్ యాదవ్‌తో వేయించాల్సిందని అభిప్రాయపడ్డాడు. ఆ ఓవర్లో కుల్‌దీప్ 24 పరుగులివ్వడంతో విండీస్ మ్యాచ్‌లో పైచేయి సాధించింది. విజయానికి మరింత చేరువైంది. 18వ ఓవర్లో బౌలింగ్ చేసిన అర్ష్‌దీప్.. పరుగుల ప్రవాహాన్ని ఆపలేకపోయాడు. అతడు 17 పరుగులిచ్చాడు. ఈ నేపథ్యంలోనే గావస్కర్ స్పందించాడు. ''నేనైతే 17వ ఓవర్‌ను అర్ష్‌దీప్ లేదా మయాంక్‌కు ఇచ్చేవాణ్ని. అర్ష్‌దీప్ 18వ ఓవర్లో భారీగా పరుగులిచ్చిన మాట నిజమే. కానీ మయాంక్ ఆరంభంలోనే రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. మొత్తంగా మూడు వికెట్లు పడగొట్టాడు'' అని అన్నాడు. ''అప్పటికి మయాంక్ దాదాపు 12 ఎకానమీ రేట్‌తో పరుగులిచ్చాడు. ఆ దశలో విండీస్‌కు అంతకన్నా ఎక్కువ రన్‌రేట్‌తో పరుగులు కావాలి. మయాంక్ ఆ ఓవర్ వేసి, వికెట్ తీసుంటే మ్యాచ్ మనవైపు తిరిగేదేమో. గొప్ప డెలివరీ వేయకపోయినా వికెట్ దక్కేదేమో'' అని గావస్కర్ చెప్పాడు. మయాంక్ వికెట్ పడగొట్టి ఉంటే వెస్టిండీస్ ఒత్తిడికి గురయ్యేదని అన్నాడు. 9వ ఓవర్లో దూబెకు బంతినివ్వడం కూడా సరికాదని గావస్కర్ తెలిపాడు.

## వైభవ్‌ను ఎందుకు ఆడించరు..

టీమ్ ఇండియా యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి వయసు ప్రతికూలంగా మారకూడదని, ప్రదర్శన ఆధారంగా అతడికి తుది జట్టులో అవకాశం ఇవ్వాలని మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. ''వైభవ్ సూర్యవంశీ మంచి ఫామ్‌లో ఉన్నాడు. నాలానే తొలి బంతి నుంచే బాదేయాలన్న కసితో అతడు ఉంటాడు. అయితే భారత్‌కు ఆడే అవకాశం అతడికి ఎప్పుడు వస్తుంది? ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడు అన్నదే సమస్య. వయసు విభాగాల క్రికెట్ ఆడుతున్నప్పుడు ఆటగాళ్ల వయసు పరిగణనలోకి తీసుకోవాలి. అంతేగానీ.. ఐపీఎల్ లేదా టీమ్‌ఇండియాకు ఆడిన అనుభవం ఉన్న ఆటగాడికి వయసు కొలమానం కాకూడదు. 37 ఏళ్ల కోహ్లి ఆడినా, 15 ఏళ్ల వైభవ్ ఆడినా అందుకే ప్రదర్శనే ప్రామాణికం కావాలి'' అని చెప్పాడు.



# 'తులాభారం'- పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా లాంచ్




**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు వివేక్ ఆత్రేయ క్రేజీ కాంబినేషన్ లో మోస్ట్ ఎవైటెడ్ #RT78 తెరపైకి వస్తోంది. రవితేజ ట్రేడ్‌మార్క్ ఎనర్జీ, వివేక్ ఆత్రేయ యూనిక్ స్టయిల్ స్టోరీ టెల్లింగ్ కలగలిసి క్రైమ్, డ్రామా, ఎంటర్‌టైన్‌మెంట్ తో సరికొత్త అనుభూతిని అందించను న్నాయి. బ్లాక్‌బస్టర్ 'ఇరుముడి' విజయంతో జోరు మీదున్న రవితేజ.. ఈ ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై లక్ష్మణ్, శ్రీనిరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ సినిమా టైటిల్‌ను రివిల్ ను మేకర్స్ వినూత్నంగా రూపొందించిన 'ది టైటిల్ డాక్యుమెంటరీ' వీడియోను విడుదల చేశారు. వివేక్ ఆత్రేయ తనదైన స్టయిల్ లో రూపొందించిన ఈ వీడియోను మై హోమ్ రామ్ విడుదల చేశారు. 'తులాభారం' టైటిల్‌ను ఎంపిక చేసే ప్రక్రియ వెనుక జరిగిన సరదా, వినోద భరితమైన సంభాషణలను ఈ వీడియో ద్వారా చూపించారు. విలక్షణమైన క్రియేటివ్ వరల్డ్ ను పరిచయం చేస్తూ ఈ టైటిల్ డాక్యుమెంటరీ ఆకట్టుకుంటోంది.ఈ వీడియోలో సినిమాలోని కీలక పాత్రలను కూడా పరిచయం చేశారు. జడేజాగా అనిల్ కరెల్ల, రాబిన్‌గా రవి ఆంటోనీ, సౌండ్‌గా అనస్వర రాజన్, దేవరాజ్‌గా తరుణ్ భాస్కర్, శివాజీ రావుగా జేడీ చక్రవర్తి, కృష్ణవేణిగా ప్రియాంక మోహన్ కనిపించనున్నారు.దశాబ్దాలుగా రవితేజ తనదైన ఎనర్జీ, పవర్ ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో 'మాస్ మహారాజా'గా ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

## వుదయం సినిమా MOVIE TIME!

# "రణబాలి" నుంచి 'కోబలి..' లిరికల్ సాంగ్ రిలీజ్



**వుదయం సినిమా:** విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తు న్నారు. రశ్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణ బాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "రణబాలి" సినిమా నుంచి మేకర్స్ 'కోబలి..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్ కు అజయ్ – అతుల్ గూస్ బంప్స్ తెప్పించేలా ట్యూన్ కంపోజ్ చేయగా, కేశవాదిత్య పవర్ ఫుల్ లిరిక్స్ రాశారు. వి.ఎం. మహాలింగం మెస్మరైజ్ చేసేలా పాడారు. 'కోబలి..' సాంగ్ ఎలా ఉందో చూస్తే – 'రేగే ఉరుము దరువు మిన్ను ముట్టగా, అష్టదిక్కులే పిక్కటిల్లవా, రేగే ఉరుము దరువు నిన్ను ముట్టగా, అష్ట దిక్కులే పిక్కటిల్లవా, జోగే రెయ్యిలోన పగల సెగలిలా పొగులుతుండగా పగలు పుట్టదా, మూగే సావునైన సంపడానికి సత్తువియ్యరా కాలకాలుడా, పెన్నేరల్లె తేరు ఉరకలెత్తగా సిందు తొక్కమా భద్రమల్లడా...' అంటూ సాగుతుందీ పాట. ఈ పాటలో విజయ్ దేవర కొండ ఫెరోషియస్ గా కనిపించి ఆకట్టుకుంటున్నారు.

# 'కాస్ట్' టీజర్ లాంచ్ ఈవెంట్




**వుదయం సినిమా:** వరుణ్ సందేశ్, గగన్ బాబు , సత్యం రాజేశ్, రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషల్ డ్రామా 'కాస్ట్'. ఏకే జంపన్న రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. కశిక కపూర్, దివి వద్యా కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ తో ఆసక్తిని పెంచిన చిత్ర బృందం తాజాగా ఇంటెన్స్ అండ్ గ్రిప్పిం గ్ టీజర్‌ను లాంచ్ చేసింది. కుల వివక్ష అనే ప్రధాన ఇతివృత్తాన్ని పరిచయం చేస్తూ టీజర్ ప్రారంభ మవుతుంది. అగ్రకులానికి చెందిన వారి ఇంట్లోకి తమకు ప్రవేశం లేదని ఓ తండ్రి తన కొడుకుకు చెప్పే సన్నివేశంతో కథలోని సామాజిక అంశాన్ని పరిచయం చేశారు. ఆ తర్వాత కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించే ఓ పోలీస్ అధికారి పాత్రను చూపించారు. గ్రామంలో వరుసగా జరిగే దారుణ హత్యలతో కథ మరింత ఉత్కం ఠభరితంగా మారుతుంది. వరుణ్ సందేశ్, సత్యం రాజేశ్, నాగబాబు, రాజా రవీంద్ర, యాంకర్ రవి, దివి వద్యా పోషిస్తున్న కీలక పాత్రల తాలూ కు గ్లింప్స్ టీజర్‌లో ఆకట్టుకున్నాయి.దర్శ కుడు ఏకే జంపన్న సున్నితమైన సామాజిక అంశాన్ని ఎంచుకుని, దానికి డ్రామా జోడిస్తూ ఆసక్తికరమైన సోషల్ థ్రిల్లర్‌గా తెరకెక్కించి నట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. కథను ముందుకు నడిపించ డంలో ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉన్నట్లు కనిపిస్తోంది.వరుణ్ సందేశ్ తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకోగా, పోలీస్ అధికారి పాత్రలో గగన్ బాబు పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. సత్యం రాజేశ్ తన పాత్రతో ఆసక్తిని పెంచారు. దివి వద్యా విభిన్నమైన పాత్రలో కనిపిస్తూ సర్‌ప్రైజ్ చేశారు. వీకే రామరాజు సినిమాటోగ్రఫీ, అనూప్ రూబెన్స్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలవ నున్నాయి. అవినాష్ జీ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. విడుదలకు సిద్ధ మవుతున్న 'కాస్ట్' టీజర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది.

# 'ట్రయల్ అండ్ ఎర్రర్' ఘనంగా ప్రారంభం



**వుదయం సినిమా:** నిర్మాత శరత్ మరార్ నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సత్యదేవ్, ఫరియా అబ్దుల్లా, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సిరీస్ 'ట్రయల్ అండ్ ఎర్రర్' సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్ర మాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజర య్యారు.కమల్ హాసన్ నటించిన స్టైలిష్ థ్రిల్లర్ 'చీకటి రాజ్యం'కు దర్శకత్వం వహించిన రాజేష్ సెల్వ ఈ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. విభిన్నమైన పాత్రల్లో తనదైన నటనతో ఆకట్టుకునే సత్యదేవ్.. ఈ సిరీస్ లో ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేస్తున్నారు. ఇందులో రమ్యకృష్ణ కీలక పాత్రలో నటిస్తు న్నారు. తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో కథకు మరింత ఇంటెన్సిటీ తీసుకురానున్నారు. ఫరియా అబ్దుల్లా కూడా ఈ ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ఈ సిరీస్‌లో విరాజ్ అశ్విన్, చైతన్య కృష్ణ, వర్ష బొల్లమ్మ, యష్ పూరి, సంపత్ రాజ్, సుబ్బరాజు కీలక పాత్రల్లో నటిస్తు న్నారు.నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణంలో, రాజేష్ సెల్వ దర్శక త్వంలో రూపొందుతున్న 'ట్రయల్ అండ్ ఎర్రర్'.. ప్రతిభావంతులైన నటీనటుల కలయికతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

నటీనటులు: సత్యదేవ్, రమ్యకృష్ణ, ఫరియా అబ్దుల్లా, విరాజ్ అశ్విన్, చైతన్య కృష్ణ, వర్ష బొల్లమ్మ, యష్ పూరి, సంపత్ రాజ్,
సుబ్బరాజు.

# నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో 'దహిణి ది విచ్'



**వుదయం సినిమా:** విలక్షణ నటుడు జేడీ చక్రవర్తి నటించిన 'దహిణి ది విచ్' చిత్రానికి మరో అంతర్జాతీయ పురస్కారం లభించింది. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు ధీటుగా నిర్వహించే నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో 'దహిణి ది విచ్' చిత్రానికి గాను జేడీ చక్రవర్తికి ఉత్తమ నటుడు పురస్కారం లభించింది. ప్రపంచవ్యాప్తంగా 150 నామినే షన్స్ రాగా బెస్ట్ లీడ్ యాక్టర్ కేటగిరీలో జేడీ చక్రవర్తికి ఈ అవార్డ్ రావడం గొప్ప విషయం.ఇప్పటికే ఎన్నో ఫిలిం ఫెస్టివల్స్ లో ఈ చిత్రం అనేక అవార్డ్స్ ను కైవసం చేసుకుంది. తాజాగా నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో 'దహిణి' ఉత్తమ చిత్రం అవార్డ్ ను సైతం దక్కించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖ నటులు ఈ నామినేషన్ లో ఉండగ భారతీయ నటుడు జేడీ చక్రవర్తి కి ఈ అవార్డ్ దక్కడం గర్వించదగ్గ విషయం. ఈ సందర్భంగా జేడి చక్రవర్తి మాట్లాడుతూ .. 'ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన హేమాహేమీలు రూపొందించిన చిత్రాలతో పోటీపడి 'దహిణి' ఉత్తమ చిత్రం అవార్డ్ దక్కించుకోవడం భారతీయ చలనచిత్ర పరిశ్రమ కి గర్వ కారణం , అలానే దాదాపు 150 నామినేషన్లలో వరల్డ్ వైడ్ నటులు ఉండగా , బెస్ట్ లీడ్ యాక్టర్ అవార్డ్ నన్ను వరించడం నన్నెంతో ఆనందానికి గురి చేసింది. ఇలాంటి చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి, నన్ను నమ్మి ఈ క్యారెక్టర్ ను నా కిచ్చిన దర్శకుడు రాజేష్ టచ్ రివర్ కి, అలానే నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ నిర్వాహకులకు నా కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని అన్నారు.

# ఈ నెల 30న రిలీజ్ "చంద్రయాన్"

**వుదయం సినిమా:** రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో "చంద్ర యాన్" టైటిల్ తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తు న్నారు. ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్ పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన "చంద్రయాన్" సినిమా ఈ నెల 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బృందం యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చింది. రూరల్ బ్యాక్ డ్రాప్ లో సరికొత్త కథా కథనాలతో మంచి ఎంటర్ టైనింగ్ సినిమా చేశారంటూ సెన్సార్ టీమ్ ప్రశంసించారు. ఇటీవలే రిలీజ్ చేసిన "చంద్రయాన్" చిత్ర గ్లింప్స్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ నెల 30న థియేటర్స్ లో స్ట్రాంగ్ కంటెంట్ ఉన్న అడ్వెంచర్ ఫన్ మూవీ చూడబోతున్నామనే ఇంప్రెషన్ ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్ తో ప్రేక్షకుల్లో కలుగుతోంది.



# నవంబర్ 6న 'నాన్న కుట్టి'



**వుదయం సినిమా:** డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్ బేస్డ్ చిత్రాలతో ఆకట్టుకునే విజయ్ ఆంటోని ప్రస్తుతం 'నాన్న కుట్టి' అంటూ ఆడియెన్స్ ముందుకు రానున్నారు. ఫాదర్ అండ్ డాటర్ సెంటిమెంట్‌తో ము. మారన్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ హీరోగా చేస్తున్న చిత్రం 'నాన్న కుట్టి'. యాక్షన్, కుటుంబ భావోద్వేగాలు, ఇంటెన్స్ డ్రామాగా ఈ మూవీని రూపొందిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని నిర్మాతగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ మూవీకి సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ అధినేత రామంజనేయులు జవ్వాజీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దీపావళి సందర్భంగా ఈ మూవీని నవంబర్ 6న విడుదల చేయబోతోన్నారు. దీపావళి సెలవులు కలిసి వచ్చేలా ఈ మూవీ రిలీజ్‌ని ప్లాన్ చేసినట్టు కనిపిస్తోంది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లను గమనిస్తే.. ఈ సినిమాలో తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌ని ప్రధానంగా చూపించబోతోన్నారని అర్థం అవుతోంది.ఈ చిత్రంలో ప్రీతి అస్రాని, లిథన్య, భగవతి పెరుమాళ్, హరిప్రియ ఇసై, అరువి మధన్, చిత్ర లక్ష్మణన్, శ్రీజ రవి, వెట్టై ముత్తుకుమార్, జెన్సన్ దివాకర్, మురుగానందం, మున్నార్ రమేష్, లిస్సీ ఆంటోని, కుమార్ నటరాజన్, విజయన్, ప్రవీణ, హరిత, హరిప్రియ తదితరులు ముఖ్య పాత్రల్నిపోషించారు.రాజీవ్ రాజేంద్రన్ సినిమాటోగ్రఫర్‌గా పనిచేయగా, విజయ్ ఆంటోనీ సంగీతం అందించడంతో పాటు ఎడిటర్‌గా కూడా వ్యవహరించారు. ఎ. రాజా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వర్తించారు.యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, భావోద్వేగ కథనం, హృద్యమైన సంగీతం, ఆకట్టుకునే స్క్రీన్‌ప్లేతో 'నాన్న కుట్టి' చిత్రం రానుంది. నవంబర్ 6న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

# నవంబర్ 5 'రామాయణ' పార్ట్ 1

**వుదయం సినిమా:** నవ రాత్రుల తొలి రోజును పురస్క రించుకుని 'రామాయణ' మేకర్స్ ప్రత్యేక ప్రకటన చేశారు. రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, రవి దూబే లక్ష్మణుడిగా, రాకింగ్ స్టార్ యష్ రావణుడిగా కనిపిస్తున్న కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. రెండు భాగాలుగా తెర కెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక ఇతిహాస చిత్రంలో పార్ట్ 1 2026 నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నట్లు ప్రకటించారు. "యే రామ్ కే యుగ్ కా ఆరంభ్ హై" (ఇది రాముడి యుగానికి ఆరంభం) అనే సందేశంతో కొత్త శకానికి శ్రీకారం చుడుతున్నట్లు వెల్లడించారు. అలాగే ఈ దసరా నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నట్లు తెలిపారు.తాజాగా విడుదలైన పోస్టర్‌లో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే కనిపిస్తున్నారు. వీరి వెనుక రావణుడిగా రాకింగ్ స్టార్ యష్ భారీగా కనిపిస్తూ పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కథలోని ప్రధాన పాత్రల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతిబింబించేలా ఈ పోస్టర్‌ను రూపొందించారు. భారీ సెట్లు, అద్భుతమైన వస్త్రధారణ, ప్రతి అంశంలోనూ చూపించిన ప్రత్యేక శ్రద్ధ.. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ ఇతిహాస ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నాయి.ఈ సందర్భంగా మేకర్స్ సోషల్ మీడియాలో పోస్టర్‌ను పంచుకుంటూ.. "నవరాత్రుల పవిత్ర సందర్భంగా కొత్త శకారంభాన్ని జరుపుకుంటున్నాం. యే రామ్ కే యుగ్ కా ఆరంభ్ హై. నమిత్ మల్హోత్రా 'రామాయణ' పార్ట్ 1 నవంబర్ 5 నుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రీమియం ఫార్మాట్లలో థియేటర్లలో విడుదల కానుంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.